# నడుస్తున్న తెలంగాణ

ISSN 2349-2376

ఆర్థిక, రాజకీయ, సాహిత్య మాసపత్రిక

సంపుటి:15 సంచిక:7 173 జూలై 2025 హైదరాబాద్

- మై డియర్ తెలంగాణైట్స్
- పతి-చితి: పేరంటాళ్ళ గాథల్లో సతీసహగమనం
- విశ్వవిద్యాలయ తెలుగు విద్యావిధానంలో నూతన శకం సాధ్యమయ్యేనా?
- "నా కవిత్వ వాహకానికి ప్రజలే ఇంధనం"-జూకంటి జగన్నాథం
- బలిపీఠంపై బడి పిల్లలు
- ప్రాచీన సాహిత్యంలో రుద్రమదేవి



# నడుస్తున్న తెలంగాణ

ఆర్థిక, రాజకీయ, సాహిత్య మాసపత్రిక

ISSN 2349-2376

జూలై 2025

సంచిక : 7

సంపుటి : 16



గౌరవ సంపాదకులు

**ప్రొ॥ అడపా సత్యనారాయణ**

సలహా మండలి

**అల్లం నారాయణ**

చైర్మన్(పూర్వ)-ప్రెస్ అకాడమి

ప్రొఫెసర్ గణేష్

ప్రిన్సిపాల్(పూర్వ), ఆర్ట్స్ కళాశాల, ఓయు.

ప్రధాన సంపాదకుడు

**ప్రొఫెసర్ చింతకింది కాశీం**

**సంపాదకురాలు**

**స్నేహలత ఎం.**

**సంపాదకవర్గం**

**ప్రొఫెసర్ ఎ. సిల్మానాయక్,**
ప్రిన్సిపాల్, టి.ఎస్.పి. కళాశాల

**డా॥చంద్రయ్య ఎస్.** అసిస్టెంట్ ప్రొఫెసర్ (PT)

**డా॥శివరాత్రి సుధాకర్,** అసిస్టెంట్ ప్రొఫెసర్ (PT)

**డా॥ఇమ్మిడి మహేందర్** అసిస్టెంట్ ప్రొఫెసర్ (PT)

**డిటిపి, లే ఔట్ :** స్నేహ

**కవర్ డిజైన్ :** శేషు



రచనలు పంపాల్సిన చిరునామా

**స్నేహలత ఎం.,**

ఇంటి నెం. 2-95, ఫ్లాట్ నెం. 301,
వైష్ణవి స్మార్ట్, రోడ్ నెం. 2,
కాకతీయ నగర్, హబ్సిగూడ
హైదరాబాద్-500 007.

మెయిల్: **nadusthunnatelangana@gmail.com**

**ఫోన్ నెం.: 9290745490**


## సంపాదకుని ఉత్తరం

*ఈ రాత్రి*
*సముద్రంలా ఉంది*
*అలల సంగీతంలా*
*చెట్లకొమ్మల మీద*
*గాలివీస్తుంది*

*ఈ రాత్రి*
*యుద్ధంలో వీరుడిలా ఉంది*
*ప్రభాత గీతంలా*
*రక్తచలన సంగీతం వినిపిస్తుంది*

**జూలై, 2025**


*నూరు పూలు వికసించనీ, వేయి ఆలోచనలు సంఘర్షించనీ అన్నట్లు ప్రజానుకూలమైన భిన్న ఆలోచనలకు మా పత్రికలో చోటుంటుంది. కనుక ఈ పత్రికలో ముద్రించిన అభిప్రాయాలు రచయితలవే. సంపాదకవర్గానికి ఏకీభావం ఉండనవసరం లేదు.*

# తెలంగాణ తొవ్వ


**సంపాదకీయం**

| | | |
|---|---|---|
| మై డియర్ తెలంగాణైట్స్ | **డా॥చంద్రయ్య శివన్న** | 5 |

**సామాజికం**

| | | |
|---|---|---|
| బలిపీఠంపై బడిపిల్లలు | **సూర్యచంద్ర** | 6 |
| విశ్వవిద్యాలయాల తెలుగు విద్యావిధానంలో నూతన శకం సాధ్యమయ్యేనా? | **ఆచార్య వెంకటరామయ్య గంపా** | 9 |

**తొవ్వముచ్చట**

| | | |
|---|---|---|
| నా కవిత్వ వాహకానికి ప్రజలే ప్రధాన ఇందనం –జూకంటి జగన్నాథం | **తీగల లావణ్య** | 16 |

**సాహిత్య పరిశోధన**

| | | |
|---|---|---|
| పతి–చితి: పేరంటాళ్ల గాథల్లో సతీసహగమనం | **కొల్లాపురం విమల** | 23 |
| గీతాంజలి కథలు–ఉర్దూ పదప్రయోగ ఔచిత్యం | **ఎన్.సుభాషిణి** | 32 |
| మెదక్ జిల్లా సాహిత్య చరిత్ర | **డా॥వి.వెంకటేశ్** | 36 |
| ప్రాచీన తెలుగు సాహిత్యంలో రుద్రమదేవి | **సి.హెచ్.విఠల్** | 47 |


<u>రచయితలకు సూచనలు:</u>

**1. రచనలను డీటీపీ చేసి పంపేవారు ప్రతినెల 15వ తేదీలోగా ఓపెన్‌ఫైల్‌లో లేదా వర్డ్ ఫైల్‌లో పత్రిక మెయిల్ అడ్రస్‌కు పంపించగలరు.**

**2. స్మార్ట్‌ఫోన్లలో ఫొటోలు తీసి వాట్సప్ ద్వారా రచనలను పంపించవద్దు.**

**3. ఇతర పత్రికలకు పంపే రచనలను మాకు పంపవద్దు.**

**4. అర్థం కాకుండా, కొట్టివేతలతో ఉండే వ్యాసాలను పత్రిక అంగీకరించదు.**

**5. పరిశోధక రచయితలు పంపే రచనలు కచ్చితంగా తమ ఆమోదపత్రం జతచేసి పంపించగలరు. గతంలో ముద్రించిన వ్యాసాల్లోని పేరాలు ఎత్తి రాసి పంపవద్దు.**

**- సం.**

సంపాదకీయం

# మై డియర్ తెలంగాణైట్స్

డా. చంద్రయ్య శివన్న

మనమంతా తెలంగాణ కోసం అహర్నిషలు శ్రమించాం. త్యాగాలు చేసాం. దీనికోసం మనతోపాటూ ఎన్నో ప్రజా సమూహాలు పనిచేసాయి. 1990వ, దశకంనుంచి తెలంగాణ తప్ప మరో ధ్యాసలేకుండా మనతరం తెలంగాణను శ్వాసించింది. మరీ ముఖ్యంగా 2010నుంచి 2014లో తెలంగాణ వచ్చేంతవరకు దాదాపు యుద్ధక్షేత్రంలో ఉండే పనిచేసాం. ఉదయం లేసింది మొదలు రాత్రి ఎప్పుడో పడుకునేదాకా తెలంగాణ రాష్ట్రసాధన ఆలోచనలతో, ఆ ఘర్షణతోనే మన కాలమంతా గడిచింది. ఎముకలు కొరికే చలిలో అర్ధరాత్రులు, అపరాత్రులు అనకుండా పోస్టర్లు వేసాం. మండు వేసవిలో కాళ్లకు బొబ్బలొచ్చినా పాదయాత్రలు చేసాం. ముసురు వానలో నిలునిలువునా నీరైనా తెలంగాణ ఆలోచనను వీడలేదు. తెలంగాణవాళ్లు ఎక్కడ కనబడినా, గుండెలకు హత్తుకున్నాం. తెలంగాణను ప్రేమించే తెలంగాణేతరులు కనిపిస్తే, వాళ్లను గొప్ప ప్రజాస్వామ్యవాదులుగా నెత్తినపెట్టుకొని ఊరేగాం. కవిత్వం రాసేవాళ్లం కవిత్వం రాసాం. పాడేవాళ్లం పాటలు పాడాం. గజ్జెకట్టేవాళ్లం ధూంధాం ఆడాం. మాట్లాడేవాళ్లం మాట్లాడాం. కన్నీళ్లు కార్చాం. కత్తుల కోలాటమాడాం. తెలంగాణ కోసం ప్రాణంపెట్టి పనిచేసాం. ప్రాణాలను త్యాగం చేసాం. మనందరం కలిసి ఇంతచేస్తేనే కదా తెలంగాణ వచ్చింది. ఇట్లా దాదాపు మనతరం యవ్వనమంతా ఆ ఆకాంక్షలతోనే ఖర్చైపోయింది.

ఇవన్నీ తెలంగాణవాళ్లకు తప్ప, తెలంగాణను ప్రాణప్రదంగా ప్రేమించినవాళ్లకు తప్ప మనం అర్థంచేసుకోవాలని కోరుకుంటున్న వేరెవరికీ, ఎంతచెప్పినా అర్థంకాదు. వాళ్ల మనసుకెక్కదు. వాళ్ల విశాల హృదయాలమధ్య మనం వామనుల్లా కనిపిస్తుంటాం. మనం కుచించుకుపోయినవాళ్లుగా చూడబడుతాం. "ప్రతిభ'లేకున్నా ప్రాంతంపేరు చెప్పి బతికేవాళ్ల'లాగా గణించబడుతాం. ఇన్ని త్యాగాలమధ్య తెచ్చుకున్న తెలంగాణకు సరైన గుర్తింపురాకపోతే, గుండెలు పగిలిపోయేలా ఏడ్చిన కళ్లు 'ఆగ్రహ ప్రకటన' చేస్తాయనే 'ఇంగితజ్ఞానం' వాళ్లకు లేకపోతే ఎలా అని గోసపడవల్సిన అవసరం లేదు. తెలంగాణ సామూహిక ప్రయోజనాలకోసం ఏం మాట్లాడినా వాటివెనుక ఇంత దుర్భర వేదన ఉంటుందని వాళ్లు ఎప్పుడు తెలుసుకుంటారో మై డియర్ తెలంగాణైట్స్. మన కన్నీళ్ల ఆనవాళ్లను ఎప్పుడు గుర్తుపడతారో.

కల్లున్నకాలమంతా ఎలాగూ లెక్కచేయలేదు. మనకు సొంత ప్రభుత్వం, సొంతం రాష్ట్రం వచ్చినా మన విషయంలో వాళ్ల వైఖరి అలాగే ఉండటానికి వాళ్లు ఎంతమాత్రమూ కారణం కాదేమోననే చేదునిజాన్ని చెప్పటానికే ఈ వ్యాసం. మనమే వాళ్లకు ఆ అవకాశాన్నీ, ఏలు దూర్చే సందునూ ఇస్తున్నామనిపిస్తోంది. ఈ పదకొండేళ్లకాలంలో మనమెప్పుడూ ఆత్మవిమర్శ చేసుకోలేదేమో. ఇలా రాయడం, వాళ్లనుంచేదో ప్రేమను ఆశించటానికో, ఇకనుంచైనా సహానుభూతితో మెలగండని బతిమాలడంకోసమో కాదు. ఎంతమాత్రమూ కాదు గాక కాదు. మనలో మనం సంభాషించుకోవడానికి, మరోసారి సోయిలోకి రావడానికి ప్రయత్నం చేయడంకోసం మాత్రమే. గుండెలమీద చెయ్యేసుకొని చెప్పండి మై డియర్ తెలంగాణైట్స్, తెలంగాణ వచ్చిన తర్వాత మనందరం ఎంత రిలాక్స్ కాకూడదో అంత రిలాక్స్ అయ్యామా లేదా? ఆ క్రమంలో మనలో ఉదాసీనత ప్రవేశించనవసరం లేనంతగా ప్రవేశించిందా లేదా? మనలో చాలామందిమి ప్రభుత్వ 'పెద్ద మనుషుల', చల్లనిచూపులకోసం వెంపర్లాడామా లేదా? తెడ్డును మధ్యలోనే తగలేసామా లేదా? మన ఆకాంక్షలైన, రాజకీయార్థిక విషయాలపట్ల మనకు గల ఉద్దేశపూర్వక ఏమరపాటు పక్కనపెడదాం. వాటిని ప్రశ్నిస్తే, ఆ ప్రభుత్వ కరుణకటాక్షాలకు దూరమవుతామనుకోవచ్చు. కనీసం విధాన ప్రణాళికను శాస్త్రీయంగా రచించుకొని అందుకోసం ప్రభుత్వాల మెడలువంచి పనిచేయించుకున్నామా? తెలంగాణ సోయితో అసలు మెలిగామా? కానీ, దాన్ని ఎదిరించి ఏమైనా సామూహిక పనులు, సాహసిక చర్యలు చేసామా? ఏ ప్రభుత్వాల ఆర్థిక అండదండలతో మనం తెలంగాణ సోయిని వేల పుస్తకాలుగా, డాక్యుమెంట్లుగా వెలువరించాం? లేదు కదా! ఏ కమిట్మెంట్ తోనైతే ఆ పనులు చేసామో తెలంగాణ పునర్నిర్మాణంలో ఆ కమిట్మెంట్ మచ్చుకైనా నిలుపుకోలేకపోయాం. తెలంగాణేతర ప్రాంతాల్లోకి, ఆయా అవకాశాల్లో మనకు రావాల్సిన వాటాపై దృష్టిపెట్టలేదు. కారణాలేవైనా కావచ్చు మనందరం తెలంగాణ సోయిని కోల్పోయామనే మాట వాస్తవం. మొత్తంగా తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకోవడంలో పెట్టిన దృష్టి, చేసిన త్యాగం దాని పునర్నిర్మాణంలో పెట్టలేకపోయామనేది ఏ రంగాన్ని అధ్యయనం చేసినా ఇట్టే తెలిసిపోతుంది.

ఇకనైనా, భిన్న రంగాలపట్ల సమన్వయంతో, ప్రణాళికాబద్ధంగా, సామూహికంగా కలిసి పనిచేయకపోతే మనం చేసిన పోరాటం, మన ఆకాంక్షలు కలలుగానే మిగిలిపోతాయి. అన్నిరంగాల్లో తెలంగాణ ఆకాంక్షలకు అద్దంపట్టేలా విధాన రూపకల్పనకు మనమందరం ప్రభుత్వాలను డిమాండ్ చేద్దాం. చివరగా ఒకమాట, ప్రభుత్వాలకంటే పౌరసమాజం బాధ్యతే దీంట్లో ఎక్కువ అనే విషయం గమనంలో ఉంచుకోవాల్సి ఉంటుంది.

T

సామాజికం

# బలిపీఠంపై బడిపిల్లలు

## (గౌరవ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గారికి బహిరంగలేఖ

సూర్యచంద్ర

జీవితానికి ఉపయోగపడలేనిది, భవిష్యత్తుకు పనికిరానిది, ప్రశ్నించే తత్వం నేర్పనిది, మనిషి లోపలి సృజనాత్మక శక్తుల్ని బయటకు తీయలేనిది, అది ఏదైనా సరే అశాస్త్రీయమే కాదు. అనవసరం అనుకుంటాను. చదువు విషయంలోనూ అంతే. మీరు, అసెంబ్లీ సాక్షిగా విద్యావ్యవస్థను ప్రక్షాళన చేయాలి అని మాట్లాడారు. అంతేకాకుండా ఇప్పుడున్న విద్యావిధానం సమాజానికి ప్రమాదకరమని మీరు అన్నారు. నాకు గుర్తున్నంతవరకు తెలంగాణ రాష్ట్రం వచ్చినప్పటికీ ఇట్లా ఒక ప్రజా ప్రతినిధి మాట్లాడటం ఇప్పుడే విన్నాను. ఈ మాటలు ఉపాధ్యాయుడిగా నాకైతే ఆసక్తిని కలిగించింది. అంతేకాకుండా మా నియోజకవర్గానికి ఎమ్మెల్యే (ఇప్పుడు మంత్రి)గా పని చేస్తున్నన్న వాకిట శ్రీహరి గారు నిత్యం బడులను హాస్టళ్లను సందర్శిస్తున్నారు. ఈ సందర్భంగా అది కూడా మీకు గుర్తు చేస్తున్నాను. ఇక విద్యా వ్యవస్థను మీరు ప్రక్షాళనం చేయగలరా? లేదా ఒట్టి మాట గానే మిగులుతుందా? అనేది ఎవరి అంచనాలు వారికి ఉండవచ్చు. సాధ్యమవుతుందా? కాదా? అనేది కూడా అంతే. విద్యా వ్యవస్థ గురించి మాట్లాడితే చాలా విషయాలు మాట్లాడుకోవచ్చు. కానీ, ఒక విషయం గురించి మాత్రం అత్యవసరంగా, ముఖ్యంగా మాట్లాడుకోవాల్సి ఉంటుంది. అది తెలంగాణ రాష్ట్రంలో ఆరవ తరగతి నుంచి, పదవ తరగతి వరకు విద్యార్థుల మీద పెను భారంగా తయారైన రాత పని, పరీక్షల్లో భాగంగా పరీక్షల మార్కులకు వెయిటేజీగా ఉంటున్న ఈ రాత పని గురించి మాత్రం తప్పక మాట్లాడుకోవాలి.

మొదట ఈ రాత పని ఎలా ఉంటుందో చూద్దాం.

హై స్కూల్లో పరీక్ష పద్ధతి ఈ విధంగా ఉంటుంది

FA-1, FA-2 & SA-1

FA-3, F-4 & SA-2 ఇది పరీక్షలు జరిగే పద్ధతి

FA అంటే formative assessment

SA అంటే summative assessment

కాస్త వివరంగా చెప్పుకుంటే ఒక విద్యార్థి ఒక అకడమిక్ ఇయర్ లో భాగంగా నాలుగు FA లను రాయాల్సి ఉంటుంది. అంటే ఒక్కొక్క సబ్జెక్టుకు ఒక్కొక్క FA అంటే, మొత్తం ఆరు పరీక్షలు. అకడమిక్ ఇయర్లో ఒక విద్యార్థి 4 FA లను మొత్తం 6 సబ్జెక్ట్స్ కు రాయాలి. అంటే 24 పరీక్షలు వాటితో పాటు, SA ఒక్కో సబ్జెక్టుకు ఒక్కోటి రాయాలి. తిరిగి ఈ SAలు రెండు ఉంటాయి. అంటే మొత్తం అంటే మొత్తం 36 పరీక్షలు రాయాల్సి ఉంటుంది. ఇట్లా ఒక విద్యార్థి ఆ తరగతిని పూర్తి చేసుకుని తరువాతి తరగతిలోకి ప్రవేశిస్తాడు. అయితే కేవలం పరీక్షలు ఉంటే సమస్య కాదు. పరీక్షలకు అనుబంధంగా విపరీతంగా రాత పనిని గత ప్రభుత్వాలు పెట్టాయి. దీనికి పేరు CCE మెథడ్ అంటున్నారు. 2015 నుంచి ఇది అమల్లో ఉన్నట్టు ఉపాధ్యాయ సోదరులు చెప్తున్నారు. అంటే సబ్జెక్ట్ కి ఒక విద్యార్థి ఏమేమి రాయాలంటే, ఉదాహరణకు

తెలుగు విషయాన్ని తీసుకుంటే పుస్తక సమీక్ష ప్రాజెక్టు వర్క్ రాయాలి, ఇవి రెండూ కలిపి దాదాపు 8 పేజీలు ఉంటుంది. అంతే కాకుండా, ఫేర్ నోట్స్ రాయాలి, మళ్లీ పరీక్ష రాయాలి. ఇందులో ఒక్కొక్క అంశానికి 5 మార్కులు వేస్తూ పోగా (5x4) ఒక మొత్తం 20 మార్కులు, SAలో 80 మార్కులు ఉంటాయి. తర్వాత హిందీలో ప్రయోజన కార్యం & ప్రాజెక్టు వర్క్, తిరిగి ఇంగ్లీషులో పుస్తక సమీక్ష & ప్రాజెక్టు వర్క్, గణితంలో నూతన ప్రశ్నావళి & ప్రాజెక్టు, భౌతిక శాస్త్రంలో, ప్రయోగశాల కృత్యం & ప్రాజెక్టు, జీవశాస్త్రంలో ప్రయోగశాల కృత్యము & ప్రాజెక్టు, సాంఘిక శాస్త్రంలో, సమకాలీన సామాజిక అంశం & ప్రాజెక్టు, ఇలా ఒక FAకి ఒక విద్యార్థి 12 అంశాల గురించి రాయాలి. ఈ 12 అంశాలతో పాటు ఫేర్ నోట్స్ రాయాలి. పరీక్ష కూడా రాయాలి. ఇట్లా పన్నెండు అంశాల గురించి ఒక విద్యార్థి సంవత్సర కాలంలో నాలుగు సార్లు రాయాలి, ఒక్కో సబ్జెక్టుకు ఎనిమిది పేపర్లు రాయాల్సి వచ్చినా మొత్తం ఆరు సబ్జెక్టులకు కలిపి ఒక పరీక్షకు 48 పేపర్లు రాయాలి. ఈ విధంగా ఒక ఏడాదిలో నాలుగు సార్లు రాయాలి, అంటే దాదాపుగా ఒక విద్యార్థి 190 పేపర్లు రాయాలి. దానికి తోడు పరీక్ష రాయాలి, ఫేర్ నోట్స్ రాయాలి. ఫేర్ నోట్స్ లో 12 పాఠ్యాంశాలు (తెలుగులో మాత్రమే. సబ్జెక్టులో ఒక్క విధంగా ఉంటుంది) అదొక వంద పేజీలు సులువుగా ఉంటుంది. ఇప్పుడు చెప్పండి ఇంత ఒత్తిడిని ఒక విద్యార్థి

తట్టుకుంటాడా? పోనీ తట్టుకొని రాసినా, ఆ రాస్తున్న విషయాలు ఆ విద్యార్థుల్లోని సృజనాత్మక శక్తిని, లేదా వారి లోపల నిబిడీకృతమై ఉన్న ప్రతిభను ఏమైనా వెలికి తీయగలదా? అంటే 100% లేదు.అసలు చాలా ప్రభుత్వ బడుల్లో సైన్స్ ల్యాబ్స్ లేనప్పుడు ప్రయోగశాల కృత్యాలు ఎందుకు ఇవ్వాలి? చాలా బడులలో లైబ్రరీలు లేనప్పుడు, ఉన్నా పుస్తకాలే లేనప్పుడు, పుస్తక సమీక్షలు ఎందుకు ఇవ్వాలి? ఒకవేళ ఇచ్చినా విద్యార్థులు పుస్తకాలు చదివి, వాటిని సమీక్షించే స్థితిలో ఉన్నారా? తమరు ఆలోచించండి. నా ఆరేండ్ల ఉపాధ్యాయ వృత్తి అనుభవంలో భాగంగా నేను గమనించిన విషయం ఏమిటంటే కాస్త తెలివైన పిల్లలు కొందరు రాసుకొని వస్తే, ఆ క్లాసులో ఉన్న విద్యార్థులు మొత్తంగా వాటిని చూసి రాయడం, చేస్తారు. ఈ చూచి రాతల వల్ల వారికీ, సమాజానికి ఏమైనా ఉపయోగం ఉంటుందా? కానీ, వీటికి సంబంధించిన రిపోర్ట్స్‌ను ప్రభుత్వం, విద్యాశాఖ, ఎప్పటికప్పుడు అడుగుతూ ఉంటుంది. రిపోర్ట్స్‌ను ఇచ్చే క్రమంలో ఉపాధ్యాయులు కచ్చితంగా విద్యార్థుల మీద ఒత్తిడి చేసి రాయించాల్సి వస్తుంది. ఇక్కడే అసలు సమస్య ఉత్పన్నమవుతుంది.

ఒక్కొక్క సబ్జెక్టు టీచర్ విద్యార్థులని కంటిన్యూగా అడగడం, రాయించడం.అడగడం, రాయించడం, దీని వల్ల విద్యార్థి తీవ్రమైన విసుగుకు ఒత్తిడికి గురవుతున్నారు. ఈ ఒత్తిడిలో భాగంగానే పాఠశాలకు దూరమవుతున్నారు. అది కాస్త పక్కకు పెట్టి, ఇవన్నీ రాసినా కూడా ఈ అంశాలకు పై తరగతిలో గాని, ముందు ముందు చదువులో గాని ఎలాంటి సంబంధం ఉండదు. నా అభిప్రాయంలో వీటి నుంచి కొత్తగా నేర్చుకునేది ఏమి ఉండదు.

నేను గతంలో 400 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలో పనిచేశాను. ఇప్పుడు 200 మంది విద్యార్థులున్న పాఠశాలలోనూ పనిచేస్తున్నాను. కానీ, విద్యార్థుల మీద ఈ రాత పని తాలూకూ నెగిటివ్ ఎఫెక్ట్ మాత్రం ఒకే విధంగా ఉంటుంది. ఈ పరీక్ష పద్ధతి, అవసరం లేని ఈ రాత పని, విద్యార్థులను తీవ్రమైన ఒత్తిడికి గురిచేస్తుంది, వాళ్లను కాపీ కొట్టి రాయడం, లేదా చూసి రాయడం వైపు తీసుకుని వెళుతుంది. అంతేకాకుండా ఒక్కో విద్యార్థి ఆరు సబ్జెక్టులను సంబంధించిన అంశాలు రాసే క్రమంలో విపరీతమైన సమయాన్ని వెచ్చించాల్సి వస్తుంది. పోనీ వెచ్చించి రాసినా సరే, దాని వల్ల ఉపయోగం ఏమిటి? ఏం నేర్చుకుంటున్నారు? ఏ ఫలితాలు వస్తున్నాయి? అంటే శూన్యం.ఇవి రాయడంతో పాటు ఇంటర్నెట్ షాపులోకి వెళ్లి, సంబంధిత సబ్జెక్టు ఫోటోలను ప్రింట్ తీసుకొని పేస్టు చేయాలి. ఏమిటి దీని వల్ల ఉపయోగం? డబ్బులు వృధా తప్ప. సూటిగా చెప్పాలంటే, ఈ రాత పని వల్లనే ఈ ఒత్తిడికి లోనయ్యి విద్యార్థులు చాలా మంది బడులకు దూరమవుతున్నారు. కొందరు బడికి రావడానికి కూడా ఇష్టపడటం లేదు. ఇది అతిశయోక్తి కాదు గ్రామాల్లోని కటోర వాస్తవం.

ఈ పద్ధతిని తరగతిలో చురుగ్గా ఉండే పిల్లలు తట్టుకున్నట్టు యావరేజ్ పిల్లలు, బిలో యావరేజ్ పిల్లలు తట్టుకోవడం లేదు. ప్రభుత్వ బడుల్లో ఏ స్థాయి పిల్లలు ఉన్నారో తమకు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదనుకుంటాను. ఆరేళ్ల నా అనుభవంలో చాలామంది విద్యార్థులు దీనివల్ల విపరీతంగా బాధపడ్డారు.ఒత్తిడికి గురయ్యారు. కొందరు చదువునే వదిలేశారు. విద్యార్థులు తమ స్వభావ రీత్యానే స్వేచ్ఛను కోరుకుంటారు. ఒక ఉత్సాహపూరితమైన ప్రేమపూర్వకమైన పాఠశాల వాతావరణాన్ని కోరుకుంటారు. కానీఇ బడికి వస్తే వారికి యమపాశాల్లా ఈ రాత పనులు వెంటాడుతున్నాయి. విద్యార్థుల స్థాయికి, వారి సామాజిక నేపథ్యం, కుటుంబ నేపథ్యం ఆధారంగానే వారి ఆలోచనలు, పరిణితి ఏర్పాటై ఉంటాయి. ఇవేవీ కూడా పాఠశాల వాడికి అందిస్తున్నట్టు లేదు.

అందుకే వాళ్లు పాఠశాలకు దూరమై, పశువుల వెంట, కూలీల వెంట, క్రికెట్ మ్యాచ్ల వెంట, కొందరైతే ఆటో స్టాండ్‌ల వద్ద, బస్టాండ్ల వెంట, ఆఖరికి కల్లు దుకాణాల వద్ద తిరిగి ఇండ్లకు వెళ్ళిపోతున్నారు. ఇది వాస్తవంలో జరుగుతుంది. మరోవైపు రాష్ట్రంలో విద్యార్థులకు ప్రాథమిక సామర్థ్యాలు కూడా లేవని గుర్తిస్తూ, వివిధ పరీక్షలను (NAS, LIP, ఉన్నతి) ప్రోగ్రామ్లను ఇస్తున్న ప్రభుత్వం, విద్యార్థులను అశాస్త్రీయంగా ఇంత ఒత్తిడికి గురిచేస్తే ఎట్లా నేర్చుకుంటారు అని ఎందుకు ఆలోచించడం లేదు?

ఈ పని కేవలం విద్యార్థులనే కాకుండా ఉపాధ్యాయులను కూడా ఒత్తిడికి గురి చేస్తున్నది. ఒత్తిడి సంగతి అటు ఉంచి, ఉపాధ్యాయులు విద్యార్థుల మీద, వారి యాక్టివిటీస్ మీద, ఏకాగ్రత పెట్టకుండా ఉపాధ్యాయులను పేపర్ కరెక్షనుకి మాత్రమే కట్టిపడేసేటట్టు చేసి, వైయక్తికంగా విద్యార్థి యొక్క స్థాయి భేదాల్ని పసిగట్టడానికి, పసిగట్టి వారిపై ప్రత్యేక యాక్షన్ ప్లాన్ రూపొందించడానికి, ఈ పరీక్ష పద్ధతి రాత పని అవరోధంగా మారింది. ఒక్కొక్క టీచర్ కొన్ని వందల పేజీలను

కరెక్షన్ చేయాల్సి రావడం వల్ల విద్యార్థి రాస్తున్న విషయాన్ని, అందులోని సారాంశాన్ని, ఒక ఉపాధ్యాయుడు సరిగ్గా తనిఖీ చేసే పరిస్థితి లేకుండా పోతుంది. కనీసం అక్షర దోషాలను కూడా పసిగట్టలేని స్థితిలోకి ఉపాధ్యాయులు వెళ్తున్నారు అనేది కూడా వాస్తవం. నిజానికి లెక్కలు వేస్తే ఒక్కొక్క విద్యార్థి పేజీలకు పేజీలు రాయాల్సి వస్తుంది. అంటే వాడు ఏమైనా పరిశోధన చేయాలా? లేకపోతే బడులు ఏమైనా పరిశోధన పత్రాల సమర్పణకు కేంద్రంగా ఉంటున్నాయా? తమరు ఆలోచించాలి. అంతేకాకుండా చాలా ప్రైవేటు బడులలో ఈ వర్క్‌ని చేయించడం లేదు అని కూడా విన్నాను. అది నిజమో కాదో తెలుసుకోవాల్సిన అవసరం కూడా ఉంది. ఈ ఏడాది తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పదవ తరగతి విద్యార్థులకు ఈ పనిని తప్పించింది. కేవలం పదవ తరగతి విద్యార్థులకే కాదు 6 నుంచి 10 వ తరగతి విద్యార్థులందరికీ కూడా ఈ రాత పని అనే ఒత్తిడిని తగ్గించాలి. ఇలాంటి పరీక్షా పద్ధతులకు ప్రత్యామ్నాయంగా విద్యార్థులలో బాగా చదువుకునే పిల్లలనుంచి మొదలు, ఇప్పుడిప్పుడే వస్తున్న సామాజిక నేపథ్యం కలిగిన పిల్లల వరకు అందరిని కూడా తరగతి గదికి కట్టిపడేసేలా ఒక ప్రత్యామ్నాయ మార్గాన్ని ఆలోచించాలి. దానికి సరిపడా వాతావరణం గుర్తించేలా ఈ రాత పనిని తగ్గిస్తే బాగుంటుంది.

చాలా ప్రభుత్వ బడులలో కనీసం చదవడానికి రాని పిల్లలు ఒక్కో తరగతిలో, చెప్పుకోదగ్గ స్థాయిలో ఉన్నారు. ఈ మాటను తమరే ఎల్బీ స్టేడియంలో, మాతో జరిగిన మీటింగ్లో కూడా అన్నారు. వీరికి ప్రాథమిక సామర్థ్యాలు కూడా రావు. కనుక, ఇలాంటి పిల్లలకోసం ఏం చేయాలో ఆలోచించాలి. వీరి గురించి ఉపాధ్యాయులు కేర్ తీసుకునేలా చేయాలంటే విద్యార్థుల మీద, ఉపాధ్యాయుల మీద సమాంతరంగా ఉంటున్న ఈ రాత పని, దిద్దుడు పనిని తగ్గించి వైయక్తిక స్థాయి భేదాల మీద దృష్టిని పెట్టేలా చేయాలి. బడుల్లో లైబ్రరీ పీరియడ్ను తప్పనిసరిగా యాక్టివ్‌గా ఉండేలా చూడాలి. బాలల సభను క్రమం తప్పకుండా జరిపి విద్యార్థులను ఉత్సాహపరిచేలా చూడాలి. ముఖ్యంగా ఈ రాతల చిక్కుముడులో చిక్కుకున్న పిల్లల్ని చదువుల వైపు బడివైపు మళ్ళించాలంటే వారికి భయపెడుతున్న ఈ రాత పనిని, ఒత్తిడిని వారి నుండి దూరం చేయండి డ్రాపవుట్స్ సంఖ్యను తగ్గించండి. ముఖ్యంగా పిల్లలు స్వేచ్ఛామాయ ప్రపంచంలో చదువుకునే ఒక అనుకూలమైన వాతావరణాన్ని, శాస్త్రీయమైన పరీక్షా పద్ధతిని ప్రవేశపెట్టండి.

తెలంగాణ వ్యాప్తంగా 500 పైగా పాఠశాలలను తమరి ప్రభుత్వం కొత్తగా ఓపెన్ చేసింది. అందుకు చాలా సంతోషం. అదే ఆసక్తితో ఇప్పటికే ఉన్న ప్రాథమిక పాఠశాలల్లో తరగతికో ఉపాధ్యాయుడిని ఇవ్వండి. చాలా గ్రామాల్లో 5వ తరగతిలకు కలిపి ఒకే ఉపాధ్యాయుడు ఉంటున్నారు. దీనిని, 30 మంది విద్యార్థులకు, ఒక ఉపాధ్యాయుడు అనే రేషియో పద్ధతిలో బయటకు చెబుతున్నారు. ఇది పరోక్షంగా ప్రైవేటు విద్యకు బలం చేకూరుస్తుంది. తెలంగాణ గ్రామాల్లో ప్రతి మూలకి ప్రైవేటు పాఠశాలల బస్సులు చొచ్చుకుని వస్తున్నాయి. దీనికి కారణం దశాబ్దాలుగా మన ప్రభుత్వాలు విద్యారంగాన్ని పట్టించుకోకుండా ఉండటమే, రాష్ట్రంలోని ఏ కాంప్లెక్స్ హెడ్మాస్టర్ను అడిగినా అతడి కాంప్లెక్స్ పరిధిలోని, ప్రాథమిక పాఠశాల దుస్థితిని చెప్పగలడు. కావునా తమరు ఈ విషయాలపై దృష్టి పెట్టండి. ప్రాథమిక పాఠశాలలో 40 మంది విద్యార్థులు ఉన్నచోట, కనీసం ఇద్దరు ఉపాధ్యాయులని ఇవ్వండి. సింగిల్ టీచర్ వ్యవస్థను పూర్తిగా రద్దు చేయడం పైనే దృష్టి పెట్టండి. గ్రామాల్లో విద్యార్థులు చాలా మంది డ్రాపవుట్స్ ఔతున్నారు. బాల కార్మికులుగా మారిపోతున్నారు. చైల్డ్ హెల్ప్ లైన్ వ్యవస్థను మరింతగా పటిష్టం చేయండి. అంతేకాకుండా మన రాష్ట్రానికి వలస వచ్చి, ప్రతి గ్రామాల్లో ఇటుక బట్టీల దగ్గర పనిచేస్తూ, అక్కడే నివాసముంటున్న ఇతర రాష్ట్రాల పిల్లల పరిస్థితి మరీ దయనీయంగా ఉంది. వారి చదువులకోసం కూడా, చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉన్నది.వారి దయనీయ స్థితి, వెట్టి చాకిరీ, వారి పిల్లల బతుకులపై దృష్టి సారించండి.

మరీ ముఖ్యంగా పాఠశాలలను పర్యవేక్షించడానికి ఉపాధ్యాయులను కేటాయించకండి. DEOలను, డిప్యూటీ DEOలను, MEOలను, డిప్యూటీ DEOలను నియమించండి. వారికే పర్యవేక్షణ బాధ్యతలు ఇవ్వండి. ప్రభుత్వంలో ఉన్న పలుకుబడిని ఉపయోగించుకొని, చాలామంది ఉపాధ్యాయులు అక్రమంగా డిప్యూటేషన్ తీసుకుంటున్నారు. దీనివల్ల వారు పనిచేసే చోట ఖాళీలు ఏర్పడుతున్నాయి. ఈ పద్ధతిని తమరు తక్షణమే అరికట్టండి. ఈ ఖాళీలను వీటిని వర్క్ అడ్జస్ట్మెంట్ ద్వారా భర్తీ చేయడం కాకుండా, కొత్తగా యువతను ఉపాధ్యాయ రంగంలోకి రిక్రూట్ చేయండి. తమరు ఎన్నికల హామీల్లో చెప్పినట్టు, విద్యారంగానికి 15 శాతం నిధులను తప్పకుండా కేటాయించండి.

★ రచయిత: స్కూల్ అసిస్టెంట్ (తెలుగు)

# విశ్వవిద్యాలయాల తెలుగు విద్యావిధానంలో నూతన శకం సాధ్యమేనా?

ఆచార్య వెంకటరామయ్య గంపా

ప్రపంచం ప్రస్తుతం వ్యాపార యుగంలో ఉంది. మన దేశం కూడా అందుకు అనుగుణంగా ఆర్థిక వ్యవస్థను రూపొందిస్తుంది. ఈ నేపథ్యంలో 21వ శతాబ్దపు అవసరాలకు అనుగుణంగా విద్యావ్యవస్థను పునర్నిర్మించే లక్ష్యంతో నూతన జాతీయ విద్యావిధానం - 2020 (NEP- 2020) రూపుదిద్దుకుంది. ఉన్నత విద్యలో సమూల మార్పులను ప్రవేశపెట్టిన ఈ విధానం, సంప్రదాయ బోధనా పద్ధతుల నుండి ఆధునిక, నైపుణ్య ఆధారిత విద్య వైపు మార్పును సూచిస్తుంది. బహుళ-విషయ విద్య (Multi-disciplinary education), సులభమైన ప్రవేశ-నిష్క్రమణ అవకాశాలు, పరిశోధనకు అగ్ర ప్రాధాన్యత, అభ్యాస ఫలితాల ఆధారిత పాఠ్య ప్రణాళికలు (Learning outcome-based curriculum) నూతన జాతీయ విద్యా విధానం-2020 ప్రధాన లక్షణాలు. ఈ విధానం విద్యార్థులను కేవలం పాఠ్యపుస్తకాల్లోని సమాచారాన్ని గ్రహించే వారిగానే కాకుండా, తమ స్వంత ఆలోచనలతో కొత్త జ్ఞానాన్ని సృష్టించే వారిగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకుంది.

ఈ జాతీయ విద్యా విధానం లక్ష్యాలకు అనుగుణంగా, తెలుగు పోస్ట్ గ్రాడ్యుయేషన్ (PG) కోర్సుల బోధన, రూపకల్పనలో సమగ్ర మార్పులు అనివార్యం. తెలుగు భాషా సాహిత్య అధ్యయనాలు కేవలం మన గొప్ప సాహిత్య, సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడటానికే పరిమితం కాకుండా, ఆధునిక ప్రపంచంలో కొత్త జ్ఞానాన్ని సృష్టించడంలో, విభిన్న రంగాలకు తమ సహకారాన్ని అందించడంలో క్రియాశీలకంగా భాగం కావాలి. తెలుగు భాషకు వందల సంవత్సరాల చరిత్ర, అపారమైన సాహిత్య సంపద, విస్తృతమైన జానపద సంస్కృతి ఉన్నాయి. ఈ గొప్ప వారసత్వాన్ని నేటి తరం విద్యార్థులకు, రేపటి పరిశోధకులకు ఎలా అందించాలనేదే ప్రస్తుతం ఉన్న ప్రధాన సవాలు.

నూతన జాతీయ విద్యా విధానం - 2020 భారతదేశాన్ని 'జ్ఞాన సమాజం' గా (Knowledge Society) మార్చడానికి, ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా నిలబెట్టడానికి ఒక వ్యూహాత్మక చర్యగా రూపొందించబడింది. ఈ విధానం ఉన్నత విద్యలో పరిశోధనా సామర్థ్యాలను విస్తరించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తుంది. NEP - 2020 ప్రకారం, తెలుగు PG కోర్సులు విద్యార్థులకు అధునాతన సాహిత్య, భాషా జ్ఞానాన్ని అందించడంతో పాటు, వారికి ప్రత్యేక నైపుణ్యాలను పెంపొందించి, ఉన్నత పరిశోధనకు సిద్ధం చేయాలి. ఈ విధానం సరళత, విద్యాపరమైన స్వేచ్ఛ, బహుళ విషయ అధ్యయనాలను ప్రోత్సహిస్తుంది. దీనివల్ల తెలుగు విద్యార్థులకు డిజిటల్ హ్యూమానిటీస్ (Digital Humanities), కంప్యుటేషనల్ లింగ్విస్టిక్స్ (Computational Linguistics), డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) వంటి నూతన రంగాలతో సంబంధాలు ఏర్పడే అవకాశాలు విస్తృతమవుతాయి. తెలుగు సాహిత్యాన్ని డిజిటల్ మాధ్యమాల్లోకి తీసుకురావడం, కొత్త విశ్లేషణలు చేయడం, తెలుగు భాష, సాహిత్య అధ్యయనం కోసం నూతన సాఫ్ట్‌వేర్లు తయారు చేయడం వంటివి భవిష్యత్తులో తెలుగు విద్యార్థులకు గొప్ప అవకాశాలను సృష్టిస్తాయి.

నూతన జాతీయ విద్యా విధానం - 2020 ఆధునికతను ప్రోత్సహిస్తూనే, ప్రాంతీయ భాషలు తమ సాంస్కృతిక గుర్తింపును కాపాడటంలో పోషించే కీలక పాత్రను స్పష్టంగా గుర్తిస్తుంది. మాతృభాషలో బోధన, అధ్యయనాలకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా భాషా వైవిధ్యాన్ని కాపాడాలని ఈ విధానం సూచిస్తుంది.

**వివిధ విశ్వవిద్యాలయాలలో ప్రస్తుత తెలుగు సిలబస్:**

భారతదేశంలోని వివిధ విశ్వవిద్యాలయాలు అందించే తెలుగు పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సులు తెలుగు భాషా సాహిత్య అధ్యయనాలలో ప్రాథమిక, సంప్రదాయ జ్ఞానాన్ని అందిస్తాయి. ఈ సిలబస్‌లను లోతుగా పరిశీలిస్తే కొన్ని స్పష్టమైన బలాలు, కొన్ని ముఖ్యమైన బలహీనతలు కనిపిస్తాయి. వీటిని అర్థం చేసుకోవడం ద్వారానే నూతన జాతీయ విద్యా విధానం 2020కి అనుగుణంగా ఎటువంటి సమూల మార్పులు అవసరమో నిర్ధారించగలం.

**ప్రస్తుత తెలుగు PG సిలబస్‌ల నిర్మాణం:**

తెలుగు విభాగాలలో ఎక్కువగా ప్రాచీన తెలుగు సాహిత్యం, భాషకు సంబంధించిన పేపర్‌లు ఉంటాయి. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో 'తెలుగు భాషా చరిత్ర', 'తెలుగు సాహిత్య

చరిత్ర' వంటి కోర్ పేపర్లు, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో 'ప్రాచీన కావ్యాలు', 'తెలుగు వ్యాకరణం', శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ప్రాచీన తెలుగు సాహిత్యం, నాటకం, తెలంగాణ విశ్వవిద్యాలయంలో 'ప్రాచీన తెలుగు సాహిత్యం', 'తెలుగు వ్యాకరణం' వంటి సంప్రదాయ అంశాలకు ప్రాధాన్యత ఇచ్చారు. ఈ విశ్వవిద్యాలయాలు సాధారణంగా జానపద విజ్ఞానం, దళిత సాహిత్యం మొదలైన అంశాలను ఐచ్ఛిక పేపర్లుగా, అలాగే ప్రాజెక్ట్ వర్క్ లేదా పరిశోధనా పద్ధతులు/ రచనా విధానం వంటి అంశాలను కూడా అందిస్తాయి. అయితే, పరిశోధనలకు కేటాయించిన సమయం, లోతైన అధ్యయనానికి సరిపోవడం లేదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అంతేకాకుండా, మూడు, నాలుగు విశ్వవిద్యాలయాలు మినహా, మిగిలిన తెలుగు విభాగాలలో శాశ్వత అధ్యాపకుల సంఖ్య చాలా తక్కువ.

**సామ్యాలు, వ్యత్యాసాలు: తులనాత్మక విశ్లేషణ:**

ఈ సిలబస్‌లలో కొన్ని సామ్యాలు స్పష్టంగా కనిపిస్తాయి. అన్ని విశ్వవిద్యాలయాలు భాషా శాస్త్రం, సాహిత్య చరిత్ర, వివిధ సాహిత్య ప్రక్రియలపై బలమైన పునాదిని అందిస్తాయి. విద్యార్థులకు తెలుగు సాహిత్య వారసత్వంపై సమగ్ర అవగాహన కల్పించడం వీటి ముఖ్య ఉద్దేశ్యం. ప్రబంధాలు, శతకాలు, నాటకాలు, ఆధునిక కవిత్వం, కథానిక, నవల వంటి ప్రక్రియలకు ప్రాధాన్యత ఇస్తారు. చాలా సిలబస్‌లలో ఒక భాషా చరిత్ర పేపర్, ఒక సాహిత్య చరిత్ర పేపర్ తప్పనిసరిగా ఉంటాయి. ఇది తెలుగు సాహిత్యానికి సంబంధించిన ప్రాథమిక జ్ఞానాన్ని అందించడంలో సహాయపడుతుంది.

అయితే, వ్యత్యాసాలు ప్రధానంగా పరిశోధనా అంశాలలో స్పష్టమవుతాయి. కొన్ని విశ్వవిద్యాలయాలు పరిశోధనా పద్ధతులను సిలబస్‌లో చేర్చినప్పటికీ, అవి సాధారణంగా చివరి సెమిస్టర్‌కు లేదా ఒకే పేపర్‌కు పరిమితమవుతుంది. దీనివల్ల విద్యార్థులు లోతైన, విస్తృతమైన పరిశోధనా నైపుణ్యాలను పొందలేక పోతున్నారు. డిజిటల్ టెక్నాలజీ, ఇతర విజ్ఞాన శాస్త్రాలతో తెలుగు అధ్యయనాలను అనుసంధానించడంలో చాలా సిలబస్‌లలో లోపం ఉంది. ఇది ఆధునిక పరిశోధనకు, ఉద్యోగ అవకాశాలకు అడ్డుగా మారుతుంది.

**ప్రస్తుత తెలుగ PG సిలబస్‌ల ప్రధాన బలాలు:**

తెలుగు భాషాశాస్త్రం, సాహిత్య చరిత్ర, విమర్శలలో బలమైన పునాది: విద్యార్థులకు తెలుగు భాషా పరిణామం, భాషాశాస్త్ర సిద్ధాంతాలు (ధ్వనిశాస్త్రం, రూప నిర్మాణం, వాక్యనిర్మాణం, అర్థ విజ్ఞానం), ఆధునిక తెలుగు భాషా లక్షణాలు, మాండలికాలు, వ్యాకరణ నిర్మాణంపై లోతైన అవగాహన లభిస్తుంది. వివిధ సాహిత్య కాలాలు, ప్రముఖ రచయితలు, వారి రచనలు, అలాగే సాహిత్య విమర్శ సిద్ధాంతాలపై సమగ్ర జ్ఞానం అలవడుతుంది. ఇది విద్యార్థులకు తెలుగు భాషా సాహిత్యాలపై మంచి పట్టును ఇస్తుంది.

సాంప్రదాయ సాహిత్య ప్రక్రియలు జానపద అధ్యయనాలకు ప్రాధాన్యత: పద్య సాహిత్యం (కావ్యాలు, ప్రబంధాలు, శతకాలు), గద్య సాహిత్యం (నవలలు, కథానికలు, వ్యాసాలు), నాటకాలు, అలాగే జానపద కళలు (తోలుబొమ్మలాట, హరికథ, బుర్రకథ), జానపద సాహిత్యం (కథలు, పాటలు, సామెతలు, పొడుపు కథలు) వంటి ప్రక్రియలపై విస్తృత అధ్యయనాన్ని అందిస్తాయి. ఇది మన గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడటానికి, దానిని భవిష్యత్ తరాలకు అందించడానికి సహాయపడుతుంది.

కొన్ని చోట్ల ప్రాజెక్ట్ వర్క్ ద్వారా పరిశోధనకు ప్రారంభం: కొన్ని విశ్వవిద్యాలయాలు ప్రాజెక్ట్ వర్క్‌ను చేర్చడం వల్ల విద్యార్థులకు ప్రాథమిక పరిశోధనా నైపుణ్యాలు (సమాచారం సేకరించడం, నివేదిక రాయడం వంటివి) అలవడతాయి. ఇది ఉన్నత పరిశోధనలకు ఒక తొలి మెట్టుగా ఉపయోగపడుతుంది. అయితే, దీని స్థాయి, లోతును పెంచాల్సిన అవసరం ఉంది.

**ప్రస్తుత సిలబస్‌ల బలహీనతలు:**

ప్రస్తుత సిలబస్‌ల ప్రధాన బలహీనతలు NEP 2020 లక్ష్యాలకు దూరంగా ఉన్నాయి, అవి భవిష్యత్ సవాళ్లను ఎదుర్కోవడానికి తెలుగు విద్యార్థులను సమర్థవంతంగా సిద్ధం చేయడం లేదు:

**అన్వేషణకు తక్కువ ప్రాధాన్యత:** చాలా విశ్వవిద్యాలయాలలో పరిశోధనా పద్ధతుల బోధన నామ మాత్రంగానే ఉంది. పరిశోధనా సమస్యను గుర్తించడం, సమాచారాన్ని శాస్త్రీయంగా విశ్లేషించడం, పరిశోధనా ఫలితాలను సమర్థవంతంగా ఆలోచనలో పెట్టడం (ప్రెజెంట్ చేయడం) వంటి కీలక నైపుణ్యాలపై తగిన శిక్షణ లేదు. పరిశోధనను కేవలం ఒక చివరి సెమిస్టర్ ప్రాజెక్ట్‌కు పరిమితం చేయడం వల్ల విద్యార్థులు లోతైన పరిశోధనా పద్ధతులను నేర్చుకోలేకపోతున్నారు. నాణ్యమైన పరిశోధనలకు కావలసిన మౌలిక వసతులు, అధ్యాపకుల పర్యవేక్షణ కూడా కొన్ని చోట్ల లోపిస్తున్నాయి. పరిశోధనా జర్నల్స్‌లో ప్రచురణకు తగిన నాణ్యత గల పరిశోధనలు చాలా తక్కువ.

**నూతన అంశాలపై దృష్టి లోపం:** డిజిటల్ హ్యూమానిటీస్, భాషా సాంకేతికత, కంప్యుటేషనల్ లింగ్విస్టిక్స్ (Computational Linguistics), కంటెంట్ క్రియేషన్, అనువాద సాంకేతిక విధానాలు (Translation Technologies) వంటి సమకాలీన రంగాలు ప్రస్తుత సిలబస్‌లలో దాదాపుగా లేవు. ఈ అంశాలు ఆధునిక విజ్ఞాన సమాజంలో అత్యంత కీలకమైనవి విద్యార్థులకు విస్తృత ఉద్యోగ అవకాశాలను కల్పిస్తాయి. తెలుగు భాషను కంప్యూటర్లు, మొబైల్ ఫోన్‌లలో మరింత సమర్థవంతంగా ఉపయోగించడానికి ఈ నైపుణ్యాలు చాలా అవసరం.

**బహుళ-విషయ అనుసంధానం** (Multidisciplinary Integration) **లోపం:** సాహిత్య అధ్యయనాలు ఇతర రంగాలతో (చరిత్ర, సామాజిక శాస్త్రాలు, కంప్యూటర్ సైన్స్, సినిమా అధ్యయనాలు, మీడియా స్టడీస్, తత్వశాస్త్రం, మానసిక శాస్త్రం) సమగ్రంగా అనుసంధానించబడలేదు. ఇది విద్యార్థుల దృక్పథాన్ని పరిమితం చేస్తుంది, వారికి సమగ్ర అవగాహనను పెంపొందించదు. సాహిత్యం అనేది సమాజం నుండి వేరుగా చూడకూడదు, ఇతర రంగాలతో దానికున్న సంబంధాన్ని లోతుగా విశ్లేషించగల సామర్థ్యాన్ని విద్యార్థులకు అందించాలి. ఉదాహరణకు, ఒక సామాజిక ఉద్యమాన్ని దాని సాహిత్య ప్రభావంతో పాటు చారిత్రక, సామాజిక, రాజకీయ కోణాల్లో కూడా విశ్లేషించడం.

**నైపుణ్య ఆధారిత శిక్షణ తక్కువ:** ఉద్యోగ సామర్థ్యాన్ని పెంచే (Employability Skills) నైపుణ్యాలపై దృష్టి తగినంత దృష్టి లేదు. కంటెంట్ రైటింగ్ (వెబ్‌సైట్లు, బ్లాగులు, సోషల్ మీడియా కోసం), అనువాదం (సాహిత్య, టెక్నికల్, లీగల్), టెక్నికల్ రైటింగ్, ఎడిటింగ్, ప్రూఫ్ రీడింగ్, మీడియా రిలేషన్స్, ఈవెంట్ మేనేజ్‌మెంట్, కమ్యూనికేషన్ స్కిల్స్, పబ్లిక్ స్పీకింగ్ వంటి నైపుణ్యాలు ప్రస్తుత సిలబస్‌లలో అంతర్భాగంగా లేవు. ఇది గ్రాడ్యుయేషన్ తర్వాత విద్యార్థులు ఉద్యోగ మార్కెట్‌లో పోటీ పడటంలో సవాళ్లను సృష్టిస్తుంది.

**ఆచరణాత్మక అనుభవం లేకపోవడం:** కేవలం సిద్ధాంత పరమైన బోధనకే పరిమితం కావడం వల్ల విద్యార్థులకు ఆచరణాత్మక అనుభవం లభించడం లేదు. ఇంటర్న్‌షిప్‌లు, ఫీల్డ్ వర్క్, ప్రాజెక్ట్ బేస్డ్ లెర్నింగ్, స్టడీ టూర్స్ వంటివి ప్రస్తుత సిలబస్‌లలో చాలా తక్కువ. ఇది విద్యార్థులను సిద్ధాంతానికే పరిమితం చేసి, వాస్తవ ప్రపంచ సవాళ్లకు సిద్ధం చేయదు.

**అధ్యాపకుల శిక్షణ, మౌలిక సదుపాయాల కొరత:** ప్రధాన సమస్య అధ్యాపకుల కొరత. దీనికి తోడు నూతన పద్ధతుల్లో బోధించడానికి అధ్యాపకులకు తగిన శిక్షణ, డిజిటల్ టూల్స్, పరిశోధనా వనరులు, అధునాతన ప్రయోగశాలల వంటి మౌలిక సదుపాయాలు చాలా విశ్వవిద్యాలయాలలో లేవు.

**ప్రస్తుత సంప్రదాయ బోధన పద్ధతులు: పరిమితులు:**

తెలుగు సాహిత్య బోధనలో కొన్ని దశాబ్దాలుగా పాటిస్తున్న సంప్రదాయ పద్ధతులు వాటి పరిమితులు

**లెక్చర్ ఆధారితం:** అధ్యాపకులు తరగతి గదిలో పాఠాలను వివరించడం, విద్యార్థులు వాటిని శ్రద్ధగా వినడం జరుగుతుంది. ఇది తరచుగా ఏకదిశా బోధనగా ఉంటుంది, ఇక్కడ విద్యార్థి క్రియాశీలంగా పాల్గొనడానికి అవకాశం తక్కువ. ఇది విద్యార్థులలో ఆలోచనలను, సందేహాలను రేకెత్తించదు.

**జ్ఞాపకశక్తిపై ఆధారపడటం, పరీక్షలపై దృష్టి:** విద్యార్థులు గుర్తుంచుకున్న విషయాలను పరీక్షలలో వ్రాయడంపై ఎక్కువ దృష్టి ఉంటుంది. విశ్లేషణాత్మక నైపుణ్యాలు, విమర్శనాత్మక ఆలోచన కంటే విషయ పరిజ్ఞానానికి, కంఠస్థం చేయడానికే ప్రాధాన్యత ఇస్తారు. ఇది కేవలం సమాచారాన్ని నిల్వ చేసుకునే విధానాన్ని ప్రోత్సహిస్తుంది.

**ప్రాచీన సాహిత్యంపై బలం, సమకాలీనత లోపం:** కావ్యాలు, శతకాలు, పురాణాలు, జానపద కథలు వంటి ప్రాచీన, మధ్యయుగ సాహిత్య ప్రక్రియలపై ఎక్కువ శ్రద్ధ చూపుతారు. ఆధునిక, అత్యాధునిక సాహిత్య, సాంస్కృతిక సిద్ధాంతాలపై అవగాహన, ఆధునిక సమకాలీన రచనలు, వర్తమాన సామాజిక సమస్యలకు సంబంధించిన సాహిత్య అంశాలకు తక్కువ ప్రాధాన్యత ఇస్తారు.

**నిష్క్రియాత్మక అభ్యాసం** (Passive Learning): విద్యార్థులు కేవలం సమాచారాన్ని స్వీకరించేవారిగా మాత్రమే ఉంటారు. ఇది వారిలో విమర్శనాత్మక చింతన, సృజనాత్మకత స్వతంత్ర ఆలోచనా శక్తిని పెంపొందించడంలో లోపిస్తుంది. వారు పాఠాలను ప్రశ్నించడం, తమ స్వంత అభిప్రాయాలను రూపొందించుకోవడం నేర్చుకోలేరు.

**సాంకేతికత లోపం:** డిజిటల్ సాధనాలు, ఆన్‌లైన్ వనరులు, మల్టీమీడియా వినియోగం చాలా తక్కువ. ఇది ఆధునిక సమాచార విప్లవానికి దూరంగా ఉంచుతుంది, విద్యార్థులను డిజిటల్ నైపుణ్యాల నుండి వెనుకబడేలా చేస్తుంది.

మొత్తంగా, ప్రస్తుత సిలబస్‌లు సాంప్రదాయ జ్ఞానాన్ని అందించడంలో సమర్థవంతంగా ఉన్నప్పటికీ, NEP 2020 పరిశోధనా-కేంద్రీకృత, బహుళ-విషయ నైపుణ్య ఆధారిత లక్ష్యాలకు అనుగుణంగా సమూల మార్పులు అవసరం. ఈ

మార్పులు తెలుగు భాషా సాహిత్య విద్యార్థులను భవిష్యత్ సవాళ్లను ఎదుర్కోవడానికి నూతన అవకాశాలను అందిపుచ్చుకోవడానికి సిద్ధం చేస్తాయి.

**నూతన విద్యా విధానం 2020లో తెలుగు సిలబస్:**

నూతన విద్యా విధానం 2020 తెలుగు పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సులలో సమూల మార్పులను సూచిస్తున్నప్పటికీ, ఈ మార్పులను అమలు చేయడంలో కొన్ని కీలకమైన సవాళ్లు ఎదురవుతాయి. ఈ సవాళ్లను సమర్థవంతంగా అధిగమిస్తేనే NEP లక్ష్యాలు నెరవేరుతాయి.

**అధ్యాపకుల సంసిద్ధత శిక్షణ:**

NEP 2020 బహుళ-విషయ విద్య, పరిశోధనా-ఆధారిత అభ్యాసం, డిజిటల్ టూల్స్ వినియోగం వంటి నూతన బోధనా పద్ధతులను నొక్కి చెబుతుంది. అయితే, ప్రస్తుత అధ్యాపకులలో చాలామంది సంప్రదాయ బోధనా విధానాలకు అలవాటుపడి ఉన్నారు.

అధ్యాపకులకు డిజిటల్ హ్యూమానిటీస్, కంప్యుటేషనల్ లింగ్విస్టిక్స్, డేటా అనాలసిస్, పరిశోధనా పద్ధతులలో తగిన శిక్షణ లేదు. వారికి కొత్త టెక్నాలజీలపై పట్టు, నూతన బోధనా పద్ధతులపై అవగాహన కల్పించడం పెద్ద సవాలు. అధ్యాపకుల కోసం నిరంతర వృత్తిపరమైన అభివృద్ధి కార్యక్రమాలు, వర్క్‌షాప్‌లు, ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లు (FDPs) నిర్వహించాలి. వారికి ఆధునిక పరిశోధనా సాధనాలపై, బహుళ-విషయ దృక్పథంపై శిక్షణ ఇవ్వాలి. డిజిటల్ టూల్స్ వినియోగంపై ఆచరణాత్మక శిక్షణ తప్పనిసరి.

**మౌలిక సదుపాయాల కొరత:**

కొత్త సిలబస్‌కు అనుగుణంగా అధునాతన మౌలిక సదుపాయాలు చాలా విశ్వవిద్యాలయాలలో లేవు. భాషా ప్రయోగశాలలు, కంప్యూటర్ ల్యాబ్‌లు, డిజిటల్ రిసోర్స్ సెంటర్‌లు, హై-స్పీడ్ ఇంటర్నెట్ కనెక్టివిటీ, అధునాతన సాఫ్ట్‌వేర్లు, డిజిటల్ లైబ్రరీలు వంటివి చాలా విశ్వ విద్యాలయాలలో సరిపడా లేవు. ఇవి లేకపోతే డిజిటల్ హ్యూమానిటీస్, కంప్యుటేషనల్ లింగ్విస్టిక్స్ వంటి కోర్సులను బోధించడం కష్టం.

ప్రభుత్వాలు, విశ్వవిద్యాలయాలు మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు కేటాయించాలి. అధునాతన ల్యాబ్‌లను ఏర్పాటు చేయాలి. ఓపెన్ సోర్స్ సాఫ్ట్‌వేర్‌లను ఉపయోగించడం ద్వారా ఖర్చులను తగ్గించుకోవచ్చు.

**సిలబస్ రూపకల్పన- అమలు:**

NEP 2020 ప్రకారం బహుళ-విషయ, పరిశోధనా-ఆధారిత సిలబస్‌ను రూపొందించడం ఒక క్లిష్టమైన ప్రక్రియ.

సాంప్రదాయ, ఆధునిక అంశాలను సమతుల్యం చేయడం, వివిధ విభాగాల మధ్య సమన్వయం సాధించడం, అభ్యాస ఫలితాల ఆధారిత సిలబస్‌ను రూపొందించడం, క్రెడిట్ సిస్టమ్‌ను సమర్థవంతంగా అమలు చేయడం. భాషాశాస్త్రం, సాహిత్యం, సాంకేతికత, సామాజిక శాస్త్రాల నిపుణుల మధ్య సమన్వయం అవసరం.

వివిధ రంగాలకు చెందిన నిపుణులతో కూడిన కమిటీలను ఏర్పాటు చేయాలి. బహుళ-విషయ ప్రోగ్రామ్‌లను అధ్యయనం చేయాలి. వారి సూచనలు, అనుభవాలను బట్టి సిలబస్‌ను మెరుగుపరచాలి.

**పరిశోధనా నిధులు- వనరులు:**

తెలుగు భాషా సాహిత్యంలో పరిశోధనకు తగిన నిధులు లభించడం లేదు. పరిశోధనా జర్నల్స్, డేటాబేస్‌లు, ప్రచురణ అవకాశాలు తక్కువ. విద్యార్థులకు పరిశోధన ఉపకారవేతనాలు లభించడం లేదు.

పరిశోధనా సంస్థలు, ప్రభుత్వ ఏజెన్సీలు, పరిశ్రమలు తెలుగు భాషా సాహిత్య పరిశోధనలకు నిధులు కేటాయించాలి. అంతర్జాతీయ సహకార ప్రాజెక్ట్‌లను ప్రోత్సహించాలి. నాణ్యమైన పరిశోధనా జర్నల్స్‌ను ప్రారంభించి, వాటిని అంతర్జాతీయ డేటాబేస్‌లలో చేర్చాలి.

**విద్యార్థుల అవగాహన - అంగీకారం:**

సంప్రదాయ పద్ధతులకు అలవాటు పడిన విద్యార్థులు కొత్త బోధనా విధానాలు, బహుళ-విషయ కోర్సులు, పరిశోధనా ప్రాజెక్ట్‌లకు అలవాటు పడటానికి సమయం పడుతుంది. వారికి కొత్త రంగాల పట్ల ఆసక్తిని పెంపొందించడం.

విద్యార్థులకు నూతన జాతీయ విద్యా విధానం 2020 లక్ష్యాలు, కొత్త సిలబస్ ప్రయోజనాలపై అవగాహన కల్పించాలి. కెరీర్ కౌన్సెలింగ్, ఓరియంటేషన్ ప్రోగ్రామ్‌లు నిర్వహించాలి. ఇంటరాక్టివ్, ఆచరణాత్మక బోధనా పద్ధతులతో వారిని ఆకర్షించాలి.

ఉద్యోగ మార్కెట్ అనుసంధానం

తెలుగు PG గ్రాడ్యుయేట్లకు అనువాదం, కంటెంట్ క్రియేషన్, భాషా సాంకేతికత రంగాలలో ఉద్యోగాలు కల్పించడం. పరిశ్రమ, విద్యాసంస్థల మధ్య సమన్వయం లోపం. పరిశ్రమలతో భాగస్వామ్యం ఏర్పాటు చేసుకోవాలి. ప్లేస్‌మెంట్ సెల్‌లను బలోపేతం చేయాలి. ఇంటర్న్‌షిప్‌లను తప్పనిసరి

చేయాలి. నూతన నైపుణ్యాలకు అనుగుణంగా ఉద్యోగ మేళాలు నిర్వహించాలి.

ఈ సవాళ్లను అధిగమించడానికి ప్రభుత్వాలు, విశ్వ విద్యాలయాలు, అధ్యాపకులు, విద్యార్థులు కలిసి పనిచేయాలి. అప్పుడే నూతన జాతీయ విద్యా విధానం 2020 తెలుగు భాషా సాహిత్య అధ్యయనాలలో నిజమైన నవ శకానికి నాంది పలుకుతుంది.

**నూతనవిద్యావిధానం 2020లో తెలుగుసిలబస్ ఎలా ఉండాలి?**

NEP 2020 ఉన్నత విద్యలో సరళత, బహుళ–విషయ అధ్యయనం, పరిశోధనా ప్రాధాన్యతను నొక్కి చెబుతుంది. తెలుగు PG కోర్సుల సిలబస్ ఈ సూత్రాలకు అనుగుణంగా రూపొందాలి. ఇది విద్యార్థులను కేవలం జ్ఞాన గ్రహీతలుగా కాకుండా, క్రియాశీల జ్ఞాన సృష్టికర్తలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఉండాలి. భవిష్యత్ అవసరాలకు తగ్గట్టుగా తెలుగు అధ్యయనాలను తీర్చిదిద్దడానికి ఇది ఒక సువర్ణావకాశం.

NEP **2020 సంబంధిత లక్షణాలు – తెలుగు సిలబస్ అనుసంధానం:**

**సరళత** (Flexibility): NEP 2020 ప్రకారం, PG ç పోగ్రామ్‌లు ఒక సంవత్సరం (4 సంవత్సరాల అండర్ గ్రాడ్యుయేట్ UG తర్వాత) లేదా రెండు సంవత్సరాల (మూడు సంవత్సరాల UG తర్వాత) నిడివితో ఉండవచ్చు. ఇది విద్యార్థులకు వారి UG నేపథ్యం ఆధారంగా సరళమైన ప్రవేశ–నిష్క్రమణ ఎంపికలను అందిస్తుంది. తెలుగు M.A. సిలబస్ ఈ రెండు రకాల ప్రోగ్రామ్‌లకు అనుగుణంగా రూపొందించబడాలి. నాలుగు సంవత్సరాల UG (రీసెర్చ్‌తో సహా) పూర్తి చేసిన విద్యార్థులకు ఒక సంవత్సరం M.A. ప్రోగ్రామ్ మరింత పరిశోధనా – కేంద్రీకృతమై ఉండాలి.

**బహుళ–విషయ విద్య** (Multidisciplinary Education):

NEP 2020 విద్యార్థులను ఒకే రంగంలో నిపుణులుగా కాకుండా, వివిధ రంగాలలో అవగాహన ఉన్నవారిగా తీర్చిదిద్దాలని కోరుకుంటుంది. అంటే ఆర్ట్స్ (కళలు) ఇతర రంగాలతో (ఉదాహరణకు, ఆర్ట్స్ – కంప్యూటర్ సైన్స్) అనుసంధానించబడాలి. తెలుగు సాహిత్య అధ్యయనాలు చరిత్ర, సామాజిక శాస్త్రాలు, డేటా సైన్స్, కృత్రిమ మేధస్సు, సినిమా అధ్యయనాలు, పర్యావరణ అధ్యయనాలు, మానసిక శాస్త్రం వంటి రంగాలతో అనుసంధానించబడాలి. ఇది విద్యార్థులకు విస్తృత దృక్పథాన్ని అందిస్తుంది.

**పరిశోధన:** 2 సంవత్సరాల PG ప్రోగ్రామ్‌లో రెండవ సంవత్సరం పూర్తిగా పరిశోధనకు కేటాయించడం అనేది NEP 2020 ఒక ముఖ్య లక్షణం. ఇది విద్యార్థులను లోతైన పరిశోధన చేయడానికి ప్రోత్సహిస్తుంది. వారికి పరిశోధనా నైపుణ్యాలను పెంపొందిస్తుంది. తెలుగు M.A. సిలబస్ పరిశోధనా పద్ధతులకు, ప్రాజెక్ట్ వర్క్‌కు, సిద్ధాంత వ్యాసం (డిసర్టేషన్) తయారీకి అధిక ప్రాధాన్యత ఇవ్వాలి.

**నైపుణ్య ఆధారితం** (Skill-based): ఉద్యోగ సామర్థ్యాన్ని పెంచే (Employability Skills) కోర్సులు శిక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి. ఇది విద్యార్థులు గ్రాడ్యుయేషన్ పూర్తయిన తర్వాత ఉద్యోగ మార్కెట్‌లో పోటీ పడటానికి సహాయపడుతుంది. తెలుగు సాహిత్యం కేవలం అకడమిక్ రంగానికే పరిమితం కాకుండా, మీడియా, పబ్లిషింగ్, కంటెంట్ క్రియేషన్, అనువాదం వంటి రంగాలలో ఉపాధి అవకాశాలను కల్పించాలి.

**ప్రతిపాదిత నమూనా సిలబస్:**

NEP 2020 సూత్రాలకు అనుగుణంగా 2 సంవత్సరాల ఒక సంవత్సరం తెలుగు M.A. ప్రోగ్రామ్‌ల కోసం ఒక ప్రతిపాదిత సమగ్ర సిలబస్ కింద ఇవ్వబడింది. ఈ సిలబస్ ప్రాథమికంగా 'క్రెడిట్ సిస్టమ్' పై ఆధారపడి ఉంటుంది. ప్రతి కోర్సు ఒక నిర్దిష్ట సంఖ్యలో క్రెడిట్‌లను కలిగి ఉంటుంది.

**రెండు సంవత్సరాల** M.A. **తెలుగు ప్రోగ్రామ్** ( నాలుగు సెమిస్టర్లు)

**మొదటి సంవత్సరం (మొదటి రెండవ సెమిస్టర్లు):** ఈ సంవత్సరం తెలుగు భాషా సాహిత్యంలో బలమైన సిద్ధాంత పరమైన పునాదిని ఏర్పరుస్తుంది, అదే సమయంలో నూతన పరిశోధనా దృక్పథాలను, అనువర్తనాలను పరిచయం చేస్తుంది.

**కోర్ పేపర్లు** (విద్యార్థులందరికి తప్పనిసరి):

**1. తెలుగు భాషా చరిత్ర, భాషాశాస్త్రం:** తెలుగు భాషా పరిణామం, ద్రావిడ భాషా కుటుంబంలో తెలుగు స్థానం, ప్రామాణిక భాషాశాస్త్ర సిద్ధాంతాలు (ధ్వనిశాస్త్రం, రూప నిర్మాణం, వాక్యనిర్మాణం, అర్థ విజ్ఞానం), ఆధునిక తెలుగు భాషా లక్షణాలు, మాండలికాలు, వ్యాకరణ నిర్మాణంపై లోతైన అధ్యయనం.

**2. తెలుగు సాహిత్య చరిత్ర (ప్రాచీనం నుండి ఆధునికం):** ప్రాచీన, మధ్యయుగ, ఆధునిక సాహిత్య కాలాలు, ప్రముఖ రచయితలు, వారి రచనలు, వివిధ సాహిత్య ఉద్యమాలు (నవ్య కవిత్వం, అభ్యుదయ కవిత్వం, దిగంబర

కవిత్వం, స్త్రీవాద, దళిత సాహిత్యాలు), ప్రక్రియా వికాసంపై సమగ్ర విశ్లేషణ.

**3. సాహిత్య విమర్శ సిద్ధాంతాలు అనువర్తనం:** పాశ్చాత్య (క్లాసికల్, రొమాంటిసిజం, మార్క్సిజం, ఫెమినిజం, పోస్ట్-మోడర్నిజం, పోస్ట్-కలోనియలిజం), భారతీయ (రస, ధ్వని, అలంకార సిద్ధాంతాలు) సాహిత్య విమర్శ సిద్ధాంతాలు, వాటి అనువర్తనం, తెలుగు విమర్శపై వాటి ప్రభావం. సమకాలీన విమర్శనా దృక్పథాలను పరిచయం చేయడం.

**4. పరిశోధనా పద్ధతులు - అకడమిక్ రైటింగ్:** పరిశోధనా నిర్వచనం, రకాలు, పరిశోధనా సమస్యను గుర్తించడం, సాహిత్య సమీక్ష నిర్వహించడం, పరిశోధనా ప్రశ్నలు/లక్ష్యాలను రూపొందించడం, డేటా సేకరణ పద్ధతులు (గుణాత్మక, పరిమాణాత్మక), పరిశోధనా నైతిక నియమాలు, అకడమిక్ రచనలో ప్లాజియరిజం నివారణ, రిఫరెన్సింగ్ స్టైల్స్ (MLA, APA).

**ఐచ్ఛిక పేపర్లు** (ఏవైనా 2 ఎంచుకోవాలి ):

**1. జానపద విజ్ఞానం, క్షేత్ర అధ్యయనం:** తెలుగు జానపద సాహిత్యం (కథలు, పాటలు, సామెతలు, పొడుపు కథలు), జానపద కళలు (తోలుబొమ్మలాట, హరికథ, బుర్రకథ), జానపద సంస్కృతి, జానపద పరిశోధనా పద్ధతులు, క్షేత్ర అధ్యయనం (ఫీల్డ్ వర్క్) ప్రాముఖ్యత, పద్ధతులు.

**2. ఆధునిక తెలుగు కవిత్వం:** 20వ శతాబ్దం నుండి ప్రస్తుత కాలం వరకు తెలుగు కవిత్వంలో వచ్చిన మార్పులు, వివిధ కవిత్వ ఉద్యమాలు, ప్రముఖ కవులు (కృష్ణశాస్త్రి, విశ్వనాథ, శ్రీశ్రీ, జాషువా, దాశరథి, సినారె), విప్లవ కవిత్వం, స్త్రీవాద కవిత్వం, దళిత కవిత్వం, ముస్లిం కవిత్వం, డిజిటల్ కవిత్వంపై లోతైన అధ్యయనం.

**3. తెలుగులో డిజిటల్ హ్యూమానిటీస్ అధ్యయనం:** డిజిటల్ సాధనాలను ఉపయోగించి సాహిత్య అధ్యయనం, తెలుగు గ్రంథాల డిజిటలైజేషన్ ప్రాజెక్ట్‌ల నిర్మాణం, నిర్వహణ అనేది ఆధునిక పరిశోధనకు అత్యంత అవసరం.

**4. అనువాద సిద్ధాంతం ఆచరణ:** అనువాద ప్రక్రియ, వివిధ అనువాద సిద్ధాంతాలు (లక్ష్యభాష-మూలభాష, రూప-అర్థ అనువాదం), తెలుగులోకి/నుండి అనువాదంలో సవాళ్లు, సాంస్కృతిక అంశాలు, అనువాద సమస్యలు, ఆచరణాత్మక అనువాద వ్యాయామాలు (సాహిత్య, వ్యాపార, సాంకేతిక అనువాదాలు).

**5. నైపుణ్య కోర్సు** (Skill Course - తప్పనిసరి):

భాషా నైపుణ్యాలు రచన, విశ్లేషణ, కమ్యూనికేషన్): భాషా నైపుణ్యాలు (రచన, విశ్లేషణ, కమ్యూనికేషన్): అకడమిక్ రైటింగ్ (పరిశోధనా పత్రం, వ్యాసం), విశ్లేషణాత్మక ఆలోచన, ఎడిటింగ్, ప్రూఫ్ రీడింగ్, ప్రజెంటేషన్ నైపుణ్యాలు, పబ్లిక్ స్పీకింగ్, ఇంటర్వ్యూ నైపుణ్యాలు మొదలైన అంశాలు.

**రెండవ సంవత్సరం (మూడవ నాలుగవ సెమిస్టర్లు - మొత్తం):** ఈ సంవత్సరం ప్రధానంగా పరిశోధనా నైపుణ్యాలు, బహుళ-విషయ అనుసంధానం ఒక స్వతంత్ర పరిశోధనా ప్రాజెక్ట్‌పై దృష్టి సారిస్తుంది.

**కోర్ పేపర్లు** (విద్యార్థులందరికి తప్పనిసరి):

**1. అధునాతన పరిశోధనా పద్ధతులు డేటా విశ్లేషణ:** పరిశోధనా రూపకల్పనలో లోతైన అభ్యాసం, పరిమాణాత్మక గుణాత్మక డేటా విశ్లేషణ పద్ధతులు, తెలుగు సాఫ్ట్‌వేర్ సాధనాల పరిచయం, పరిశోధనా వ్యాస రచనలో అధునాతన నైపుణ్యాలు, పరిశోధనా నివేదికల తయారీ, ప్రచురణ నైతిక నియమాలు, పీర్ రివ్యూ ప్రక్రియ మొదలైనవి.

**2. తెలుగు శాఖ విద్యార్థులకు అవసరమైన అంశాన్ని రూపొందించడం**

**బహుళ-విషయ ఐచ్ఛికాలు** (ఏదైనా 2 ఎంచుకోవాలి):

**1. తెలుగు సాహిత్యం - సామాజిక శాస్త్రాలు:** తెలుగు సాహిత్యం సామాజిక మార్పులపై, సాంస్కృతిక అధ్యయనాలపై దాని ప్రభావం, సాహిత్యంలో సామాజిక న్యాయం, స్త్రీవాదం, దళిత వాదం, ప్రాంతీయ వాదం వంటి అంశాల విశ్లేషణ.

**2. తెలుగు మీడియా, కంటెంట్ క్రియేషన్:** మీడియా రైటింగ్ (వార్తా రచన, వ్యాసాలు), జర్నలిజం, స్క్రిప్ట్ రైటింగ్ (సినిమా, టీవీ సీరియల్స్ కోసం), డిజిటల్ కంటెంట్ డెవలప్‌మెంట్ (బ్లాగులు, వెబ్‌సైట్లు, సోషల్ మీడియా కోసం), పోడ్ కాస్టింగ్, యూట్యూబ్ కంటెంట్ క్రియేషన్.

**3. భారతీయ సౌందర్య శాస్త్రం, తులనాత్మక సాహిత్యం:** భారతీయ సాహిత్యంలో సౌందర్య శాస్త్ర సిద్ధాంతాలు, వివిధ భారతీయ భాషల సాహిత్యాల మధ్య పోలికలు, ప్రభావాలు, ప్రపంచ సాహిత్యంతో తెలుగు సాహిత్య సంబంధాలు.

**పరిశోధనా ప్రాజెక్ట్/ డిసర్టేషన్** (Research Project / Dissertation):

**సెమిస్టర్ III (ప్రతిపాదన, తొలి అధ్యయనం):** విద్యార్థులు తమ పరిశోధనా సమస్యను గుర్తించడం, విస్తృత సాహిత్య సమీక్ష నిర్వహించడం, పరిశోధనా ప్రశ్నలు/లక్ష్యాలను రూపొందించడం, పరిశోధనా పద్ధతులను ఖరారు చేయడం,

ఒక సమగ్ర పరిశోధనా ప్రతిపాదన (Research Proposal) సమర్పించడం. దీనిని ఒక సెమినార్ ప్రెజెంటేషన్ పీర్ రివ్యూతో కూడిన నివేదిక రూపంలో సమర్పించాలి.

**సెమిస్టర్ IV (సిద్ధాంత వ్యాస సమర్పణ):** గుర్తించిన సమస్యపై స్వతంత్ర పరిశోధన నిర్వహించి, ఒక సమగ్ర డిసర్టేషన్ను సమర్పించాలి. ఈ డిసర్టేషన్ ప్రచురణకు తగిన నాణ్యతతో ఉండాలి. దీనికి ఒక మౌఖిక పరీక్ష ఉంటుంది.

**ఒక సంవత్సరం M.A. తెలుగు ప్రోగ్రామ్ (4 సంవత్సరాల UG తర్వాత)** ఈ ప్రోగ్రామ్ ముఖ్యంగా 4 సంవత్సరాల UG ప్రోగ్రామ్‌లో పరిశోధనతో కూడిన బ్యాచిలర్ డిగ్రీ పొందిన వారికి ఉద్దేశించబడింది. ఇది పరిశోధనపై మరింత లోతైన దృష్టిని సారిస్తుంది. అధునాతన స్థాయి అధ్యయనాలను అందిస్తుంది.

**ఆధునిక సాహిత్య విమర్శ, సిద్ధాంతాలు:** అధునాతన విమర్శనా సిద్ధాంతాలు, ప్రస్తుత ధోరణులు, పరిశోధనలో వాటి అనువర్తనం (ఉదాహరణకు, పర్యావరణ విమర్శ, మెటాఫిక్షన్, నెరేటాలజీ).

**పరిశోధనా సెమినార్, పబ్లికేషన్ ఎథిక్స్:** విద్యార్థులు తమ ఆసక్తి గల రంగాలపై సెమినార్లను నిర్వహించడం, పీర్ రివ్యూలో పాల్గొనడం, పరిశోధనా అంశాలపై లోతైన చర్చలు. పరిశోధనా పత్రాలను ఎలా రాయాలి, పబ్లిష్ చేయాలి, ప్రచురణ నైతికతపై సమగ్ర అవగాహన.

**ప్రధాన సిద్ధాంత వ్యాస రూపకల్పన:** ఒక నిర్దిష్ట సాహిత్య అంశంపై లోతైన పరిశోధన ఫలితాలను ఒక ప్రచురించదగిన మోనోగ్రాఫ్‌గా సమర్పించడం వంటివి ఉండవచ్చు. ఈ డిసర్టేషన్ ఉన్నత ప్రమాణాలతో ఉండాలి, ప్రచురణకు లేదా ప్రాజెక్ట్ అమలుకు సంసిద్ధంగా ఉండాలి.

**ఈ ప్రతిపాదిత సిలబస్ వల్ల కలిగే ప్రయోజనాలు:**

ఈ సమగ్ర సిలబస్ NEP 2020 లక్ష్యాలను చేరుకోవడమే కాకుండా, తెలుగు విద్యార్థులకు అనేక ప్రయోజనాలను అందిస్తుంది.

**1. అభ్యాస ఫలితాలు:** విద్యార్థులు సాహిత్య విశ్లేషణ, విమర్శనాత్మక చింతన, అధునాతన పరిశోధనా నైపుణ్యాలు డిజిటల్ సాధనాల వినియోగంలో ప్రావీణ్యం సాధిస్తారు. వారు కేవలం జ్ఞానాన్ని పొందడమే కాకుండా, దానిని విశ్లేషించడం, అనువర్తించడం, కొత్త జ్ఞానాన్ని సృష్టించడం నేర్చుకుంటారు.

**2. ఉద్యోగ సామర్థ్యం:** జర్నలిజం, కంటెంట్ క్రియేషన్, భాషా సాంకేతికత , అనువాదం, పబ్లిషింగ్, డిజిటల్ లైబ్రరీ నిర్వహణ, సాఫ్ట్‌వేర్ లోకలైజేషన్, మీడియా హౌస్‌లు, కంటెంట్ డెవలప్‌మెంట్ కంపెనీలు, అకడమిక్ పరిశోధన, టీచింగ్ వంటి అనేక రంగాలలో అవకాశాలు పెరుగుతాయి.

**3. పరిశోధనా సామర్థ్యం:** నిరంతర పరిశోధనా దృక్పథం విద్యార్థులను కేవలం జ్ఞాన వినియోగదారులుగా కాకుండా, స్వతంత్ర జ్ఞాన సృష్టికర్తలుగా, వినూత్న ఆలోచనాపరులుగా మారుస్తుంది. ఉన్నత స్థాయి పరిశోధనలకు బలమైన పునాదిని వేస్తుంది.

**4. సమకాలీన అవసరాలకు అనుగుణంగా:** ఈ సిలబస్ తెలుగు అధ్యయనాలను సాంప్రదాయ విలువలతో పాటు సమకాలీన ప్రపంచ అవసరాలకు అనుగుణంగా రూపొందిస్తుంది, తద్వారా విద్యార్థులు భవిష్యత్తు సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోగలరు.

**5. అంతర్జాతీయ పోటీ తత్వం:** ఆధునిక టెక్నాలజీ, బహుళ-విషయ దృక్పథాన్ని కలపడం వల్ల తెలుగు విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడగల సామర్థ్యాన్ని పొందుతారు.

**ముగింపు: తెలుగు బోధనలో నవశకం**

నూతన విద్యా విధానం 2020 (NEP - 2020) తెలుగు పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సులను పునర్వ్యవస్థీకరించడానికి ఒక అద్భుతమైన, చారిత్రాత్మక అవకాశాన్ని అందిస్తుంది. ప్రస్తుత సిలబస్‌లు తెలుగు భాషా, సాహిత్య చరిత్ర విమర్శలలో బలమైన పునాదిని అందిస్తున్నప్పటికీ, ఆధునిక ప్రపంచానికి అవసరమైన పరిశోధన, బహుళ-విషయ అధ్యయనాలు, నైపుణ్య శిక్షణలో స్పష్టమైన లోపాలను కలిగి ఉన్నాయి. ఈ లోపాలను పూడ్చడం ద్వారానే తెలుగు అధ్యయనాలు సమకాలీన విద్యా లక్ష్యాలను సాధించగలవు. NEP 2020 సూత్రాలకు అనుగుణంగా సిలబస్‌ను రూపొందించడం అత్యంత కీలకం. ఇది విద్యార్థులకు సరళమైన ప్రవేశ-నిష్క్రమణ ఎంపికలను, విస్తృత బహుళ-విషయ కోర్సులను లోతైన పరిశోధనా అవకాశాలను అందిస్తుంది. విద్యార్థులను కేవలం జ్ఞాన వినియోగదారులుగా కాకుండా, జ్ఞాన సృష్టికర్తలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో పరిశోధనా ప్రాజెక్టులు, డిసర్టేషన్‌లకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి. ఈ సమూల మార్పులు తెలుగు పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సులను కేవలం అకడమిక్ అధ్యయనాలుగా కాకుండా, ఆచరణాత్మక, పరిశోధనాత్మక వృత్తిపరమైన అవకాశాలను అందించే కోర్సులుగా మారుస్తాయి. తెలుగు భాషా సాహిత్య అధ్యయనాలను ఆధునిక ప్రపంచానికి అనుగుణంగా తీర్చిదిద్దడానికి ఇది సరైన సమయం, తద్వారా మన గొప్ప సాహిత్య వారసత్వం భవిష్యత్తు తరాలకు కూడా అందుబాటులో ఉంటుంది. T

తొవ్వ ముచ్చట

# నా కవిత్వ వాహకానికి ప్రజలే ప్రధాన ఇంధనం

**- జూకంటి జగన్నాథం**

**ఇంటర్వ్యూయర్: తీగల లావణ్య**

*ప్రపంచీకరణ పేరుతో భారతదేశానికి వచ్చిన పడమటి గాలుల ప్రభావాన్ని ముందుగా అంచనా వేసిన కవి. ఆ ప్రభావం వల్ల రాలిపోతున్న ఆకుపచ్చదనాన్ని తన అక్షరాల్లో కాపాడుకున్న రచయిత. జగిత్యాల జైత్రయాత్ర ప్రతిధ్వనిని తన కలం ద్వారా మళ్లీమళ్లీ వినిపిస్తున్న సృజనాత్మక స్వరం. తప్పిపోయిన ఊర్లను, మనుషులను పుస్తకాలలో అక్షరాలుగా చిత్రించుకుంటున్న జ్ఞాపకాల చిత్రకారుడు. విశ్వాన్ని మట్టి పెళ్ళనుండి పుట్టిన కళ్ళతో చూస్తున్న మట్టిచూపు. మానేరు పాదాలకు తగిలిన గాయాలను తన కవిత్వంతో తడుపుతున్న సాహిత్య ప్రవాహం. భాష, నేల, ప్రాంతంపై జరిగే దాడికి వ్యతిరేకంగా నిలబడ్డ అస్తిత్వ కాపరి. కవిత్వానికి ఉండవలసిన ఖచ్చితమైన లక్షణాలలో కన్నీటి చెమ్మ ఉండాలనే కవి, కథకుడు జూకంటి జగన్నాథం గారితో నడుస్తున్న తెలంగాణ తరపున తీగల లావణ్య చేసిన సంభాషణ.*

**1. మీ బాల్యం విద్యాభ్యాసం గురించి చెప్పండి?**

నేను సిరిసిల్ల జిల్లా కోహెడ మండలం దగ్గర ఉన్న తంగళ్ళపల్లిలో చదువుకున్నాను. అది మా అమ్మమ్మ ఊరు. నేను రెగ్యులర్ గా పదవ తరగతి వరకు మాత్రమే చదివాను. మా మేనమామ పై చదువులకు పంపించనంటే తీవ్రంగా విభేధించాను. అనివార్య పరిస్థితుల వలన తిరిగి మా ఊరికి వచ్చాను. ఇక్కడ కైకిలి పనికి పోయేవాడిని. మానేరు వాగులో కాలువ తీయడం, పాత బావుల పూడికలు తీయడం, బాయిలు తవ్వడం మరియు కొడవలితో వరి కోయడం లాంటి పనులన్నీ చేసేవాడిని. మా ఊరి పెద్ద వాళ్ళు కొందరు చదువుకున్నవాడివి ఏం పనులకు పోతావు ? మా పిల్లలకు ప్రైవేట్ గా చదువు చెప్పమని కోరారు. అలా 1974 నుండి 1979 ఫిబ్రవరి వరకు శిశు నుండి ఏడవ తరగతి వరకు ఒక్కడినే చదువు చెప్పేవాడిని. అంతకుముందే మా అమ్మమ్మ ఊరిలో పడిన సాంస్కృతిక సాహిత్య బీజాలు, సిరిసిల్లలోని సాహిత్య వాతావరణం నాలో నిద్రాణమై ఉన్న సాహిత్య అభిలాషను తట్టి లేపాయి. సిరిసిల్ల పౌర గ్రంధాలయంలో కనిపించిన అన్ని పుస్తకాలను మంచి, చెడు అనే భేదం లేకుండా చదివాను. అందులోంచి మంచి సాహిత్యాన్ని ఎన్నిక చేసుకున్నాను. నాలోని సాహిత్య కాంక్షను గమనించిన కొందరు ఉపాధ్యాయులు కలిసి ప్రైవేటుగా నా ఇంటర్మీడియట్ పరీక్ష ఫీజును కట్టారు. అలా ఇంటర్మీడియట్ పూర్తి చేశాను. అప్పటికే సిరిసిల్ల యువ సాహితీ సమావేశాలలో పరిచయమైన సీనియర్ కవి, రచయిత జక్కని వెంకటరాజం సార్ నన్ను అనేక విధాలుగా సాహిత్య రంగంలో ప్రోత్సహించడం వలన కవిగా రూపుదిద్దుకున్నాను.

**2. మీరు మొదటగా రాసిన కవిత ఏది ? కవిత్వం రాయడానికి మిమ్మల్ని ప్రేరేపించిన విషయాలు ఏమిటి ?**

1973 నుండి సిరిసిల్లలో సి.నా.రె గారి అనుయాయులు కొందరు యువ సాహితీ సంస్థ స్థాపించి నెల నెలా కార్యక్రమాలు నిర్వహించేవారు. వారు రేడియో లలిత గీతాలు రాసేవారు. నేను కూడా 1975 వరకు లెక్కకు మించి లలిత గీతాలు రాశాను. అత్యవసర పరిస్థితి తర్వాత దేశంలోని మేధావి వర్గానికి ముందు ఎప్పుడు లేని విధంగా కొత్త చూపు వచ్చింది. ఆ పరిణామ క్రమంలో నిజాం వెంకటేశం సార్ పరిచయంతో నాకు ఒక కొత్త లోచూపు ఏర్పడినది. దేన్ని రాయాలి. దేన్ని రాయకూడదు. ఎవరి వైపు నిలబడి రాయాలి. ఎవరిని ధిక్కరించాలి. ఆ సారు సహచర్యంతో తెలివిడి జ్ఞానం మరింత పదును చేరింది. బహుశా 1976 ప్రాంతంలో నా మొదటి కవిత అరుణతారలో ప్రచురించబడినది .

అప్పటికే ఒకవైపు సిరిసిల్ల, జగిత్యాల ప్రాంతాలలో రైతు కూలీల సంఘాలు ఏర్పడి తమ కూలి పెంచాలని, వెట్టి చాకిరి బంద్ చేయాలనీ, దున్నేవాడికే భూమి చెందాలని పలు డిమాండ్లు ముందుకు తెచ్చాయి. నాటి విద్యాధికుల నాయకత్వంలో భూస్వామ్య వర్గాలకు వ్యతిరేకంగా గ్రామీణ ప్రాంతాలలో పెద్ద ఎత్తున పోరాటాలు జరుగుతున్నాయి. మరోవైపు అమాయక గ్రామీణ, పేద ప్రజలలో దొరల అన్యాయాలకు వ్యతిరేకంగా ఒక కదలిక ఉవ్వెత్తున లేచింది. అదిగో అటువంటి సందర్భంలో నేను ఒక స్పష్టమైన సామాజిక అవగాహనతో కవిత్వం రాయడం ప్రారంభించాను. శత్రువు రూపం మార్చుకున్న ప్రతి మూలమలుపులోను నేను కవిత్వమై అటకాయించాను.

కవిత్వ ప్రేరకులు ప్రారంభంలో జక్కని వెంకట రాజం, వెంకటేశం సార్లు అయితే ఇప్పుడు నేను 50 ఏళ్ల వెనుకకు



తిరిగి నన్ను నేను మర్లేసుకుని చూసుకుంటే అంతకన్నా మిక్కిలి ప్రజలే నాకు ప్రేరకులు, మార్గదర్శకులుగా నిలిచారు. అంతేకాకుండా నా కవిత్వ వాహకానికి ప్రజలూ, వారి పోరాట ఆరాటాలు ప్రధాన ఇంధన వనరని రూఢీగా అనిపిస్తున్నది.

**3. సాహిత్యం వైపు మీరు రావడానికి మిమ్మల్ని ప్రభావితం చేసిన పరిస్థితులు, వ్యక్తులు ఎవరు?**

నేను సాహిత్యం వైపు రావడానికి కారణం మా అమ్మమ్మ ఊరు సాంస్కృతిక కేంద్రంగా విలసిల్లుతుండేది. మూడో తరగతి నుండి పదవ తరగతి వరకు అక్కడే చదువుకున్నాను. దాంతోపాటు ఆ ఊరి జానకి రామయ్య సారు శనిగరం హైస్కూల్లో సెకండ్ గ్రేడ్ తెలుగు పండితుడిగా పనిచేస్తుండేవాడు. ఆయన సిద్దిపేట నుండి ఆంధ్రప్రభ వార పత్రిక, చందమామ, బాలమిత్ర వంటి పత్రికలు తెప్పించేవాడు. వారి పిల్లలతో పాటు నేను చదువుకునేవాడిని. దీనికి సమాంతరంగా ఆ ఊరిలో హరికథలు, బాగోతాలు, రామాయణాలు, చిరుతల రామాయణాలు, పటం కథలు సంవత్సరం అంతా జరుగుతుండేవి. వాటిని మా అమ్మమ్మతో పాటు నేను రాత్రిపూట పోయి చూసేవాడిని. వినేవాడిని. అలా నాలో ఆదిగా సాంస్కృతిక, సాహిత్య బీజాలు నిద్రాణమై ఉన్నాయి. మా ఊరికి వచ్చిన తర్వాత మానేరు ఒడ్డున అటువైపు ఉన్న సిరిసిల్ల పౌర గ్రంథాలయములో మరియు కనపర్తి సారు హోం లైబ్రరీలోని మంచి మంచి సాహిత్య పుస్తకాలను చదివేవాడిని. వారు నిర్వహించే సాహిత్య సభలలో పాల్గొనే వాడిని. అలా నాలో నిద్రాణమై ఉన్న సాహిత్య బీజాలు పునర్జీవం పొంది మొలకెత్తడం ప్రారంభించింది. ఆ విధంగా నా మీద ప్రారంభంలో సాహిత్య ప్రభావాలు కలిగాయి. అందులో ముఖ్యంగా జక్కని వేంకటరాజం మరియు నిజాం వెంకటేశం సార్ల యొక్క మార్గదర్శనంలో నా చుట్టూ అప్పుడప్పుడే ఎగసిపడుతున్న ప్రజా పోరాటాల ప్రభావంతో, ప్రేరణతో ప్రజల యొక్క సంవేదనలను కవిత్వం, కథల ద్వారా నాకంటూ మార్గాన్ని నిర్మించుకొని నాదైనా దారిలో నేను ముందుకు నడుస్తూ వస్తున్నాను.

**4. మీరు ఎక్కువగా కవితలు, కథలు రాశారు కదా! నవల ప్రక్రియను చేపట్టకపోవడానికి కారణం ఏమిటి?**

అవును. నేను ఇప్పటివరకు 18 కవితా సంపుటాలు, ఒక కథల సంకలనం, ఒక వ్యాసాల సంకలనం తీసుకు వచ్చాను. సమాజం మార్పు చేర్పు తీసుకుంటున్న ప్రతి మూల మలుపులో నేను కదిలిపోయి కన్నీళ్ళ పర్యంతమై కవిత్వమై ప్రశ్నించాను. రాజ్యాన్ని గల్లా పట్టి అడిగాను. అలాగే నేను 1986లో రాసిన కథకు ఆంధ్రజ్యోతి దీపావళి కథల పోటీలో ద్వితీయ బహుమతి వచ్చింది. మొదటి కథ 'వలస' ఎనలేని కీర్తి ప్రతిష్టలు తీసుకువచ్చింది. అప్పుడే నిర్ణయించుకున్నాను నేను ఏళ్లకు ఏండ్లు అధ్యయనం చేసి నేను మాత్రమే రాయవలసిన, రాయగలిగిన కథలను ఇప్పటివరకు 19 రాశాను. కవిత్వంలో ఇమడని అంశాలను చెప్పడంకోసం కథా వస్తువుగా

చేసుకొని క్షేత్రస్థాయిలో కావలసినంత అధ్యయనం చేసి కథలు రాశాను. అనేక నవలలు చదివాను కానీ నవల రాయడానికి అటువైపు తొంగి చూసే ప్రయత్నం చేయలేదు. పూనుకోలేకపోయాను. నేను రాసిన ప్రతి కథ వెనుక వున్న భూమిక కార్యాకారణ సంబంధాల చిక్కుముళ్లను నేను లోతుగా అధ్యయనం చేశాను. అందుకనే నేను రాసిన ప్రతీ కథ వివిధ కథాసంకలనాలలో చోటు దక్కించుకున్నాయి. నేను రాయవలసిన కథలు రాయకపోవడానికి ప్రధాన కారణం బహుశా ప్రాథమికంగా నేను కవిని కావడం అనుకుంటున్నాను. తక్షణ స్పందనగా కవిత్వం రాయడం కూడా కావచ్చు. కానీ ఇటీవల ఒక నవల రాయడానికి లోతుగా అధ్యయనం చేస్తున్నాను. మదనపడుతున్నాను. నాకు నేనే తీవ్రంగా అంతః ఘర్షణ పడుతున్నాను. ఈ సంవత్సరం చివరి వరకు నవల రాసే ప్రయత్నం చేస్తున్నాను.

**5. తెలంగాణ రచయితల వేదిక అధ్యక్షుడిగా పని చేసిన కాలంలో ఎలాంటి అనుభవాలను పొందారు?**

అవును. నేను నా మానాన రాసుకుంటూ ఉండేవాడిని. కానీ కరీంనగర్ మిత్రులు ముఖ్యంగా గోపు లింగారెడ్డి ఇతర సాహితీ మిత్రుల ప్రోద్బలంతో 2007 చివరిలో జరిగిన తెలంగాణ రచయితల వేదిక కార్యవర్గం ఎన్నికలలో పోటీ చేసాను. అప్పటివరకు కొనసాగుతున్న అధ్యక్షుడు కూడా ఆ ఎన్నికలలో పోటీ చేశాడు. తన సహచరులతో మంతనాలు జరిపి ఏమైందో ఏమో కానీ చివరికి తన నామినేషన్ను ఉపసంహరించుకున్నాడు. దానితో నేను అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యాను. అప్పుడు ఆ సమావేశానికి హాజరైన జూలూరి గౌరీ శంకర్ ను ప్రధాన కార్యదర్శిగా ఎన్నిక చేసుకున్నారు.

అనంతరం తెలంగాణ రాష్ట్ర తెరవే మహాసభలు నిర్వహించాము. తెరవే జిల్లా కమిటీ కార్యవర్గాలను సామాజిక ప్రాసంగికతతో, సమతూకంతో ఎన్నిక చేసుకోవడం జరిగింది. అప్పుడు తెలంగాణ ఉద్యమ అవసరాల రీత్యా అఖిలభారత తెలంగాణ రచయితల వేదికను ఏర్పాటు చేసుకోవడం జరిగినది. అప్పటినుంచి ప్రజల వైపు నుంచి మాట్లాడుతున్న తెరవే నాటి రాష్ట్ర, జిల్లా కార్యవర్గాలను అనేక ప్రలోభాలకు లోను చేసి బలహీనపరచాలని చూశారు. కానీ నా జాగ్రత్త వల్ల తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ మాత్రం ప్రలోభాలకు గురికాకుండా రెట్టించిన ఉత్సాహంతో పనిచేశారు. ఆ విధంగా కార్యక్రమాలను రూపొందించి తెలంగాణ వాదానికి తమ వంతు కృషిలో భాగంగా ఆయా కవులు, రచయితలు ప్రత్యేక చెరిగిపోని, చెదిరిపోని సామాజిక ముద్రను వేశారు. 2013 ప్రారంభంలో నా స్వంత కారణాల రీత్యా అధ్యక్ష పదవి నుంచి తప్పుకున్నాను. అప్పుడు రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేసి జూలూరి గౌరి శంకర్ ను అధ్యక్షునిగా ఎన్నుకోవడం జరిగింది. ఆదిలాబాద్ నుంచి మహబూబాబాద్ వరకు ఇటు నిజాంబాద్ నుంచి ఖమ్మం వరకు అనేక సమావేశాల అనుభవాలును, అనుభూతులను నాతో పాటు తెరవే కార్యవర్గ సభ్యులు అందరమూ ప్రోది చేసుకున్నాము. అప్పుడు నేను ఇచ్చిన అధ్యక్ష ఉపన్యాసంలో తెలంగాణ వచ్చేవరకు తెలంగాణ రచయితల వేదికకు ఎంతైతే పనుంటుందో, తెలంగాణ వచ్చిన తర్వాత అంతకు రెట్టింపు పని ఉంటుందని మాట్లాడాను. అది తెలంగాణ వచ్చిన పిదప కార్యాచరణలో మరింత రుజువైనది. రాజ్యం దురాగతాలని, కుట్రలను ఎప్పుడికప్పుడు ప్రజలకు విడమరచి చెప్పకుండా రచయితలు, కవులు మౌనం పాటించడం వలన తెలంగాణ రాష్ట్ర ప్రజలకు పూడ్చలేని తీరని నష్టం జరిగింది. ఉద్యమ కాలంలోనూ రాష్ట్రము ఏర్పడిన తర్వాత ప్రజలకు పాలకులు చేస్తున్న అన్యాయాల గురించి చెప్పాల్సిన బాధ్యతగా తలంచి నేను బహిరంగ లేఖలను సామాజిక, రాజకీయ వ్యాసాలను రాశాను. ఇప్పటికి రాస్తూఉన్నాను. 2012 సంవత్సరంలోనే ఆంధ్రజ్యోతి దినపత్రిక సంపాదకీయం పేజీలో గులాబీ కండువాల పేరున తెలంగాణలో 1948 పునరావృత్తం కాబోతుంది అని ఒక వ్యాసంతో హెచ్చరించాను. అదే తరహాలో తెలంగాణ వచ్చిన తర్వాత భూస్వామ్య వర్గాలు అధికారంలోకి వచ్చి అనేక పథకాల ద్వారా అదే పని చేశారు. ఇది మన కళ్ళ ముందు జరిగిన తెలంగాణ రాష్ట్ర చరిత్ర.

**6. ఉద్యోగ జీవితాన్నీ, సాహిత్య జీవితాన్ని ఎలా బ్యాలెన్స్ చేశారు?**

నాది అంతా వానాకాలం చదువు. జీవితంలో అనేక డక్కాముక్కీలు తిని ఇంటర్మీడియట్ పూర్తి చేశాను. ఇంతకుముందే సాహిత్య పరిచయం ఉన్న జక్కని వెంకట రాజం సార్ సాహిత్య జీవితానికే కాకుండా నేను సభలకు వెళ్లడానికి కూడా ఆర్థిక సాయం చేసేవారు. నేను వరంగల్ లో జామియా ఇస్లామియా కాలేజీలో జరుగుతున్న విరసం సాహిత్య పాఠశాల సభకు పోవడానికి సిద్ధమయ్యాను. పోయే ముందు సార్ ను కలిశాను. సభకు వెళ్లడానికి కొంతడబ్బు ఇచ్చి తాను అప్పటికే పనిచేస్తున్న సహకార విద్యుత్ సరఫరా సంఘంలో ఉద్యోగాలు పడుతున్నాయని నువ్వు రాగానే కలవమని చెప్పాడు. సార్ చేయూతతో ఇంటర్వ్యూ పూర్తి చేసి సహకార విద్యుత్ సరఫరా సహకార సంఘం సెస్, (C.E.E.S)లో 12-2-1979 నాడు ఉద్యోగంలో చేరాను. అప్పటికే నేను సాహిత్యంలో ప్రవేశం కలిగి ఉండటంతో సహ ఉద్యోగులందరూ సమాదరించారు. జక్కని వెంకటరాజం సార్ చేసిన ఉద్యోగ స్థానాలన్నిటిలోనూ

నేను బదిలీ అవుతూ సమర్థవంతంగా పని చేశాను. ఒక వైపు ఉద్యోగం చేస్తూనే మరోవైపు సాహిత్య అభ్యసనం కొనసాగించాను. చదివిన పుస్తకాల ప్రభావంతో సాహిత్యంలో మరింత పదునుదేరాను. వివిధ సందర్భాలలో పత్రికలలో విస్తృతంగా కవిత్వం రాశాను. 2013 అంటే నేను పదవి విరమణ చేసే సమయానికి 12 కవితా సంకలనాలు ప్రచురింపచేశాను. రాష్ట్రవ్యాప్తంగా పేరు ప్రఖ్యాతులు ఉన్న అనేక అవార్డులను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో పొందాను. ఉద్యోగం ఎంత ముఖ్యమో సాహిత్యం అంతకన్నా రెట్టింపు ప్రాధాన్యత అని భావించి ప్రజల వైపు నుంచి నిలిచి కవిత్వాన్ని రాశాను. అటు కుటుంబ బాధ్యతలు ఇటు ఉద్యోగ కర్తవ్యం మరోవైపు అంతే బాధ్యతతో సాహిత్య వ్యాసాంగాన్ని సమన్వయం చేసుకుంటూ కొనసాగించాను.

**7. మీ ఇన్నేళ్ల సాహిత్య ప్రయాణంలో సాహిత్యంలో ఎలాంటి మార్పులను గమనించారు?**

నేను మూడు రకాల సామాజిక సందర్భాలను సాహిత్యకారునిగా దగ్గరగా గమనించాను. అవి ప్రాథమిక స్థాయిలో సమాజానికి అతీతమైన కవిత్వం రాసే కవులను చూశాను. అదే సందర్భంలో నా చుట్టూ జరుగుతున్న సామాజిక, రాజకీయ, ఆర్థిక ప్రజా పోరాటాలను సమీపం నుంచి చూసాను. ఆయా కాలాలలో కవిగా ప్రతిస్పందించాను. రెండవ సందర్భంలో ప్రజాపోరాటాలపై రాజ్యం ఉక్కు పాదాలతో అణచివేస్తూ అనేక పన్నాగాలతో దొరికిన వారిని నిలువునా ఎన్కౌంటర్ చేసిన సంధి కాలాన్ని గమనించాను. కొన్నిసార్లు నిజనిర్ధారణ కమిటీలో మరియు వ్యక్తిగతంగా పోయి ఆయా బాధిత గ్రామాల ప్రజలను దర్శించాను. ఆగ్రహంతో ఆవేదనతో కవిత్వమై ఉవ్వెత్తున లేచాను. ప్రశ్నించాను.

ఇక మూడో సందర్భం మారిపోయిన సరళీకరణ, ప్రైవేటీకరణ, గ్లోబలైజేషన్ పరిష్వంగములో దేశంలో కార్మికులు, రైతులు, చేతివృత్తుల కునారిల్లిపోయాయి. దేశం చేతికి అంది వచ్చిన అనేకమంది యువకులు ఈ అత్యాధునిక కాలంలో ఆత్మహత్యల దిశగా చివరి ప్రయాణం చేశారు. వ్యక్తులు, సమాజం ముందెప్పుడు లేనంత విధ్వంసానికి లోనయ్యాయి. వృద్ధాశ్రమాలు, అనాథ పిల్లల ఆశ్రమాలు దేశమంతా వెల్లివిరిసాయి. సమాజం రోజుకింత అంగవైకల్యాన్ని పొందుతున్నది. పిల్లలు చదువుల పోటీలో నలిగిపోయి ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. మీ ఇంటికి వస్తే ఏమిస్తావ్ మా ఇంటికి వస్తే ఏమి తెస్తావు లాంటి క్విడ్ ప్రోకో విధానం రాజకీయ రంగంలో మూడు పువ్వులు ఆరు కాయలుగా అభివృద్ధి చెందుతున్నాయి. కార్పొరేట్ల నుండి చందాల రూపంలో వసూళ్లు రాబట్టుకున్న రాజకీయ పార్టీలు ఎన్నికల ద్వారా ప్రభుత్వంలోకి వస్తున్నాయి. వీరు శాసనసభల్లో చేసే చట్టాలు కార్పొరేట్లకు అనుకూలంగా కార్మిక వర్గాలకు వ్యతిరేకంగా ఉంటున్నాయి. మాట్లాడే మాటలకు, ఆచరణలకు పొంతన లేకుండా పోతున్నాయి. అందుకే స్వాతంత్రం వచ్చి 75 ఏళ్లకే దేశమంతా బీద ప్రజలు పట్టణాలలో, లేబర్ అడ్డాలలో కార్మికులుగా గ్రామాల నుంచి సద్దులు కట్టుకొని వచ్చి పనిని వెతుక్కొంటున్నారు. పని కోసం ఎదురు చూస్తున్నారు. దేశం అంతా హృదయవిధారకమైన వర్తమాన భవిష్యత్తు చిత్రపటం కనిపిస్తున్నది. ఈ మూడు విధాల పరిణామాలలో అడుగడుగునా నేను కవిత్వం రాశాను. అందులో భాగంగానే సమాజం కోల్పోతున్న విలువల పట్ల అస్తిత్వంతో సంవేదనతో 1993 సంవత్సరంలో "పాతాళ గరిగె" అనే కవితా సంకలనం తీసుకువచ్చాను. గ్రామాల విధ్వంస దృశ్యాన్ని దగ్గరగా చూసిన నేను 1996లో "ఇండియా ప్రైవేట్ లిమిటెడ్" అనే కవితా సంకలనాన్ని తీసుకువచ్చాను.

**8. మీ దృష్టిలో మంచి కవిత్వానికి ఉండవలసిన లక్షణాలు ఏమిటి?**

నేడు ఒక స్థిరత్వం లేని సేవల రంగం వేగంగా విస్తరిస్తున్న సందర్భంలో అస్థిర యువతరం ఉద్యోగం చేస్తున్నది. ఎవరికి వారు ఒక ఒంటరి ద్వీపకల్పం అయిపోయి కురచయి పోతున్నారు. ఫేస్బుక్లో, వాట్సాప్లో, బ్లాగుల్లో, ఇంస్టాగ్రామ్లో యువ సృజనకారులు సెల్ఫ్ ప్రమోషన్ చేసుకుంటున్నారు. ఒక పది లైకులు ఒక అయిదు షేర్లు రావడంతో ఒక్కరోజే కవిగా మారిపోతున్నాడు. వీరి పట్ల ద్వేష భావం లేషమైన లేదు. కవితకు ఒక్క చెమక్ వుంటే సరిపోదు. దానికి కన్నీటి చెమ్మ తగిలినప్పుడే మంచి కవితగా రూపెత్తుతుంది. ముఖ్యంగా సృజన కారులు అధ్యయనం చేయాలి. సాంఘిక, సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో వచ్చిన పుస్తకాలను ఎప్పటికప్పుడు చదువుకుంటూ అప్డేట్ కావాలి. చుట్టూ ఉన్న మనుషులను సమాజాన్ని తనదైన దృక్పథం, దృష్టికోణంతో చదవాలి. ఇది ఒక్క రోజుతో జరిగే పని కాదు. తాత్విక గ్రంథాలను చదవాలి. అప్పుడే సృజనకారుడికి ఒక లోచూపు ఏర్పడుతుంది. ప్రతి కవి భారతీయ సమాజాన్ని అర్థం చేసుకోవడానికి పూలే గులాం గిరి, అంబేద్కర్ అంటరానితనం జీవిత చరిత్ర ఏంగిల్స్, మార్క్స్ కమ్యూనిస్టు మేనిఫెస్టో విధిగా చదవాలి. అధ్యయన లేమి కారణంగా వ్యక్తి వాదం వేల రెక్కలతో విస్తరిస్తున్న వాతావరణంలో వర్తమాన సాహిత్యంలో మరొకసారి అనుభూతి వాద కవిత్వం తెర మీదికి వస్తున్నది. మార్క్స్ చెప్పిన మాటలను ఉటంకిస్తాను." మానవుల ఉనికిని సామాజిక చైతన్యం నిర్ణయించదు. దానికి భిన్నంగా

సామాజిక చైతన్యమే మానవుని ఉనికిని నిర్ణయిస్తుంది". అంతేకాకుండా మన తెలుగు ప్రముఖ విమర్శకులు రాచమల్లు రామచంద్రారెడ్డి మంచి కవి లక్షణం గురించి చెప్పిన మాటలతో ఈ జవాబు ముగించదలిచాను

"శిల్ప గతమైన శక్తులు ఎన్ని ఉన్నా కవికి ఒక వ్యక్తిత్వాన్ని తెచ్చేవి అతని అభిప్రాయాలు, విశ్వాసాలే".

**9. ఒక ప్రాంతం అస్తిత్వాన్ని తెలపడంలో భాష యొక్క పాత్ర ఏమిటి?**

సంస్కృతిలో ప్రధానమైనవి ఆ ప్రదేశంలో మాట్లాడే ప్రజల భాష, వారి ఆచార వ్యవహారాలు. ఇవి ఆ ప్రాంత అస్తిత్వాన్ని తెలియజేస్తాయి. ఇందులో భాష ప్రాధాన్యతాక్రమంలో ప్రముఖ పాత్ర పోషిస్తుంది. గోర్కి తన "ప్రజలు సంస్కృతి" అనే గ్రంథంలో భాష ప్రాముఖ్యత గురించి ఇంకా స్పష్టంగా, లోతుగా విశ్లేషించాడు. ఇటీవల జరిగిన ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమం ప్రాథమిక స్థాయిలో ప్రజలలో భాషా ప్రధానంగా ఉద్యమ స్ఫూర్తి వాతావరణాన్ని కలిగించినది. ఈ విషయంలో నాలాంటి కొందరు కవులు ఆధిపత్య ప్రాంతం యొక్క భాష మా మీద అధికారాన్ని చలాయించకూడదని వ్యాసాల ద్వారా, కవిత్వం ద్వారా పిడికిలి ఎత్తి ధిక్కరించాము. భాష మీద ఆధిపత్యం చెలాయిస్తే ప్రాంతం మీద, ప్రజల మీద అధికారాన్ని చెలాయించవచ్చునని బ్రిటిష్ కాలానికి ముందే సంస్కృతం, హిందీ భాషలు ప్రాంతీయ భాషల మీద అధికారం పొందాలని కుట్రపూరితంగా వ్యవహరించాయి. ఇక బ్రిటిష్ కాలంలో ఇంగ్లీష్ భాషను మన ప్రజల మీద, రాతకోతల వ్యవహారాల మీద రుద్ది అవిచ్చిన్నంగా దేశాన్ని ఏలారు. ఆయా ప్రాంతాలలో ప్రజలు మాట్లాడుకునే భాష మీద అస్తిత్వం మిక్కిలి ఆధారపడి ఉంటుంది. ఇది తెలంగాణ ఉద్యమంలోనే కాకుండా ప్రపంచంలోని అనేక ప్రాంతాలలో జరిగిన, జరుగుతున్న అస్తిత్వ ఉద్యమాలలో భాష ప్రాముఖ్యతను రుజువులు, ఉదాహరణలతో సహా తెలియజేస్తూనే వున్నది.

**10. ప్రాంతానికి సాహిత్యానికి మధ్య ఉన్న సంబంధాలను ఎలా చూస్తారు?**

ప్రాంతానికి, సాహిత్యానికి, ప్రజలకు ఉన్న సంబంధ బాంధవ్యాలు విడదీయడానికి వీలు లేనివి. ప్రధానంగా భావ వ్యక్తీకరణకు భాష ప్రధాన వాహకం. ఇంకా ఆ ప్రాంతం ప్రజలు మాట్లాడుకునే భాషతో సృజన కారులు మమేకమై తమ రచనలను కొనసాగిస్తే అద్భుతాలను సృష్టించవచ్చును. గ్లోబలైజేషన్ కాలంలో ప్రాంతం, సాహిత్యము కలగలిసి ప్రపంచీకరణకు బలమైన విరుగుడుగా వ్యవహరిస్తున్నది. ఇవ్వాళ ప్రపంచములోని అగ్రదేశాలు తమ ఇష్టం ఉన్నా, లేకున్నా ప్రాంతీయ భాషలను గుర్తించాల్సిన అవసరం ఏర్పడుతున్నది. గుర్తిస్తున్నది కూడా. ప్రాంతీయ భాషా సాహిత్యాల మధ్య ఆదానప్రధానాలు మరింత చురుకుగా అన్ని స్థాయిలలో జరగాల్సిన బాధ్యత ఉన్నది.

**11. సమకాలీన సందర్భంలో సాహిత్యం రాయడానికి ప్రధాన వస్తువుగా దేన్ని స్వీకరించాలి?**

ఇది వాళ్ళ వాళ్ళ పరిధిలో ఆయా కవులకు సంబంధించిన అంశం. కవి సాంఘిక శాస్త్రాలతో పాటు తన పూర్వీకుల కవిత్వాన్ని అధ్యయనం చేయాల్సిన అవసరం ఉన్నది. అప్పుడే తనదంటూ వస్తువు ఎన్నిక, ఎత్తుగడ, కొనసాగింపు, ముగింపుల మీద ఒక సాధికారికత ఏర్పడుతుంది. ఏ కవైనా తను దుఃఖపర్యంతమవుతూ రాసిన కవిత ఇతరులను తప్పకుండా కదిలిస్తుంది. చాలామంది కవులు తను రాయాల్సిన విషయంను వాయిదా వేయడం గానీ, ఆ ఎజెండా నుండి తప్పుకోవడం గాని జరుగుతుంది. ఈ సాచివేత ధోరణి అధిగమిస్తే కవిత్వం నడక చిక్కబడుతుంది.

**12. సాహిత్యం పై ప్రపంచీకరణ ప్రభావాన్ని ఏ విధంగా చూస్తారు?**

వేగవంతమైన సమాజంలో సాహిత్యం మానవ నైజం యొక్క బహుముఖాల వ్యక్తీకరణ. కావున ఆయా కాలాలలో సమాజం యొక్క గమనాగమనాలు సాహిత్యంపై తప్పనిసరిగా ప్రభావం చూపుతాయి. అలాగే రాజరికాలు, భూస్వామ్య కాలాలు అంతరించిపోయాయి. ప్రపంచవ్యాప్తంగా ఇప్పుడు సరళీకరణ, ప్రైవేటీకరణ, గ్లోబలైజేషన్ పేరున సామ్రాజ్యవాద దేశాలు మిగతా దేశాల సంపదను కబళించాలనే ప్రయత్నాలను తీవ్రతరం చేస్తున్నాయి. అప్పును అందమైన పేరుతో ఆర్థిక సహాయంగా నమ్మబలక చూస్తున్నవి. సమాజం మీద, వ్యక్తుల మీద, దేశాల మీద ప్రపంచీకరణ ప్రభావం పడి యావత్ మానవాళి అతలాకుతలము అయిపోతున్నది. ఇప్పుడు సాహిత్యము కొందరికే దైవదత్తము కాదని తేలిపోయింది. ప్రపంచీకరణ ప్రభావాలు సాహిత్యంపైన తీవ్రంగానే పడింది. అభివృద్ధి పేరున ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వలన సమాజంలో అంతరాలు తారతమ్యాలు పెరిగిపోతున్నాయి. నేడు అన్ని వర్గాలలో ముఖ్యంగా రైతులు, కార్మికులు, విద్యార్థులలో, మహిళల్లో వలసలు, ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయి. ప్రశ్నించని వైపు మనిషి పలాయన ప్రయాణం చేస్తున్నాడు. అందుకే ముందు ఎప్పుడూ లేనంత దేవాలయాల మీద ఒత్తిడి పెరుగుతుంది. ప్రపంచీకరణను ఏ కొంచమైనా అటకాయించేది, నిలువరించేది ముమ్మాటికి ప్రాంతీయ సాహిత్యమే. నేను నా సాహిత్యంలో గ్లోబలైజేషన్ ప్రభావాన్ని తెలుగు కవులందరికన్నా ముందుగా

పసికట్టి ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, వాస్కోడిగామా డాట్ కామ్ వంటి కవితా సంకలనాలను ప్రచురించాను. విధ్వంసం అవుతున్న జీవితాన్ని కవిత్వంలో వ్యక్తీకరించాను.

**13. కల్లోల సందర్భం ప్రేరేపిస్తే కవులుగా మారిన మీరు ప్రస్తుత సాహిత్య వాతావరణం పట్ల ఎలాంటి అభిప్రాయంతో ఉన్నారు?**

కల్లోల సందర్భం వచ్చే నాటికే అంటే దేశంలో అత్యవసర పరిస్థితి తర్వాత నేను స్పష్టమైన ప్రజా దృక్పథంతో కవిత్వం రాస్తూ ఉన్నాను. అయితే సిరిసిల్ల, జగిత్యాల తాలూకాలను ప్రభుత్వం కల్లోల ప్రాంతాలుగా ప్రకటించిన సమయంలో నేను కలవరపడి అణచివేతకు కంటతడి పెట్టి మరింత పదునైన కవిత్వాన్ని రాశాను. అప్పటి సాహిత్యకారులకు అనేక కనబడని కట్టుడులను ఎవరికి వారే స్వచ్ఛందంగా విధించుకొని రాయాల్సిన వాతావరణం ఉండేది. అనేకమంది అజ్ఞాత కవులు, రచయితలు ఆ కాలంలో పురుడు పోసుకున్నారు. అందరూ అజ్ఞాతంలోకి వెళ్లి కూడా పని చేశారు. ఇందులో సాహు పేరుతో రాసిన శనిగరం వెంకటేశ్వర్లు ప్రధానమైన వారు. ఆదివాసీల భాష నేర్చుకొని పొరుకల సారుగా వారి మధ్య తిరిగి కొమురం భీం వస్తువుకు సంబంధించిన చారిత్రక ఆధారాలను సేకరించి ప్రముఖ రచయిత అయిన అల్లం రాజయ్యతో కలిసి నవలగా రాశాడు. అనంతరం వారు అరెస్టై వరంగల్ జైల్లో శిక్ష అనుభవించి బహుజన వాదిగా సమాంతర కాలంలో ఎందరికో స్ఫూర్తిగా నిలిచాడు.

**14. ఆధిపత్యాలను ప్రశ్నించడమే నా కవిత్వం అని చెప్పుకున్నారు కదా ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నారు?**

కులం, వర్గం, మతం, జెండర్, అణచివేత, భాష, ప్రాంతం తదితర స్థాయిలలో ఉన్న సమస్త ఆధిపత్యాలను ప్రశ్నించడమే నా కవిత్వం. ఆదే నా కవితా వ్యాసంగ అర్థం, పరమార్థం, తాత్పర్యం కూడా. అందుకోసం చేసిన ప్రయాణంలో అనేక ఇబ్బందులు ఎదురయ్యాయి. అయినా నేను జంకక, లొంగిపోక నాదైన గొంతుక వినిపిస్తూ, నాదైన ముద్రతో కవిత్వం రాసుకుంటూ వస్తున్నాను . నేను 1980 ప్రాంతంలో ఆంధ్ర విజయవాడలోని వార పత్రికలకు కవిత్వం పంపిస్తున్నప్పుడు వారికి అర్థం కాని తెలంగాణ పదాల కింద పచ్చ ఇంకుతో అండర్ లైన్ చేసి తిరిగి పంపేవారు. నేను నెల రోజుల తర్వాత మళ్లీ అదే కవిత్వాన్ని ఉన్నది ఉన్నట్టుగానే ఉంచి పంపించేవాడిని. ఆయా పత్రికల సంపాదకులు అట్టి కవితలు ప్రచురించేవారు. నేనే కాకుండా నాలాంటి ఒకరిద్దరు కవులు మెల్లమెల్లగా మన తెలంగాణ భాషను పత్రికల్లోకి తీసుకురావడానికి పాటుపడ్డాం. వాళ్ళకు తెలంగాణ ప్రజల భాషలో కవిత్వాన్ని రాసి పంపినా వేయాల్సిన ఒక అనివార్య పరిస్థితిని కల్పించగలిగాము. తెలంగాణ ఉద్యమం ప్రారంభంలో భాషాపరమైన ఉద్యమం జనసామాన్యంలోకి చొచ్చుకుపోయింది అని చెప్పాలి. అనంతరం తెలంగాణ ఉద్యమంలో ప్రాంతానికి జరిగిన అన్యాయాలు, అక్రమాలపై ఉద్యమంగా వెల్లువెత్తినది. అప్పటికీ, ఇప్పటికీ అన్ని రకాల ఆధిపత్యాలను ఎదిరించడమే నా కవిత్వం లక్ష్యంగా చేసుకొని రాస్తున్నాను.

**15. బహుజన వాదం బలంగా ముందుకు వస్తున్నట్లుంది బీసీ కవుల భాగస్వామ్యం ఎలా ఉండాలంటారు?**

వెయ్యి ఏళ్ల పైబడిన తెలుగు సాహిత్యంలో ఎప్పుడు లేనంతగా ఇప్పుడు అన్ని కులాల నుంచి, అన్ని వర్గాల నుంచి తమ అస్తిత్వాలను సృజనకారులు తమ తమ సాహిత్య ప్రక్రియల ద్వారా వ్యక్తీకరిస్తున్నారు. ఏ ఆధిపత్య కులాలు ఒప్పుకున్నా, ఒప్పుకోకపోయినా వారి కోసం ఎదురు చూడకుండా బహుజన సాహిత్యం తెలుగు సాహిత్య యవనికపై ఇంద్రధనస్సులా దృగ్గోచరమవుతున్నది. ముమ్మాటికి తెలుగు సాహిత్యంలో ఇది బహుజన సాహిత్యకారుల శకమని ఘంటాపదంగా, ఒకింత గర్వంగా చెప్పగలను కూడా. అయితే బహుజన కవులు తాత్కాలిక ప్రయోజనాల కోసం అగ్రవర్ణాల పీఠాధిపతుల మెప్పు కోసం ఎదురు చూడకూడదని వారే స్వయంగా బహుజన సాహిత్యాన్ని ఒప్పుకొని తీరాల్సిన సందర్భం అనతి కాలంలోనే వస్తుందని నా నిశ్చితాభిప్రాయం. ఆధిపత్య వర్గాల చాప కింది నీరు లాంటి కుట్రలకు గురికాకుండా సమీకరణలకు, జమలకు, తీసివేతలకు, భాగాహారాలకు, భాగాఫలాలకు లోను కాకుండా బహుజన సాహిత్యాన్ని అందరం కలిసి నిటారుగా నిలబెట్టుకోగలగాలి. త్వరలో తెలుగు సాహిత్యంలో తప్పించుకు పోతున్న దొంగ చేపలు శక్తివంతమైన బహుజన సాహిత్య గాలానికి చిక్కబోతున్నాయి. మన వాటా మనకు దక్కబోతున్నది.

**16. మీ రచనలలో మానవ జీవన విధ్వంసాన్ని చిత్రీకరించడానికి మిమ్మల్ని వెంటాడిన అంశాలు ఏమిటి?**

తెలుగు కవిత్వం గర్వించదగిన కవి నగ్నముని అన్నట్లు "ఎక్కడ ప్రమాదం జరిగితే అక్కడికి కవులు ప్రయాణం చేయాలి". అది నిజం కూడా. ఆయా ప్రదేశాలకు కొన్నిసార్లు ఒంటరిగా, మరికొన్నిసార్లు సమూహంగా పర్యటించిన సందర్భాలు మా సాహిత్య ప్రయాణంలో మీకు తారసపడుతాయి. 1993లో మహారాష్ట్రలోని లాతూర్ ప్రాంతంలో జరిగిన భూకంప

సంఘటన జరిగిన తెల్లారి నేను మిత్రుడు నలిమెల భాస్కర్, యెన్నం సత్యం, జర్నలిస్టులు తవుటు నాగభూషణం,కరుణాల భద్రాచలం కలిసి కారు కిరాయికి తీసుకొని హృదయ విదారకమైన భూకంపం చేసిన బీభత్సాన్ని ప్రత్యక్షంగా చూడడానికి లాతూర్ జిల్లాకు వెళ్ళాము. జిల్లాలోని అన్ని లాడ్జీలు నిండిపోవడంతో గంటకు ఇంత కిరాయి అనే లాడ్జిలో తిరిగి తిరిగి అతి కష్టం మీద దిగి మర్నాడు ఆ ప్రాంతం గ్రామాలను సందర్శించాము. బాధిత గ్రామాల ముందు నల్లబోర్డుపై చాక్ పీస్ తో మరణించిన వారి వివరాలను రాసి పెట్టారు. మరాఠీ వచ్చిన నాగభూషణం, భాస్కర్లతో చదివించుకుని భూకంపం చేసిన గాయాలను ప్రత్యక్షంగా చూసాము. విన్నాము. అనంతరం సిరిసిల్లకు వచ్చి నేను లాతూర్ భూకంపం పైన "ఓ ఐదు ఎపిసోడ్స్ "అనే దీర్ఘ కవితను రాశాను. ఆ తరువాత నేను తెలంగాణ రచయితల వేదిక అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత 2009లో మిడ్ మానేరు ప్రాజెక్టు కట్టపైన ముంపు గ్రామాల ప్రజలతో కవుల కలబోత సమావేశాన్ని ఏర్పాటు చేసాము. నేను ఒంటరిగా 14 ముంపు గ్రామాలను సందర్శించాను. వాళ్ళ గ్రామం నుంచి పోతున్నప్పుడు దుఃఖించిన, కలబోసుకున్న జ్ఞాపకాలకు కలత చెంది అనేక కవితలు రాశాను. ఇవే కాకుండా నేను సిరిసిల్ల బస్టాండ్ లో బొంబాయి బస్సు చుట్టూ మూగిన దుఃఖాలను వలస పోతున్న వారి వెతలను ప్రత్యక్షంగా చూసి పరిశీలించి వారిలో ఒకరిగా కలవరించి నా అస్తిత్వం నుండి" వలస" లాంటి కథలను రాశాను. వారి కన్నీళ్లను నా కన్నీళ్ల సిరాగా చేసుకొని కవితలను అల్లుకున్నాను. ఒకటి రెండు సంఘటనలు అని కాదు కానీ ఒక విధంగా నా సాహిత్యమంతా మానవ విధ్వంస రచనగానే కొనసాగింది. కొనసాగుతుంది.

**17. మీ సాహిత్యానికి దాశరథి సాహిత్య పురస్కారం మొదలు అనేక పురస్కారాలు వచ్చాయి. ఆయా సందర్భాలలో ఎలాంటి అనుభూతి పొందారు?**

తెలుగు కవిత్వంలో పేరు ప్రఖ్యాతులు గల అవార్డులు ఎన్నో నాకు వచ్చాయి. వచ్చిన ప్రతి సందర్భంని నా ప్రజల పట్ల నా బాధ్యతను మరింత పెంచిందని భావించుకున్నాను. ముఖ్యంగా తెలంగాణ ఏర్పడిన సర్కారీ నియంతృత్వ నీడన మగ్గిన కవుల కాలంలో కాకుండా, ప్రస్తుతం ఏర్పడిన ప్రభుత్వం స్వేచ్ఛాయుత వాతావరణంలో దాశరథి అవార్డు రావడం నాపైన మరింత బరువు బాధ్యతలను పెంచింది అనుకుంటాను. ఈ స్వేచ్ఛగాలులను ప్రజలు పీల్చుకుంటున్న సందర్భంలో ఈ అవార్డు రావడం ఒక విధంగా సంతోషాన్ని ఇచ్చింది. కానీ ఇదే ఏకకాలంలో నా మీద రెట్టింపు బాధ్యతను పెట్టిందని భావిస్తున్నాను.

**18. నాలుగు దశాబ్దాల సాహిత్య ప్రయాణం పట్ల సంతృప్తిగా ఉన్నారా?**

ఏ కవికైనా నాలుగు దశాబ్దాల సాహిత్య ప్రయాణం సంతృప్తి ఇచ్చింది అంటే ఆ కవి నా దృష్టిలో మరణించినట్టే లెక్క. ఏ కవికైనా ఎంత సృజన నీళ్లు తాగినా అది ఒక తీరని దూపగా మిగిలిపోతూనేవుంటుంది. అది సామాన్య ప్రజల పట్ల బాధ్యతగా రాసే నాలాటి బహుజన కవులకు, సాహిత్యకారులకు భౌతికంగా మరణించే వరకు రాత పూతల పని ఉంటూనే ఉంటుంది. నా వంతుగా నాదైన కంఠ ధ్వనిని తెల్లారే గట్ల బాలసంతుల మోగించే ఇనుప బొనిగెలా వినిపిస్తూనే ఉంటాను.

**19. మీ సాహిత్య ప్రయాణంలో మీ కుటుంబ సభ్యుల మద్దతు ఎలా ఉంది?**

ఎక్కువ శాతం సాహిత్య కారుల కుటుంబాలలో వారి కుటుంబ సభ్యులు ఆయా రచయితలతో ఏకీభవించకున్నా, వ్యతిరేకించకుండా వారి మానాన వారిని వదిలిపెడితే చాలు. ఇంకా బహుజన సమాజం నుంచి ఎదిగి వచ్చిన సృజనకారులపైన కుటుంబ బాధ్యత, సామాజిక బాధ్యతలతో పాటు గురుతరమైన సాహిత్య బాధ్యత కూడా ఎక్కువగా ఉంటుంది. అందుకు నా కుటుంబం ఏమి మినహాయింపు కాదు. అందుకే నేను ఒక కవితలో ప్రతిరోజు మూడో ప్రపంచ యుద్ధం మన ముని వాకిట్లో జరుగుతుందన్నాను. ఇల్లు అనే దానిలో కుటుంబం సభ్యుల దారులు పలు రకాలుగా చీలిపోతుంది. అయినా కలిసి మెలిసి ఉన్నట్టు పైకి ఎంతో మర్యాదగా కనిపిస్తుంటారు. అంతర్గతంగా ఎవరి స్వేచ్ఛ వారికి ఉంటుంది. నిర్మొహ మాటంగా చెప్పాలంటే కుటుంబ సభ్యుల మద్దతు అంటూ ఉంటే అవార్డు వచ్చినప్పుడల్లా పత్రికల్లో చదువుకొని సంతోష పడుతుంటారు. మొత్తానికి లేరని కాదు కానీ సాహిత్యకారుల అభిప్రాయాలతో, ఆదర్శాలతో, లక్ష్యాలతో ఏకీభవించే కుటుంబ సభ్యులు తక్కువగా కనిపిస్తుంటారు.

ఇకపోతే ప్రతి ఇంటర్వ్యూ అనంతరం నన్ను నేను పారతో మర్లేసుకొని ముద్దగా జిగుట వచ్చేవరకు కాళ్లతో తొక్కుకొని ఓ సరికొత్త మృత్తిక ఆకృతి తీసుకుంటాను.

-ఇంటర్వ్యూయర్

అసిస్టెంట్ ప్రొఫెసర్, MJPBCWRDC, జయశంకర్ భూపాలపల్లి, తెలంగాణ

సాహిత్య పరిశోధన

# పతి-చితి: పేరంటాళ్ల గాథల్లో సతీసహగమనం

కొల్లాపురం విమల

జనపదమనగా పల్లెటూరు. జనపదములయందుండు వారు జానపదులు. వారు పాడుకొనెడు పాటలు లేదా గేయములు జానపదగేయములు' అనే నిర్వచనాలతో బిరుదురాజు రామరాజుగారి 'తెలుగు జానపదగేయ సాహిత్యము' అనే సిద్ధాంత గ్రంథం మొదలవుతుంది. 700 పేజీలున్న ఈ బృహత్ గ్రంథాన్ని నా విశ్లేషణకు ఎంచుకున్నాను. అందుకు పరిశోధనా విశ్లేషణలపట్ల నాకున్న ప్రత్యేక ఆసక్తి మొదటి కారణమైతే, 1958ల నాటికే ఉస్మానియా యూనివర్సిటీ 'తెలుగు' శాఖ నుంచి వెలువడిన తొలి పరిశోధనగా రామరాజుగారి సిద్ధాంతగ్రంథం ఏ పాటలను రికార్డు చేసింది? తను సేకరించిన ఆ పాటల్లో 'జానపదుల ప్రాపంచిక దృక్పథాన్ని ఎలా విశ్లేషించారు? తొలితరంనాటి ఆధునిక విద్యావంతునిగా ఆయన ఆయా పాటల్లోని భావజాలధారను ఎలా అర్థం చేసుకున్నారు? అనే కుతూహలంలోంచే నేనీ పరిశోధనా గ్రంథాన్ని ఆద్యంతం చదివాను. పాటల సేకరణకై రామరాజుగారు చేసిన విస్తృత క్షేత్రపర్యటనలు పరిశోధకునిగా ఆయన చిత్తశుద్ధిని స్పష్టంగా చూపిస్తాయి. క్షేత్రపర్యటనల్లో తనని (విద్యాధికుడైన పరిశోధకుణ్ణిగా) చూసి బిగుసుకుపోయిన పల్లె కళాకారులను ఊరిపెద్దల సాయం తీసుకొని బెదిరించో, బుజ్జగించో పాటలను రాబట్టుకున్న సందర్భాలను దాచిపెట్టకోకుండా ప్రస్తావించడమే గాకుండా అందుకు తాను బాధపడుతున్నానని చెప్పుకోవడంలో ఆయన సరళస్వభావం కన్పిస్తుంది. అట్లా అప్పుడప్పుడే ఆధునికులైన విద్యావంతులను చూసి కాలేజీ చదువులు తెలియని 'జానపదులు' ముడుచుకోవడం గురించి ఈ ప్రస్తావన మన దృష్టికి తెస్తుంది. అంతేకాదు, సంప్రదాయిక 'వర్ణాశ్రమ' ధర్మాలకి కొనసాగింపుగా కులాలుగా స్థిరపడిపోయిన సమాజ అంతరాల దొంతరలలో 'జానపదులు' అట్టడుగుస్థాయిలో ఉంటే ఊరి'పెద్దలు' సమాజ పిరమిడ్లో పైస్థాయిలో అధికారం ఉన్నవారుగా కన్పిస్తారు. అట్లే గ్రామీణజీవిత నేపథ్యం, సురవరంగారి సాంఘికచరిత్ర స్ఫూర్తి, అప్పటికే వలసవాదులు పాదులు వేసిన జానపద అధ్యయనాలు రామరాజుగారిని పండితులకి, పామరులకి మధ్య సంచరించేవైపు నడిపించినై అని అర్థమవుతుంది. ఈ నేపథ్యంలోంచి తరచి చూస్తే జానపదులంటే ఇప్పటి వలసాంతర అకడమిక్ పరిభాషలో అంచులకు తోసివేయబడిన 'సబాల్టర్న్' సమూహమని అర్థం చేసుకోవచ్చు. జానపద అధ్యయనాలు ఊపందుకున్నఆనాటి ఆధునిక సందర్భంలోనైతే జానపదులు అనగానే విద్యాధికులు (పండితులు) కానివాళ్లు అనే అర్థం స్థిరపడిపోయింది. అట్లా జానపదులను అసంపూర్ణ/అర్ధసామాజికులుగా (in-complete society) గుర్తించడం ఇప్పటికీ యూనివర్సిటీ తెలుగుశాఖ అధ్యయనాల్లో సర్వసాధారణం. మొత్తానికి జానపదం అనేది ఒక సామాజిక నిర్మాణమని గనుక అర్థం చేసుకుంటే అందులోనుంచి వ్యక్తమయ్యే సృజనాత్మక ఊహాకల్పనలను జానపద సాహిత్యంగా అర్థం చేసుకోవచ్చు. ఈ సాహిత్యంలో సంప్రదాయం, జానపదుల లౌకిక అనుభవజ్ఞానం రెండూ కలగలుపుగా సాగడం చూడొచ్చు. సంప్రదాయం అనేది భావజాల నిర్మితం. సంస్కృతి అనేక భావనల సమాహారమైనట్లే సంప్రదాయం అనేది తరం నుంచి తరానికి సంస్కృతి చేరవేసే భావజాలాన్ని కట్టుబాట్ల రూపంలో స్థిరపరిచేది. ఇంకా చెప్పాలంటే సామాజిక అమరికలో బలమైన ఆధిపత్య శక్తుల భావజాలం సంప్రదాయంగా స్థిరపడటాన్ని సామాజిక చరిత్ర అధ్యయనాల ద్వారా ఆనవాలు పట్టగలం. ఈ రకంగా చూస్తే జానపదపాటల్లో కావచ్చు, గాథల్లో కావచ్చు ఆధిపత్య భావజాలాన్ని మోసే విధేయులైన సగం సామాజికులుగా, అదే సమయంలో దాని బరువు కింద పెనుగులాడుతున్న మూగబోయిన గొంతుకలుగా జానపదులు కన్పిస్తారు. అట్లా చూసినప్పుడు జానపదపాటలను విశ్లేషించడమంటే ఆ పాటలకు చలనాన్నిచ్చే భావజాలధారను అర్థం చేసుకోవడం, దాని చారిత్రక మూలాలను పరామర్శించడం, లోగొంతులోనే అయినా జానపదులు చాటే నిరసనలనూ, విజయాలను, వైఫల్యాలను అర్థం చేసుకునే మేధో ప్రయాణమవుతుంది. కానీ దురదృష్టవశాత్తూ రామరాజుగారి కాలంనుంచీ ఇప్పటికి కూడా తెలుగుశాఖ జానపద అధ్యయనాల్లో జానపదసాహిత్యాన్ని ఐతే నాస్టాల్జియాతోనో లేదంటే సంస్కరించాలనే అత్యుత్సాహంతోనో విశ్లేషించడం గమనించవచ్చు. ఈ సందర్భాన్ని ఉద్దేశించే గ్రాంసీ అనే ఇరవయ్యవ శతాబ్దపు తత్వవేత్త Folklore must not be seen as something eccentric, strange or charming, but as something serious and important అని హెచ్చరిస్తాడు. అట్లా సబాల్టర్న్ గా తప్పించుకోలేని భావజాల వ్యూహంలో చిక్కుకున్నవారిగానే గాక దానికి ప్రతిగా జానపదుల పెనుగులాటను కావచ్చు, నిరసనలను కావచ్చు లేదా దానికి వత్తాసుగా లొంగిపోయి కుంగిపోవడాన్ని కావచ్చు ఆనవాలు పట్టడమే జానపదసాహిత్య అధ్యయనమవుతుంది. ఇందుకోసం జానపద పాటల్లోని వాక్యాలనే కాదు, వాక్యాల మధ్యా, పదాల మధ్యా ఉన్న నిశ్శబ్దాల్లోంచి జానపదుల గొంతులను వినగలగాలి.

ఆ ప్రయత్నంలో భాగంగా నేను రామరాజుగారి సిద్ధాంతగ్రంథంలోని 'కరుణరస గేయాలు' అనే ప్రకరణంలోని 'పేరంటాళ్ళ గాథ'లను (కామమ్మ కథ కేంద్రంగా) ఎంచుకున్నాను. ఈ గేయంలో స్త్రీ-పురుష జెండర్ పరికల్పనల వెనుకా, భర్త చనిపోయిన భార్యని మంటల్లోకి విసిరేసే 'సహగమన' సంఘటనల వెనుకా పనిచేసిన సాంస్కృతిక, చారిత్రక, రాజకీయ నేపథ్యాలను స్థూలంగా స్పృశించడమే నా వ్యాసపరిధిగా ఎంచుకున్న.

**'పేరంటాళ్ళ గాథలు' నేపథ్యం:**

'ఏకో రస కరుణ' అన్న భవభూతి పండితుని ప్రతిపాదనతో రామరాజుగారు కరుణరసగేయ ప్రకరణాన్ని మొదలు పెడతారు. సహృదయులైన కళాభిమానులకు కళ (సంగీతం, సాహిత్యం మొ.)ను ఆస్వాదించడానికి ఆలంబనైన నవరసాల గురించి కావ్యవిమర్శ సూచిస్తుంది. నిజమే కానీ, చారిత్రక గేయాలుగా పల్నాటియుద్ధం, బొబ్బిలియుద్ధం, కాటమరాజు కథ మొదలైన గాథలనుంచి 18వ శతాబ్దంలో స్త్రీలు (భార్యలు) ఎదుర్కొన్న దుర్భరపరిస్థితులను ఉన్నది ఉన్నట్లుగా నమోదు చేసిన పేరంటాళ్ళ (సతుల) సహగమన గాథలను చారిత్రక గేయాలుగా గాక రసం ఆధారంగా ఎందుకు విడదీయాల్సి వచ్చింది? రామరాజుగారు ఈ గాథలను చారిత్రక గేయాలుగా గుర్తించకపోవడానికి కారణమేంటి? అన్న ప్రశ్నలు రాకమానవు. అది తెలియాలంటే కరుణరసగేయాల ప్రకరణంలో ఆయన సంకలనం చేసిన పాటలు/గాథల గురించి తెలుసుకోవాలి. స్త్రీల దుర్భరజీవితాలనూ, వారి శరీరాలపై జరిగిన హింసనూ కళ్ళకు కట్టినట్టు చూపే దాదాపు 10కి పైగా గేయాలు ఈ ప్రకరణంలో వున్నై. హత్య చేసే భర్తలు (లక్ష్మమ్మ కథ), కరువులో ఆకలికి, అవమానానికి తాళలేక బిడ్డలను చంపుకున్న భార్యలూ (నల్లతంగాళ్ కథ), అభద్రతాభావంతో తోటి స్త్రీని హింసించే అత్తా, ఆడబిడ్డలూ (సన్యాసమ్మ కథ) ఈ పాటల్లో కన్పిస్తారు.

ఇవన్నీ ఒకెత్తయితే, భర్త చనిపోగానే బతికున్న భార్య ఆయనతోపాటు చితి లో పడి సాగుమానం (సహగమనం) చేసి మంటల్లో దగ్ధమయ్యే చిత్రహింసని గొప్ప త్యాగంగా కీర్తించే పేరంటాళ్ళ గాథలు మరొకెత్తుగా కన్పిస్తాయి. వ్యాసవిస్తృతిని దృష్టిలో పెట్టుకొని పేరంటాళ్ళ గాథల్లో తెలుగు ప్రాంతాల్లో నమోదైన సహగమన సంఘటనల సాంస్కృతిక, రాజకీయ చారిత్రక నేపథ్యాలను 'కామమ్మకథ' కేంద్రంగా పరిచయం చేయాలనుకుంటున్న.

చనిపోయిన భర్తతోపాటుగ చితిలో పడి భార్య మరణించడాన్ని సహగమనం అనేవారు. అలా మరణించిన స్త్రీ 'సతి'గా సమ్మానించబడేది. 'సతి' అనే పదానికి నిఘంటువుల్లో 'భార్య' అనే అర్థంతోపాటు 'నాశనం' అనే అర్థం కూడా కన్పిస్తుంది. అంటే సతి అనే పదం వ్యక్తి వాచకమే కాదు, మరణానికి-ముగింపుకి సంకేతం కూడా. ఉత్తర భారతదేశంలో ఈ సహగమన సంఘటనలు ఎక్కువగా జరిగినట్టు చరిత్ర నమోదు చేసింది. అంతెందుకు రాజా రామ్మోహన్ రాయ్, ఈశ్వరచంద్ర వంటి సంస్కర్తలు ఆ 'దురాచారాన్ని' రూపుమాపడానికి తమ జీవితాలను వెచ్చించారని చిన్నప్పుడు మనం సైతం పాఠ్యపుస్తకాల్లో చదువుకున్నాం. అలాగని దక్షిణ భారతంలో ఈ సంఘటనలు జరగలేదని కాదు. ఆధునిక పూర్వచరిత్రలో ఈ ప్రాంతాల్లో సతి సంఘటనలకు సాక్ష్యాలుగా 'వీరగల్లుల' వలెనే 'సతిగల్లులు' కన్పిస్తాయి. ప్రాచీన సాహిత్యంలో సైతం 'సతి' ప్రస్తావనలు అక్కడక్కడా నమోదైనై. 14 వ శతాబ్దంలో భారతదేశ పర్యటనకు వచ్చిన ఇబ్నుతూతా అనే ఆఫ్రికన్ పర్యాటకుడు తాను ప్రత్యక్షంగా చూసిన 'సహగమన' తంతును విపులంగా వివరించాడు. 'నూనీ-నికాలో దకాంటి' అనే యాత్రికుడు విజయనగరకాలంలో సతి సంఘటనలుండేవని ప్రస్తావించాడు. డి.డి. కోశాంబి ప్రకారం ఇంచుమించు 6వ శతాబ్దం నుంచి ఫ్యూడల్ రాజ్యాల వరకూ సతి సంఘటనలు కన్పించేవి. రంగనాథ రామాయణం, సిద్దేశ్వర చరిత్ర, ప్రతాపరుద్ర చరిత్రలో 'సతి' ప్రస్తావనలున్నై. అయితే బ్రిటిష్ వలసవాదం కాళ్ళూనుకుంటున్న సందర్భంలో 19వ శతాబ్దంలో ఉత్తర భారతదేశంలో ముఖ్యంగా బెంగాల్, బెనారస్ వంటి ప్రాంతాల్లో సహగమన సంఘనలు ఉధృతమైనై. అందుకు స్థానిక బ్రాహ్మణీయ పితృస్వామ్య భావజాలం ఎంతగా దోహదపడిందో వలసవాద ఆధిపత్య భావజాలం కూడా అంతే ఆజ్యం పోసింది. సరిగ్గా ఇలాంటి రాజకీయ చారిత్రక నేపథ్యంలో మద్రాసు ప్రెసిడెన్సీ కింద ఉన్న పల్నాడు చుట్టుపక్కల ప్రాంతాల్లో 'సతి' సాధారణ తంతుగా అన్ని కులాలకు పాకినట్లు రామరాజుగారు సంకలనం చేసిన 'పేరంటాల గాథ'లో రికార్డు చేసినై.

'సహగమనాన్ని' ఈ తెలుగు ప్రాంతాల్లో 'సాగుమానం' అని వ్యవహరించేవారని ఈ గాథల ద్వారా తెలుస్తుంది. అట్లా 'సాగుమానం' చేసిన స్త్రీలను 'పేరంటాళ్ళు' అనేవారు. ఇలాంటి పేరంటాళ్ళ కథలను ఉన్నది వున్నట్టుగా రికార్డు చేసిన ఈ గాథలను రామరాజుగారు 'రసం' ఆధారంగా గుర్తించడం వల్ల వాటిలోని చారిత్రకతను దాటవేసి కల్పితగాథలుగా చెప్పకుండానే చెప్పినట్లైంది. 'సహగమనం'లోని క్రూరత్వానికి కళ్ళు మూసుకోవడం, కరుణతో కన్నీరు కార్చడం లేదా మౌనప్రేక్షకులుగా మిగిలి పోవడమంటే త్యాగాన్ని స్త్రీల ధర్మంగా చిత్రించి స్త్రీల ఉనికిని రద్దు చేయడమే. ఈనాటికీ తల్లిదండ్రులూ, కుటుంబమూ, స్త్రీలా-పిల్లల ఆసక్తులను, ఆకాంక్షలను తమ (కుల) సమాజం మెప్పుకోసం క్రూరంగా బలిపెట్టడంలో చరిత్రలో తుడిచివేత (ఎరైజర్) కు గురైన సహగమన సంఘటనలు నాటి హింసా మూలాలు కన్పిస్తూనే ఉన్నై. అందుకు విరుగుడుగా సంప్రదాయంగా స్థిరపడిన భావనల మంచిచెడులను తరచి చూడాల్సి ఉంటుంది. సమాజాన్నీ, చరిత్రను 'జానపదుల' తలంలోంచి అర్థం

చేసుకోవాల్సి ఉంటుంది. చరిత్రలో కొత్త-పాతల సంధి కాలం నాటి ఆ చీకటి కోణాలను తవ్వి తీసి విమర్శకు పెట్టాల్సి ఉంటుంది. అందుకోసం జానపదుల్లో సగభాగమైన స్త్రీల జీవితాల్లోని సంఘర్షణ, నొప్పి, బాధ, అవమానాలను దృష్టికి తెచ్చే పేరంటాల గాథల వెనుక పనిచేసిన సాంస్కృతిక, రాజకీయ,ఆర్థిక ,చారిత్రకపరమైన అంశాలను తరచి చూడటం అవసరమవుతుంది.

అట్లా అత్యాధునిక కాలంలో సైతం కొనసాగుతున్న స్త్రీలపై హింసకి మూలాలను ఆనవాలు పట్టేందుకు ఉండే ఆకరాలను దృష్టికి తేవడం, మరీ ముఖ్యంగా ఈ పాటలనూ- స్త్రీల త్యాగాన్నీ గ్లోరిఫై చేసే విశ్లేషణలవల్ల కొనసాగుతున్న హింసను అడ్డుకోవడం లక్ష్యంగా కరుణ రస గేయాలు అన్న అధ్యాయం లోని 'కామమ్మ పాట' గురించి మాత్రం పరిచయం చేస్తాను.

**కామమ్మ కథ :**

కామమ్మ బెస్తకులంలో పుట్టిన బాలిక. కరువులో తల్లిదండ్రులు చనిపోతారు. పెత్తండ్రి రామయ్య ఆమెను పెంచి 7 సంవత్సరాలప్పుడు మేనత్త కొడుకు మారయ్యకిచ్చి పెళ్ళిచేస్తాడు. కామమ్మ పుట్టింట్లో ఉండగానే పెళ్ళయిన రెండు నెలలకు 'కొలువు' కోసం మారయ్య మొదట కాకినాడ వెళ్తాడు. కొన్ని నెలలు కొలువు చేసాక పొసగలేక తిరిగి వస్తాడు. మద్రాసుకి వలస వెళ్ళాలని నిర్ణయించుకుంటాడు. తల్లి 'మీ నాయన అక్కడకెళ్ళి తిరిగి రాలేదు. మద్రాసు మనకు అచ్చిరాదు. వద్ద'ని వారించినా మారయ్య మద్రాసుకి వెళ్ళి పెద్ద 'దొరల' దగ్గర పెద్దబోయిగా కొలువుకి చేరతాడు. కొంత పైకం జమచేసుకున్నాక ఇంటిపై మనసు మళ్ళీ 'తల్లికి బొమ్మంచు చీరా, భార్యకు అద్దాల రవికె, తమ్ముడికి పట్టంచు ధోతీ' కొని ఇంటికి ప్రయాణమవుతాడు. తిరిగివస్తున్న క్రమంలో జబ్బు పడతాడు. చివరి క్షణాల్లో భార్య కామమ్మని పుట్టింటి నుంచి పిలవనంపుకొని, కడసారి చూసి మరణిస్తాడు. అంతవరకు భర్త మొకమైనా ఎరుగని కామమ్మ "చిన్ననాడూ నన్ను పెండ్లాడినావూ మారయ్య- సన్నిడిచీ వెళ్ళేది న్యాయమా నీకూ మారయ్య- కంకణము గట్టిన ఘనుడెవ్వడెరుగా నేనైన- ఏడేండ్లకైనా ఇంటికొస్తివిగా మారయ్యా! నేను ఈడేరి ఐదేండ్లు ఇంటనున్నానూ యీ వరకు" అంటూ చనిపోయిన భర్తపై పడి వలపోస్తుంది. భర్త మొగమైనా అప్పటికి తేరిపార చూడని కామమ్మ మారెయ్య చనిపోగానే 'సాగుమానం' చేస్తానని ప్రకటిస్తుంది. 'బలిమి (బలవంతం)గా' కుటుంబసభ్యులను ఒప్పిస్తుంది. కానీ 'చెన్నపట్నం పెద్ద దొరల అనుమతి ఉంటేకానీ సాగుమానం చేయడానికి వీలుపడదని' కామమ్మ మరిది 'చట్టం' అనుమతి తీసుకోవాలని గుర్తుచేస్తాడు. మరిది మాటలకు కామమ్మ తన నిర్ణయాన్ని మార్చుకోనని ప్రకటించి , నేరుగా సామర్లకోట కెప్టెన్ దగ్గరకి అనుమతి కోసం వెళ్తుంది. అక్కడ దొరసాని కామమ్మని 'సాగుమానం' విరమించుకొమ్మని, మడిమాన్యాలిస్తానని నచ్చచెప్పే ప్రయత్నం చేస్తుంది. దానికి కామమ్మ "నాకు పట్టెడే బొట్టుంటే పదిలక్షలమ్మా దొరసాని!" అంటూ నిరాకరిస్తుంది. దొరసాని అప్పుడు "నీ మరిదిని పెండ్లాడి పసుపు కుంకుమలు నిల్పుకో" మని సూచిస్తుంది. దానికి కామమ్మ కోపంతో "మారు మనుమూ పెండ్లి మా యింట లేదు దొరసాని" అంటూ సత్తెము చూపుతుంది. ఆమెకు కడుపునొప్పి తెప్పిస్తుంది. దొర భయపడి ఆమెకి మొక్కి అనుమతి ఇస్తాడు. కాకినాడ, మద్రాసు పెద్ద దొరల దగ్గర అనుమతి తెచ్చుకోమంటాడు. కామమ్మ తన 'సత్తెం'తో యేర్లూ ఊర్లూ దాటి కాకినాడ, ఆపైన మద్రాసు చేరి అక్కడ 'చెన్నపట్నములోను వాలీసు, మేడీసు, సీవీసు గిరివాకా సులోకాను " మొదలైన తెల్ల దొరల కలలోకి వెళ్ళి సత్తెం చూపి అనుమతి తీసుకొని తిరిగి వచ్చి సాగుమానానికి అన్ని ఏర్పాట్లు (జాగా కొనడం, ఊరి జనాన్ని పిలవడం, దొరలను ఆహ్వానించడం, వ్రాయసగాడు మాదాసు వెంకయ్యను తన కథ రాసి ప్రకాస్తి చేయమనడం, అందుకోసం మాదాసు వెంకయ్యకు డబ్బూ, నగలు ఇవ్వడం మొదలైనవి) చేసుకుంటుంది. ఈ హడావుడి అంతా చూసి అంతకు మునుపే సాగుమానం చేసి పేరంటాలైన మాల చిన్నమ్మ తల్లి లక్ష్మమ్మ తన బిడ్డ (చిన్నమ్మ పేరంటాలు) మాహాత్మ్యం తగ్గుతుందేమోనని దురుద్దేశంతో మాదిగ మంత్రగాడైన వెంకనితో కూడి కామమ్మకు 'కట్టుగట్టే' ప్రయత్నం చేస్తుంది. కానీ కామమ్మ తన సత్తెం చూపి అన్నిటినీ అధిగమించి చివరికి 'కాలుతున్న సూర్యునికి దండంబెట్టి చితిగుండంలోకి దిగి ఆఖరి ఘడియలు మాట్లాడి మంటల్లో దగ్ధమౌతుంది." ఇదీ టూకీగా కామమ్మ కథ.

ఈ కథ ఒక పేరంటాలి కథ. రామరాజుగారి మాటల్లో చెప్పాలంటే 'సహగమనం' చేసిన సుమంగళులను 'పేరంటాండ్రు' అంటారు (పేజీ 527). స్త్రీ గొంతుకే నేరుగా విన్పిస్తున్నట్లుగా కన్పించే ఈ గాథ రచయిత 'మాదాసు వెంకయ్య' అని పాటలోనే ప్రస్తావనలు ఉన్నాయి. కామమ్మ నగలూ, కొంత పైకం ఇచ్చి మాదాసు వెంకయ్యను తన కథను రాయమనీ, అట్లా తన గాథను లోకంలో 'ప్రకాస్తి' చేయమని కోరుతుంది. అట్లా ఒక పురుష రచయిత పూనుకొని రాసిన కథ ఇది. దీని మూలప్రతి ప్రాచ్యపుస్తక భాండాగారంలో ఉందని రామరాజుగారు ప్రస్థావించారు. ఐతే ఇది ఆపైన అనేక ప్రచురణలు పొందినట్టు కనిపిస్తోంది. ఈ వ్యాస సందర్భంగా నేను చేసిన అన్వేషణలో నాకు ఎస్.వి.కె. గ్రంథాలయంలో యస్. అప్పలస్వామి అండ్ సన్స్, రాజమండ్రి పబ్లిషర్స్ ప్రచురించిన కాపీ కన్పించింది. దీని కవర్ పేజీపై 'పండిత పరిష్కృతము' అయిందన్న స్పష్టమైన వివరణ ఉంది . దాదాపు 51 పేజీలుగా సాగిన పాట ఇది. భావోద్వేగ ప్రవాహ ధోరణిలో సరళమైన శైలితో సాగిన రచన ఇది. 'శుభము, శుభము కామమ్మా - శుభమొంది సామర్లకోటలోన నమ్మా!' అనే చరణాలతో మొదలై 'కామమ్మ చరిత్ర విన్నవారికి భాగ్యములు,

దీర్ఘాయుషు గలుగు యెప్పటికి' అనే వాక్యాలతో ముగుస్తుంది. 'కామమ్మ' కథతో పాటుగా రామరాజుగారు పరిచయం చేసిన 'లక్ష్మమ్మ కథ', 'సన్యాసమ్మ కథ', 'మండపేట పాపమ్మ పేరంటాలు కథ', 'శృంగవరపుకోట యెరుకమ్మ పేరంటాలు కథ', 'తిరుపతమ్మ పాట' వంటి మిగిలిన పేరంటాళ్ళ కథల్లో సైతం చివరి చరణాలు 'విన్నవారికి భాగ్యములు దీర్ఘాయుషు' అనే ఆశీర్వాద వాక్యాలుగానే కన్పిస్తై. కథల్లో భర్త వలస వెళ్ళడం అనేది కూడా సాధారణంగా కన్పిస్తుంది. చారణ వృత్తి కళాకారులైన పిచ్చుగుంట్లవారి నోట కామమ్మ పాట ప్రచారంలో ఉంది. బుర్రకథగా కూడా జంగంవారు ఈ పాటను పాడుతుంటారు. ఈ కథలో వర్ణించిన సంఘటన కాలం 18వ శతాబ్దమని చెప్పే సూచనలు ఎన్నో కన్పిస్తే. ఉదాహరణకి సహగమన నిషేధం, సహగమనానికి ప్రభుత్వ అనుమతి తీసుకోవడం వంటి చట్టపరమైన నిబంధనలతోపాటు కామమ్మ అనుమతి కోసం వెళ్ళి కలిసిన చెన్నపట్నం పెద్దదొరలైన వాలిస్, మెడోస్ ల వంటి చారిత్రక వ్యక్తుల (బ్రిటిష్ అధికారులు) ప్రసక్తి ఈ సంఘటనల కాలాన్ని సూచిస్తుంది. ఈ వివరాల్లోకి వెళ్ళేముందు సహగమనానికి సామాజిక ఆమోదాన్ని సమకూర్చిన సాంస్కృతిక (భావజాలపరమైన) నేపథ్యాన్ని పూర్వ సాహిత్యాధారాల ఊతంతో స్థూలంగానైనా తెలుసుకోవాలి.

## సాంస్కృతిక నేపథ్యం:

రామరాజుగారు సంకలనం చేసిన కరుణరసగేయాల్లో మొదటి పాట 'కన్యకామ్మవారి కథ'. ఈ కథ కామమ్మ, పాపమ్మ వంటి పేరంటాళ్ళ కథలకు కొంత భిన్నమైంది. పేరంటాళ్ళ గాథల కంటే పూర్వమే వ్యవహారంలో ఉన్న పాటగా ఇది గుర్తింపబడింది. ఈ కథకు సంబంధించి రామరాజుగారే 3 ప్రతులను (భిన్న సాహిత్య ప్రక్రియల్లో) సేకరించారు. కామమ్మ కథ వలెనే ఈ కన్యకామ్మవారి కథను కూడా పురుష రచయితలు రాసిన దాఖలాలు కన్పిస్తే. రామజోగిశాస్త్రిగారు ఈ కథను శారద కథగా రాస్తే, కొండపల్లివారు 49 ఖండికలున్న గొబ్బిపాటగా రాసారు. అప్పటికప్పుడు కలిగే భావోద్వేగాల్లోంచి అలవోకగా నోటి పాటలుగా సాగే స్త్రీల (పురుషుల) పాటలకు భిన్నంగా ఈ గాథలు పురుషుల చేత రచింపబడి లిఖిత స్థానాన్ని అందుకొని సంప్రదాయిక భావనల ప్రసారానికి బ్యాలేలు (గాథలు)గా ప్రచారంలోకి వచ్చినై. వృత్తికళాకారుల నోట జనంలో ప్రచారాన్ని పొందినై. కన్యకామ్మవారి కథను వీరముష్టులు పాడతారు. టూకీగా చెప్పాలంటే పేరంటాళ్ళ కథలు భార్యల కథలు అయితే కన్యక కథ పెళ్ళికాని కన్య (కన్నె) కథ. కన్యక వైశ్యకుల కన్నె. ఆమె అందాన్ని చూసి విష్ణువర్ధనుడనే రాజు మోహించి, ఆమెను పెళ్ళి చేసుకుంటానంటాడు. కానీ కన్యక అందుకు ఒప్పుకోదు. ఆమె కులంవాళ్ళూ ఒప్పుకోరు. రాజు కోపంతో వారిపైకి దండెత్తి వస్తున్నాడని తెలిసి, దిక్కుతోచకుండా ఉన్న తన కులపోళ్ళందరినీ కన్యక సమావేశపరుస్తుంది. తనతోపాటు ప్రాణత్యాగం చేయడానికి ఎంతమంది సిద్ధంగా ఉన్నారని అడుగుతుంది. ప్రాణ త్యాగానికి ముందుకు రాని వారిపై 'కుల బహిష్కరణ' విధిస్తుంది . అంతేకాదు, ఇకపై మేన సంభంధాలు మాత్రమే చేసుకోవాలని 'కట్టడి ' విధిస్తుంది . ఆ తర్వాత తనతోపాటు స్వచ్ఛందంగా ప్రాణ త్యాగానికి సిద్ధపడిన కులపోళ్ళతో సహా గుండంలోకి దూకి మరణిస్తుంది. అప్పట్నుంచి ఆమె వైశ్యకుల దేవతగా పూజలందుకుంటోంది. ఇదీ స్థూలంగా కన్యకామ్మవారి కథ.

ఈ గాథ 20వ శతాబ్దపు తొలితరం ఆధునిక రచయిత అయిన గురజాడ అప్పారావు దగ్గర్నుంచి 1960ల నాటి విప్లవకళా బృందాల వరకు ఎందరికో కథావస్తువైంది. వీళ్ళంతా తమ తమ దృక్పథాల్లోంచి కన్యక జీవితంలోని విషాదాన్ని, నిరసననూ గేయగాథలుగా విన్పించారు. అయితే కులానికీ, స్త్రీ లైంగికత్వానికి ఉన్న సంబంధాన్ని నిగూఢంగా తరం నుంచి తరానికి ఈ గాథ చేరవేయడాన్ని విశ్లేషించినవారు మాత్రం లేరు. నిజానికి స్త్రీల లైంగిక అణచివేతలో భాగంగానే కులం ఏర్పడిందని చెప్పడానికి ఈ కథ బలమైన సాక్ష్యంగా కన్పిస్తుంది. అంతేకాదు, సమాజ పిరమిడ్ లో తమ అత్యున్నత స్థానాన్ని పదిలపర్చుకోవడానికి వర్ణాన్ని 'పవిత్రీకరించి' అంతరాలవారీ కులాలను స్థిరీకరించిన బ్రాహ్మణీయ పితృస్వామ్య భావజాలంలో కుల పవిత్రతను కొనసాగించే బాధ్యతను ( అంటే తల్లిదండ్రులు నిర్ణయించిన కులం లోపలి వరుణ్ణి పెళ్ళాడటం, కులాన్ని కొనసాగించే వారసులని కనడం మొ?) కులస్త్రీ ధర్మంగా స్థిరీకరించే గాథగా కన్యక కన్పిస్తుంది.

ఈ భావనల మూలాలు మనుస్మృతి నుంచి యాజ్ఞవల్క్య స్మృతి వరకూ స్థిరపడిన స్త్రీ–పురుష ధర్మాల్లో ఉన్నై. వర్ణాల మధ్య ఇచ్చిపుచ్చుకునే అవకాశాలను రద్దు చేసి ఏ కులంలో వాళ్ళు అదే కులంలోని వ్యక్తిని పెళ్ళి చేసుకోవాలనే నిబంధనతోపాటు, యుక్తవయసు రాకముందే బాలికకు కులం లోపలి వరుణ్ణి ఎంచి పెళ్ళి చేయాలని స్మృతులూ, ధర్మశాస్త్రాలూ ఘోషించిన కాలం బ్రాహ్మణీయ పితృస్వామ్యం బలంగా స్థిరపడుతున్న కాలానికి సూచి. మొత్తానికి బ్రాహ్మణీయ పితృస్వామ్యం రెండంచెలలో కుదురుకున్న వ్యవస్థగా కన్పిస్తుంది. మానసిక, సామాజిక, రాజకీయార్థిక అభద్రతల మూలంగా స్త్రీలను తమ అధీనంలో ఉంచుకోవాల్సిన నీచస్థాయి జీవులుగా పరిగణించే పురుషస్వామ్య ధోరణులు ఒక అంచెలో పనిచేస్తే, తమ (కుల) సామాజికస్థాయిని సుస్థిరం చేసుకోవడానికి స్త్రీల లైంగికత (జీవితభాగస్వామిని ఎంచుకునే స్వేచ్ఛ) పై అణచివేతను ధర్మంగా ప్రచారంలో పెట్టే బ్రాహ్మణీయ ధోరణులు మరో అంచెలో పనిచేసినై. ఈ రెండంచెల కలయికవల్ల ఏర్పడిన సంక్లిష్ట వ్యవస్థే బ్రాహ్మణీయ పితృస్వామ్యం . ఇట్లా పుట్టుకా, ఉపనయన సంస్కారాలతో రెండుసార్లు జన్మలెత్తే 'ద్విజుల' రెట్టింపు పితృస్వామిక భావనల కూర్పు భారతదేశానికే ప్రత్యేకమైన బ్రాహ్మణీయ పితృస్వామ్యానికి

ప్రాణం పోసింది అని అర్థం చేసుకోవచ్చు . ఇలా స్త్రీల లైంగికత్వాన్ని నియంత్రించే 'రాజకీయాస్త్రంగా' కులవ్యవస్థను ఎంచుకుంది బ్రాహ్మణీయ పితృ స్వామ్యం . 'కులకట్టడి' పేరున స్త్రీల లైంగికత్వంపై నియంత్రణను వ్యవస్థీకృతం చేసింది. యే కులానికాకులంలో స్త్రీలను శాశ్వతబందీలుగా ఖైదు చేసింది. భర్త ఉనికే తమ ఉనికిగా కుదించబడిన భార్యలుగా, కులసంతతిని అందించే గర్భాలుగా, కులగౌరవాన్ని కాపాడే కూతుర్లుగా, కుల పవిత్రతను రక్షించాల్సిన వితంతువులుగా, పనికిరాని 'మిగులు'గా స్త్రీల జీవితాలను ఈ భావజాలం నిర్దేశించింది. మొత్తంమీద వ్యక్తుల మధ్య కుటుంబ సంబంధాలను కొనసాగించే పద్ధతులూ, అందుకు ఆదరించాల్సిన కఠిన నిబంధనలనూ 'కులం'గా బ్రాహ్మణీయ పితృస్వామ్యం స్థిరపరిచింది. ఇలాంటి వ్యవస్థాగత కట్టడిలో స్త్రీ, పురుషులకు (మరీ ముఖ్యంగా స్త్రీలకు) తమ జీవితభాగస్వామిని తామే ఎంచుకునే అవకాశాలు రద్దు అవుతై. కులం కొనసాగించాల్సిన బాధ్యత స్త్రీ, పురుషులిద్దరిదీ అయినప్పటికీ స్త్రీలపై అదనపు బాధ్యత ఉంటుందని 'కన్యక' గాథ స్పష్టంగా చెబుతుంది.'పాతివ్రత్యం' భార్య ధర్మమైనట్లే కన్యాత్వాన్నీ, పవిత్రతను కాపాడుకోవడం 'కన్య' ధర్మమౌతుంది. అందుకోసం స్త్రీ తన ప్రాణాలను త్యాగం చేయడానికైనా సిద్ధపడాలనే ప్రబోధం 'కన్యక' గొంతుక ద్వారా వినిపిస్తుందీ గాథ.

స్మృతులకాలం నాటి ఈ భావనలు పురాణాల మీదుగా జానపదుల గాథల వరకూ నిరాటంకంగా సాగడాన్ని సూచించే ఇలాంటి ఉదాహరణలు రామరాజుగారి పుస్తకంలోనే కోకొల్లలుగా కన్పిస్తే, ఉదాహరణకి చారిత్రక గేయాల్లో ఒకటైన 'కాటమరాజు' కథలో పాత్రల మధ్య జరిగే ఒక సంభాషణ ఇలా ఉంటుంది.

"మొదటి పాత్ర : పతివ్రతంటే ఎలాంటిదయ్యా?

రెండో పాత్ర : పతివ్రతంటే చెప్పమంటావా? 'పతివ్రతలెప్పుడు పతి పాదంబులు పూజించునదో–అదే ఆడదో – పతిని విడిచి పరపురుషుని వెంబడి పరుగులెత్తునది– గాడిదో...."

ఇలా వేల సంవత్సరాలనాటి భావనలు ఇతిహాస గాథల్లో ధర్మాలుగా నిర్ధారితమై జానపద సమూహాల ఊహాకల్పనల్లోకి సైతం తర్జుమా అవడం చూడొచ్చు. మొత్తానికి బ్రాహ్మణీయ పితృస్వామ్య భావనల చట్రంలో బిగుసుకు పోయిన కుల/వంశ గౌరవ భావనలు, స్త్రీత్వాన్ని కులసంతతిని అందించే మాతృగర్భంగా నిర్వచించడం, మాతృగర్భాల తలంలోంచే స్త్రీలను కన్య– భార్య– వితంతువు– గొడ్రాలు– వేశ్యలుగా వర్గీకరించడం, త్యాగాన్ని స్త్రీ గుణంగా నిర్వచించి చివరికి త్యాగమే ఆమె 'ధర్మంగా' నిర్ధారించడం కన్యకామ్మవారి కథలోనే కాదు, 18వ శతాబ్దంనాటి 'పేరంటాళ్ళ గాథలు' కూడా కళ్ళకు కట్టినట్టు చూపిస్తాయి . పురుషుని గుణం వీరత్వం అనీ, భార్య (స్త్రీ) ఉనికి భర్తతోనే అని చెప్పే ఈలాంటి భావనలు చారిత్రకగేయాల అధ్యాయంలో రామరాజుగారు సేకరించిన పల్నాటియుద్ధం, బొబ్బిలియుద్ధం, కాటమరాజు కథ వంటి గాథల్లో సైతం కన్పిస్తాయి . పేరంటాళ్ళ గాథల కంటే పూర్వపువని భావించే ఈ గాథలు అట్లా 'సహగమనం' తంతుకి పునాది భావనలను అందించినై. అంతెందుకు, ఈ గాథలన్నిటిలోనూ 'సహగమనా'న్ని ప్రస్తుతించడం, ధర్మంగా ప్రతిష్ఠించడం కన్పిస్తుంది. ఉదాహరణకి భర్త యుద్ధానికి వెళ్తున్నాడని తెలిసి, తన మొగమైనా చూడని భర్తతోపాటుగ మరణం 'తప్పని' తన దీనావస్థను తలుచుకొని "భోగంబు నొందెడు పొలతులు వారు (వేశ్యలు) చావనోచినయట్టి సఖియను నేను" అంటూ తన దీనావస్థను తలచుకొని 'మాంచాల' విలపిస్తుంది (పల్నాటియుద్ధం గాథ). 14వ శతాబ్దంలోని సంఘటనలను చిత్రిక పట్టిన కాటమరాజు కథలోనైతే ఖడ్గ తిక్కన భార్య యుద్ధభూమినుంచి పారిపోయి వచ్చిన భర్తని ఆడదానిగా పరిగణిస్తుంది. యుద్ధానికి ఆయన్ని తిరిగి పంపడమే గాకుండా ఆయన మరణవార్త వినగానే 'సహగమనం' చేస్తుంది. బొబ్బిలియుద్ధం గాథలో సైతం జగపతి మరణవార్త విని సీతమ్మ సహగమనం చేస్తుంది. 'సహగమనం చేసిన స్త్రీల నల్లపూసలు పుట్లకొద్దీ పోగుపడ్డాయన్న' ప్రస్తావన సైతం కన్పిస్తుంది. మొత్తానికి మహా భారతంలోని మాద్రి నుంచి ఈ జానపద గాథలలోని మాంచాల, అగుమంచి వరకూ– పురుషత్వాన్ని 'వీరత్వం'తో, స్త్రీత్వాన్ని'సతీత్వం'తో నిర్ధారించడం కనిపిస్తుంది. "పురుషు కంటెను ముందు పోయెనా ప్రాణం, తన ప్రాణనాథుండు తను జేరుదనుక, నాగి ప్రతీక్షించు నా పుణ్యకాంత– పురుషుడే ముందైన బుణ్యకాంతలకు, పతి కూడి యొక్కటై పరలోకయాత్ర పుణ్యప్రదంబని పొగుడును శ్రుతులు– పతి నెడబాయుట పరగ దోషంబు,నా ప్రాణవిభుతో నన్నంపు" అంటూ సహగమనం చేస్తుంది ఖడ్గ తిక్కన భార్య 'కాటమరాజు' కథలో.

భావజాల చట్రంలో నలిగిన తమ గాయాలకి ప్రతిబింబాలా ! అన్నట్టున్న ఇలాంటి పాత్రలపై జానపద పాటలు కావచ్చు, గాథలు కావచ్చు నిస్సంకోచంగా తమ అభిమానాన్ని పంచుకుంటై. అలాగని వీటిని స్త్రీల పాటలని అనలేం. అచ్చమైన స్త్రీల పాటలు ఆయా తలాల్లో ఇమిడిన, ఇమడాల్సిన స్త్రీల భావోద్వేగాలనూ, సంఘర్షణలనూ పట్టిస్తాయి . అంతేకాదు, బతుకమ్మ పాటలల్లోలాగా తమ పరాధీనతపై నిరసన వినిపిస్తూనే కుటుంబచట్రంలోనే తమదే అయిన ఆవరణం కోసం పడే పెనుగులాటనూ–చుట్టున్న సమాజంతో చేసే మౌనసంభాషణలనూ విన్పిస్తాయి . మొత్తానికి మాద్రి నుంచి మాంచాల– కన్యక వరకూ అగ్నికి బలి అయిన స్త్రీలు బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యకులాల స్త్రీలుగా కన్పిస్తారు. వితంతు పునర్వివాహాన్ని అనుమతించని ఈ బ్రాహ్మణీయ కులాలు మనుస్మృతి ప్రతిపాదించిన 'పాతివ్రత్య' ధర్మాన్నీ– 'సతి'

(సహగమనం) ని ధర్మంగా తొలుత ఎత్తిపట్టిన విష్ణుధర్మసంహిత భావజాలాన్ని అచ్చంగా ఆచరించే అగ్ర కులాలుగా సమ్మానించబడినై. కౌటిల్యుడు ప్రతిపాదించిన వితంతు పునర్వివాహాన్ని ఈ బ్రాహ్మణీయ కులాలు సమ్మతించలేదు. అలాకాకుండా వితంతు వివాహాన్ని సమ్మతించిన కులాలు 'వెలి'కి గురైనై. వెలివాడలుగా వెలిసినై (రేణుకా ఎల్లమ్మ గాథలో రేణుక వెలివాడలోనే తలదాచుకుంటుంది). అట్లా మారుమనువు తక్కువ జాతుల ఆచారంగా స్థిరపడింది.

ఐతే భర్త మరణానికి భార్యని జవాబుదారీగా భావించడం- పుణ్యం చేసుకోవడం- నోములు, ఆచారాలను పాటించడం కులాలకతీతంగా స్త్రీలందరూ కూడా నమ్మడం వల్ల కావచ్చుబీ బ్రాహ్మణీయ పితృస్వామ్య దృక్పథాలను సదాచారాల పేరున ఆచరించే కులాల సామాజిక స్థాయిని తాము సైతం అందుకోవాలనే కింది కులాల స్త్రీ-పురుషుల తహతహ వల్ల కావచ్చు- 'మారుమనువు' ఉన్నప్పటికీ 'సాగుమానం'వైపు మొగ్గుచూపిన దళిత బహుజన కులాల పేరంటాళ్ళు (సతులు) 18వ శతాబ్దం నాటికి కన్పించడాన్ని కామమ్మ కథతోపాటుగా మరో 9 గాథలు రికార్డు చేసాయి.

బెస్తకులానికి చెందిన కామమ్మ, దొరసాని తనని మళ్ళీ పెళ్ళిచేసుకొమ్మని అడగగానే "మారు మనువు మా ఇంట లేదు" అని కోపంతో ఊగిపోవడంలో స్త్రీ గొంతుక కంటే పురుషుని తాపత్రయమే కన్పిస్తుంది. అలాగే భర్త చనిపోగానే కామమ్మ 'సాగుమానం' చేసుకుంటానని ప్రకటించి కుటుంబాన్ని 'బలవంతం'గా ఒప్పించడంలో, కుటుంబ (కుల) స్థాయినీ-దేవతగా కొనసాగే తన ఉనికినీ పదిలపర్చుకునే క్రమంలో తన చితిని తానే పేర్చుకునే స్త్రీ(ల) నిస్సహాయస్థితినీ పోల్చుకోవచ్చు. మొత్తానికి యుద్ధాల్లో క్షత్రియ స్త్రీలు ఊరుమ్మడి 'సతి'కి పాల్పడటానికీ, బ్రాహ్మణ, వైశ్య స్త్రీలు కులపత్నులుగా చితినెక్కడానికీ బ్రాహ్మణీయ ధర్మశాస్త్రాలు భావజాల పునాదిని వేస్తేబీ 'సదాచార' కులాలకున్న సామాజిక గౌరవాన్ని అందిపుచ్చుకునే అవకాశంగా మారుమనువును అంగీకరించే మిగిలిన కులాల పురుషుల్లో సైతం 'సతి' గొప్ప కార్యంగా 'సమ్మతి' సాధించింది . అందుకు ఆయా కులాల స్త్రీల నిస్సహాయ, సామాజిక, ఆర్థిక పరిస్థితులూ, నమ్మకాలూ తోడైనవని కామమ్మ కథ స్పష్టంగా మన దృష్టికి తెస్తుంది.

అట్లే బ్రాహ్మణీయ పితృస్వామ్య భావనలు జానపదసాహిత్యంతో పునర్-విలీనాన్ని(re-absorption) సాధించడానికి వీరగాథలు (బ్యాలడ్స్) వంటి ప్రక్రియలను వాహికలుగా మార్చుకున్న వైనాన్నీ అంచనా వేయొచ్చు. అనుకరణ పోటీలో 19వ శతాబ్దం నాటికి కులాలకతీతంగా 'సహగమన' తంతు సరికొత్త ఆచారరూపమెత్తి 'ఆధునీకరించబడటాన్నీ' పసికట్టవచ్చు. అయితే 'సతి' తంతులోని ఈ పరిణామాలకు పై సాంస్కృతిక నేపథ్యమే గాక ఆనాటి రాజకీయ, ఆర్థిక పరిస్థితులు కూడా తోడైనై.

## సతి ఉధృతి - ఆర్థిక రాజకీయ పరిస్థితుల నేపథ్యం:

"అనగా అనగా ఒక బ్రాహ్మణుడు. ఆయనకి ఐదుగురు కొడుకులు. అందరికీ పెళ్ళిళ్ళు అవుతాయి. ఐదవ కోడలి పేరు కరుళ్ళ గౌరీదేవి. కుటుంబం లోని దరిద్రపరిస్థితులకు విసిగిపోతుంది. 'నాకు అత్త సొమ్మొద్దు - మామ సొమ్మొద్దు, పుత్రుని సొమ్మొద్దు, పురుషుల సొమ్మొద్దు. నా సొమ్మే నాకు ఇమ్మ'ని ఆమె సూర్యదేవునికి నోము పడుతుంది. దాంతో కుటుంబంలో అందరికీ ఆమె మీద కోపం వస్తుంది. ఓ రాత్రి నిద్రపోతున్న ఆమెను మంచంతో సహా ఎత్తుకొనిపోయి ఓ చిట్టడవిలో పారేస్తారు. ఐనా ఆమె పట్టు విడవకుండా చేసిన నోముకి సూర్యదేవుడు ఆమెకి సమస్త భాగ్యాలనిస్తాడు. అక్కడే అడవిలో ఆమె ఓ గొల్లవాడి సాయంతో మేడ గట్టుకొని అనాయాసంగా బతుకుతుంటుంది. ఆకలితో వచ్చినవారికి కాదనకుండా అన్నం పెడుతుంటుంది. ఇంతలో ఊళ్ళో ఆమె భర్త కుటుంబంవాళ్ళు దరిద్రానికి తట్టుకోలేక అడవికి కట్టెలు కొట్టుకొని రావడానికి వెళ్తారు. ఆకలికి తాళలేక గౌరీదేవి దగ్గరికి వచ్చి 'దేహీ' అని చేయి చాస్తారు. వాళ్ళు ఆమెని గుర్తుపట్టకపోయినా ఆమె మాత్రం వాళ్ళని గుర్తుపడుతుంది. అన్నం పెట్టి ఆదరిస్తుంది."- ఇది 1922లో నందిరాజు చలపతిరావుగారు సంకలనం చేసిన 'నోముల కథల్లో' ఒకటి (స్త్రీల పాటలు - మూడవభాగం). ఈ కథ ఒక స్త్రీ ఆర్థిక అస్వతంత్రతనీ, దాన్ని అధిగమించేందుకు ఆమె చేసే ప్రయత్నాలనూ చూపుతుంది. అట్లే అందుకు కుటుంబం ఆమెని నిరసించడం, చివరికి వాళ్ళకి ఆమే దిక్కవడాన్నిసైతం నోము కథగా చెబుతుంది. అంతేకాదు, చివరన 'ఈ నోము పట్టిన స్త్రీలకు ఫలం సిద్ధిస్తుంది' అనే ఫలశృతితో స్త్రీల ఆర్థిక స్వతంత్రేచ్ఛను సూటిగా ప్రస్తావిస్తుంది. 'స్త్రీల పరాధీనతకు ఒక కారణమైన ఆర్థిక అస్వతంత్రతను' స్త్రీల గొంతుతో పరిచయం చేసిన కథ ఇది. స్మృతుల కాలం నుంచీ స్త్రీలను ఆస్తిలో భాగంగా ఎంచడం-ఆస్తిపై ఆమెకు ఎలాంటి నిర్ణయాధికారాలు లేకపోవడం- అదే పరిస్థితి ఈనాటికీ కొనసాగుతుండమూ చూడొచ్చు. కులీనస్త్రీలలోని ఈ పరాధీనత 18వ శతాబ్దంనాటి కరువు సందర్భంలో అన్ని కులాలకీ విస్తరించింది.

అతి భయంకరమైన కరువుగా చరిత్రలో నమోదైన ఆ కాలంలో (1770) బెంగాలు పట్టణ పరిసర ప్రాంతాల్లో 'సతి' భయంకరమైన అంటువ్యాధిలా ప్రబలిందని బ్రిటిష్ పార్లమెంటరీ రికార్డ్సు పేర్కొన్నాయి. 1772లో తొలి గవర్నర్‌గా వలస ప్రభుత్వంచే నియమితుడైన వారన్ హేస్టింగ్స్ (రాబర్ట్ క్లైవ్‌తో కలిసి) వలసపాలనకు పునాదులు వేస్తున్న సమయమది. ఈస్ట్ ఇండియా కంపెనీ బలంగా నిలదొక్కుకోవాలంటే స్థానికుల సహకారాన్ని కూడగట్టుకోవాలని గ్రహించిన వలసవాది హేస్టింగ్. అందుకు తొలి అడుగుగా బెంగాలు, బొంబాయి, మద్రాసు వలస ప్రాంతాలన్నిటినీ ఒకే గొడుగు కిందకి తెచ్చే ప్రయత్నం చేసాడు. మొదటి ఆంగ్లో-మైసూరు యుద్ధం (1767-

1769) తర్వాత మద్రాసుకు వచ్చాడు. 1769లో మద్రాసు ట్రీటీ ఒప్పందం తర్వాత మూడు వలస ప్రాంతాలకు గవర్నర్ జనరల్ అయ్యాడు. 1773ల నాటికి కలకత్తా కేంద్రంగా మద్రాసు -బొంబాయి ప్రాంతాలు వలస పాలనలోకి వెళ్ళినై. ప్రైవేట్ వ్యాపారులకి ప్రభుత్వ భద్రత కల్పించడం; భూమి శిస్తుల క్రమబద్దీకరణ; ఆచారాల సంస్కరణ; ఆయా మతాల శాస్త్ర గ్రంథాల్లోని భావనల కొనసాగింపుగా హిందూ-ముస్లిం చట్టాలకు రూపకల్పన; 3 ప్రావిన్సులకి (కలకత్తా -బొంబాయి -మద్రాసు ) ఒకే కరెన్సీ; పోస్టల్ సర్వీసు వంటి సంస్కరణలకు వారన్ హేస్టింగ్ పూనుకున్నాడు. బ్రాహ్మణ పండితుల సంప్రదింపులతో శాస్త్రగ్రంథాలాధారంగా హిందూ చట్టాల రూపకల్పనకి అప్పుడే బీజాలు పడినై. స్థానికుల భాషా సంస్కృతుల అధ్యయనాలు తమ స్థానాన్ని పదిలపర్చుకోవడానికి ఉపయోగపడే అంశాలుగా వలసవాదులు గ్రహించిన సమయమది . ఆర్యసిద్ధాంతాన్ని ప్రతిపాదించిన విలియం జోన్స్ కలకత్తాలో ఏసియాటిక్ సొసైటీ స్థాపించి సంస్కృతానికీ, ఇతర యూరోపియన్ భాషలకీ ఉన్న సంబంధాలపై విస్తృతంగా చర్చించడం మొదలైన కాలం కూడా అదే. ఈ క్రమానికి కొనసాగింపుగా కార్న్ వాలిస్ (కామమ్మ కథ ప్రస్తావించిన వాలిస్ దొర ఈయనే) సైనికాధికారిగా వచ్చారు. 1786లో గవర్నర్ జనరల్ గా నియమించబడ్డాడు. ఈస్ట్ ఇండియాకి బెంగాలు శాశ్వత వలసగా దఖలు పడిన తర్వాత వాలిస్ పాలనాపరమైన అనేక మార్పులు చేసాడు. రెవెన్యూ వ్యవస్థ, న్యాయవ్యవస్థ, వాణిజ్యం అనే 3 విభాగాలుగా బ్రిటిష్ పాలనాధికారాలను క్రమబద్ధం చేసాడు. వాటిని వరుసగా జమీందారీ వ్యవస్థ (స్థానిక అగ్రకుల భూస్వాములకు శిస్తు చెల్లించి భూమిపై అధికారం), న్యాయవ్యవస్థ (హిందూ-ముస్లిం పర్సనల్ లాస్ ప్రకారం కేసుల పరిష్కరణ, సర్క్యూట్ కోర్టు) ఏర్పాటుచేసాడు. వాణిజ్యంపై మాత్రం సర్వాధికారాలు బ్రిటిష్ ప్రభుత్వానికే కట్టబెట్టడం వంటి విధానాలను వాలిస్ పాలనారంగంలో స్థిరపరిచాడు. ఈ విధానం 1793లో 'కార్న్ వాలిస్ కోడ్' గా చట్టరూపం దాల్చింది. ఈ పద్ధతి ద్వారా స్థానిక భూస్వాముల మద్దతును బ్రిటిష్ వలసవాదం సాధించుకొంది. అంతేకాదు హిందూ పర్సనల్ లాస్ కల్పనలో బ్రాహ్మణ పండితుల సంప్రదింపూ, శాస్త్రామోదాన్ని తప్పనిసరి చేయడం మూలంగా బ్రాహ్మణీయ పితృస్వామ్య భావజాలానికి పునాది ఐన కులాల స్థిరీకరణలో భాగమైంది. అట్లే శాస్త్రామోదం ఉంది గనుక ఒకవేళ భార్య స్వచ్ఛందంగా భర్తతోపాటు చితిలో దూకి సహగమనం చేసుకోవాలనుకుంటే అనుమతి ఇవ్వాలనే నిర్ణయాలకు సైతం తర్వాత్తర్వాత ఈ సందర్భం దోహదపడింది.

ఈ రాజకీయ నేపథ్యానికి కరువు, వలసలు, సాంస్కృతిక నేపథ్యం, స్త్రీల ఆర్థిక పరాధీనత వంటి కారణాలు తోడై స్త్రీలకు శాపమైంది. భర్త చనిపోయిన స్త్రీల పరిస్థితి మరింత దిగజారింది. వలస పాలనలోని పట్టణప్రాంత అగ్రకుల మధ్యతరగతి హిందూ పురుషులకు స్త్రీలు(వితంతువులు ) వదిలించుకోవాల్సిన ప్రాణులుగా, గుదిబండలుగా కన్పించడం మొదలైంది. ఈ సందర్భం గురించి చెబుతూ "ఉన్నత మధ్యతరగతి పట్టణప్రాంత కుటుంబాలు వితంతువును పోషించడం అనవసరమైన బరువుగా భావించినై. అందుకే వలస పట్టణాల్లోనే 'సతి' ప్రబలింది" అని రామ్మోహన్ రాయ్ సైతం అభిప్రాయపడ్డాడు. అంతకు మునుపు చరిత్రలో అక్కడక్కడ సంఘటనలుగా నమోదైన 'సతి'కి భిన్నంగా వదిలించుకోవాల్సిన ప్రాణులుగా కాళ్ళూ, చేతులు కట్టి చితిలోకి విసిరేయాల్సిన 'మిగులుగా' వితంతు స్త్రీల జీవితాలు మలుపు తిరిగినై. ఇదే తంతు క్రమంగా అన్ని కులాలకీ పాకినట్టు చరిత్ర పరిశోధనలు చెబుతున్నై. బెంగాల్లో 55% అగ్రకులాల్లో, 45% దిగువ కులాల్లో 'సతి' సంఘటనలు నమోదైనట్టు బ్రిటిష్ పార్లమెంటరీ రికార్డ్సు పేర్కొన్నాయి. ఈ నేపథ్యంలో ఉత్తర భారతంలోని బెంగాలు, బెనారసు వంటి ప్రాంతాలతో పాటుగా వలసపాలనలో ఉన్న మద్రాసు ప్రెసిడెన్సీలో కూడా ఈ భావనలు అంటువ్యాధిలా సోకినై. సరిగ్గా ఇదే సందర్భాన్ని రికార్డు చేసింది 'కామమ్మ కథ'. మద్రాసు ప్రెసిడెన్సీలో భాగమైన కోస్తాంధ్ర తెలుగు ప్రాంతాల్లో బెస్త, కాపు, కమ్మ, ఎరుకల వంటి బ్రాహ్మణేతర కులాల్లోని స్త్రీలు చితి ఎక్కి 'సాగుమానం' చేయడాన్ని 'కరుణరస గేయాల' ప్రకరణంలోని పేరంటాళ్ళ గాథలు మన దృష్టికి తెస్తాయి.

స్థానిక ఆర్థిక వనరులు కోల్పోయి కొలువు కోసం పట్టణ ప్రాంతాలకు వలస వెళ్ళిన తొలితరం పురుషుల్లోని వెలితీ, తప్పించుకోలేని దుర్భర సామాజిక, ఆర్థిక పరిస్థితులనుంచి బైటపడటానికే గాక భార్యలుగా తమ సామాజిక స్థాయిని చిరస్థాయిగా పదిలపర్చుకోవాలనే స్త్రీల తాపత్రయమూబీ బ్రాహ్మణీయ కులాల 'స్థాయి'ని అందుకునే అవకాశంగా 'అంచులకు నెట్టివేయబడిన సమూహాల' పురుషుల (స్త్రీల) తపనా- అనుకరణా కలగలిసి దిగువకులాల స్త్రీలను చితిలోకి నడిపించినవని ఈ గాథల ద్వారా అంచనా వేయవచ్చు. ఈ అవగాహనకి "హిందూ సమాజంలోని ఒక కులం స్థాయి సతి-బలవంతపు వితంతుపద్ధతి-బాలికా వివాహపద్ధతుల ఆచారాల పాటింపు మేరనుబట్టి మారుతూ ఉంటుంది" అన్న డా? అంబేద్కర్ విశ్లేషణలు బలాన్నిస్తున్నాయి. అట్లే "భారతదేశంలో కులాల ఏర్పాటు ప్రక్రియ మొత్తం అంతా పైవారిని కిందివారు అనుకరించే ప్రక్రియ" అన్న ఆయన ప్రతిపాదనకి సాక్ష్యాలుగా పేరంటాళ్ళ గాథలు కన్పిస్తే. "At present there is a struggle between caste and code and that caste is more potent in it's secret persecution" అన్న ఆనాటి చట్టసభల వ్యాఖ్యానాలు సైతం ఈ అవగాహనకి ఊతమిస్తున్నై. అట్లా దళిత బహుజనకులాల్లో సైతం సమ్మతి సాధించుకొని 18వ శతాబ్దం చివరినాటికి సరికొత్త రూపాన్ని సంతరించుకొని 'సతి' కార్చిచ్చులా బ్రిటిష్ ప్రావిన్సెస్ లో వ్యాపించింది. అంతదనుక "మేం మతవిషయాల్లో జోక్యం చేసుకోం" అంటూ 'సహగమన' సంఘటనలను 'సెన్సేషన్'గా వీక్షించిన ప్రేక్షకస్థానంలోని బ్రిటిష్

ప్రభుత్వం స్థానికులను పాలించేందుకు 'తామే' అర్హులమని చాటుకునే అదునుగా ఈ సందర్భాన్ని భావించింది. 'సతి'పై చర్చలు లేవనెత్తింది. హిందూ ధర్మశాస్త్రాల్లో 'సతి'కి ఆమోదం ఉందా లేదా అనే అంశాలపై పండితులతో చర్చలు చేసింది. అట్లా హిందూశాస్త్రాల (స్మృతుల) ఆమోదాన్ని చట్ట నిర్ణయాలకు తప్పనిసరి కొలమానంగా బ్రిటిష్ ప్రభుత్వం స్థిరపరిచింది (స్వతంత్రానంతర భారతంలో కూడా ఇదే పరిస్థితి కొనసాగుతోం దిప్పటికీ). చివరాఖరికి రామ్మోహన్రాయ్ వంటి సంస్కర్తల 'సతికి శాస్త్రామోదం లేదన్న' వాదనలతో 1829 నాటికి 'సతీనిషేధ' చట్టాన్ని తెచ్చింది. ఐతే అప్పుడు జరిగిన చర్చల్లో హిందూ ధర్మశాస్త్రాలకే తొలి-మలి ప్రాధాన్యం ఇవ్వటం మూలంగా స్త్రీలు స్వచ్ఛందంగా భర్తతోపాటు మరణించాలని భావిస్తే వాళ్ళకి అనుమతి ఇవ్వాలనీ, అట్లా అనుమతి పొందిన 'సహగమన' తంతును సజావుగా సాగేట్టు పోలీసు యంత్రాంగం చూసుకోవాలని ఆదేశాలివ్వటంలో వలస ప్రభుత్వం తన ద్వంద్వనీతిని ప్రదర్శించింది. చివరికి రామ్మోహన్ రాయ్ వంటి స్థానిక సంస్కర్తల వాదనకీ, సతి సంఘటనలు విని 'చలించిన' బ్రిటన్ లోని తెల్లజాతి స్త్రీల ఒత్తిడికీ తల వొగ్గి 1829లో 'సతి' నిషేధ చట్టాన్నీ, 1855 నాటికి హిందూ వితంతు పునర్వివాహ చట్టాన్నీ బ్రిటిష్ ప్రభుత్వం ప్రకటించింది.

ఈ క్రమంలో అనాగరికులైన స్థానికులను ఉద్ధరించేందుకైనా, పాలించేందుకైనా తామే అర్హులమన్న ఆధిపత్య వలసవాద భావనలతో బ్రిటిష్ ప్రభుత్వం 'సతి'ని సెన్సేషన్ కింద మార్చింది. అమాయక హిందూ స్త్రీలను రక్షించే దూతలుగా వలసవాదులు తమ్ము తాము భావించుకున్నారు. వలసవాదం తమ ఈ 'వెనకబాటుతనం'పై లేవనెత్తిన చర్చలకు అప్పుడప్పుడే వలసవాద పోకడలను అలవరుచుకుంటున్న పట్టణప్రాంత విద్యావంతులు 'అధాటున' సర్దుకొని తమ జాతి గొప్పదనాన్ని చెప్పుకునేందుకు ఉపక్రమించారు. వేదకాలం నాటి స్త్రీల ఉన్నత పరిస్థితులను చూపి తమ సంస్కృతిలోని గొప్పదనాన్ని చాటుకునే క్రమంలో వారు 'జాతీయ వాదానికి ప్రాణం పోసారు. అట్లా అనేక ప్రాంతాలతో, భాషలతో, సంస్కృతులతో విలసిల్లిన భారత ఖండాన్ని 'ఏక'సంస్కృతిగా, బ్రాహ్మణీయ భావజాలాన్ని ఉమ్మడి సంస్కృతిగా భావించడానికి స్త్రీల అంశం ఇరుసైంది. ఇదే భారతదేశంలో నూతన (ఆధునిక) పురుషుని పుట్టుకకు నేపథ్యమైంది. మరింత స్పష్టంగా చెప్పాలంటే వలసవాదులకి స్త్రీల అంశం (సతి) స్థానికులను పాలించేందుకైనా, ఉద్ధరించేందుకైనా తామే సమర్థులమని చెప్పుకునే అవకాశమైతే, జాతీయవాదులకు తమ 'పరువు' కాపాడుకునే అంశమైంది. ఈ క్రమంలో బ్రిటిష్ పాలకులు 'సతి'ని సెన్సేషన్ కింద మారుస్తే, జాతీయవాదులు భారతీయ 'సంస్కృతి'లో స్త్రీల గొప్పదనానికి నీరాజనాలు పట్టే ధోరణిని ఎంచుకున్నారు. ఈ నేపథ్యంలో సతి నిషేధం, బాల్యవివాహాల రద్దు, వితంతు పునర్వివాహం వెం? అంశాలను 'సంస్కరణవాదం' ప్రతిపాదిస్తే, జాతీయవాదం వేదకాలంలో భారతీయ స్త్రీల ఉన్నత స్థితిని చూపే 'నాస్టాల్జియా'ని ప్రకటించింది. రామ్మోహన్ రాయ్, ఈశ్వరచంద్ర వంటి సంస్కర్తలు సైతం స్త్రీల అంశాన్ని కేంద్రంగా తీసుకొని ఉద్యమాలు చేసినప్పటికీ వితంతు వివాహాలు, సతి రద్దు వంటి సంస్కరణలకు మాత్రమే పరిమితమయ్యారనీ, 'పాతివ్రత్యం' వంటి బ్రాహ్మణీయ భావనలను కనీస చర్చలోకి తీసుకురాలేదని 'Feminism and nationalism in the third world' అనే రచనలో కుమారి జయవర్ధనే ప్రస్తావించడాన్నిబట్టి ఆధునిక పురుషులపై బ్రాహ్మణీయ పితృస్వామ్య భావజాలానికున్న పట్టు అర్థమౌతుంది.

ఈ పై ధోరణులకు ప్రతినిధులుగా తెలుగు ప్రాంతాల్లో సైతం ఎందరో కన్పిస్తారు. 'సంస్కరణవాదిగా' వీరేశలింగం పంతులుగారు 'సత్యవతి చరిత్ర' అనే తన వ్యంగ్యరచనలో 'సతి'ని గర్హిస్తారు.స్త్రీల ఆ దుస్థితికి పెళ్ళే పరిష్కారమని తేల్చారు . వితంతు పునర్వివాహాన్నిప్రోత్సహించారు. వెన్నెలకంటి సుబ్బారావుగారు తన స్వీయచరిత్రలో '1822లో సతిని చూసా'నని చేసిన ప్రస్తావన 'కేవల ప్రేక్షకులుగా' మారిపోయిన జనసందోహానికి సూచిగా కన్పిస్తుంది. "కాపు కోడలు కామమ్మ కలియుగాన సాగుమానము చేసిన సచ్చరిత్రను" తలపోసిన బసవరాజు అప్పారావుగారి మాటల్లో 'జాతీయవాదం' తొంగిచూస్తుంది. సరిగ్గా ఈ జాతీయవాదానికి కొనసాగింపుగా బిరుదురాజు రామరాజుగారు కామమ్మ కథని విశ్లేషించడం చూడొచ్చు. అందుకే చారిత్రక సంఘటనలను పూసగుచ్చినట్టు చెప్పిన గాథలయినప్పటికీ కామమ్మ కథ, సన్యాసమ్మ కథ మొదలైన గాథలను చారిత్రక గేయాలుగా గాకుండా కరుణరస గేయాలుగా పరిచయం చేస్తారాయన. ప్రాంత నామాలూ, వలస ప్రభుత్వ చట్టాలే గాక 1786లో గవర్నర్ గా ఉన్న వాలిస్ నీ (ఈయన విగ్రహం ఇప్పటికీ చెన్నై పరేడ్ గ్రౌండ్స్ లో ఉంది), 1790లో మద్రాస్ గవర్నర్ జనరల్ గా ఉన్న మెడోస్ వంటి బ్రిటిష్ అధికారుల (పెద్దదొరల) ప్రస్తావనలు ఉన్నప్పటికీ ఈ పేరంటాలి గాథలోని చారిత్రకతను అంగీకరించడానికి రామరాజుగారిలోని 'జాతీయవాదం' అడ్డుపడిందనిపిస్తుంది. 18వ శతాబ్దపు చివరి రోజుల, ఆధునిక శతాబ్దపు తొలి రోజుల లోని సంచలనాలను రికార్డు చేసిన పేరంటాళ్ళ గాథలను కరుణరస గేయాలుగా జమకట్టడంవల్ల వాటిని కల్పితగాథలుగా (అస్పష్ట చారిత్రక గేయాలుగా) చెప్పకుండానే చెప్పినట్లయింది. అట్లా స్త్రీలపై హింస చెలరేగిన ఆ సంధికాలాన్ని దాటవేసే వెసులుబాటును రామరాజు గారు ఎంచుకున్నట్టు తోస్తుంది. నిజానికి 'సహగమనం' తంతుని ఒకానొక ప్రత్యేక సంఘటనగా కూడా అనలేం. సామాజికమైన వ్యవస్థాగత హింసకీ, సమిష్టి హింసా ధోరణులకీ ప్రతిరూపం అది. స్త్రీలపట్ల విముఖతకు పరాకాష్ఠ. అంబేద్కర్ మాటల్లో చెప్పాలంటే "Indifferentism is the worst kind of disease that can affect people"

అనొచ్చు. సరిగ్గా స్త్రీల పట్ల అలాంటి విముఖతా ధోరణులూ, గతం పట్ల గుడ్డి ఆరాధన అప్పుడు పొడసూపిన జాతీయవాదంలో సైతం ప్రతిఫలించడం కన్పిస్తుంది.

ఈ నేపథ్యంలో "ఉత్తమ శీలము, త్యాగము, పాతివ్రత్యము మొదలగు సద్గుణములు తక్కువ కులములవారి యందు కూడా ఉండునని కామమ్మ కథ నిదర్శనమిచ్చుచున్నది" అన్న లక్ష్మీరంజనంగారి మాటల్లో కావచ్చు; "చంపుతున్న భర్త హస్తపు కరుణాస్పర్శను అభిలషించిన సాధ్వి – ఉదాత్త భారతీయ గృహిణికి సర్వకాలాల్లో ఉదాహరణంగా ఉండగలిగిన ఆమె" అంటూ భర్త చేతిలో హత్యకు గురిఅయిన లక్ష్మమ్మ గురించి అక్కిరాజు ఉమాకాంతంగారు చూపిన భావోద్వేగంలో కావచ్చు; "ఆమె సాహసము, సౌశీల్యము, పాతివ్రత్యము, త్యాగము మున్నగు గుణములు తెలుగుజాతికి గర్వకారణములు" అన్న రామరాజుగారి వ్యాఖ్యానాల్లో కావచ్చు విద్యావంతులైన తొలితరం పురుషులలోని నాస్టాల్జియా–జాతీయవాద ఛాయలు ప్రస్ఫుటంగా కన్పిస్తే. చరిత్రలోని ఆనాటి ఆ చీకటి కాలాన్నీ, స్త్రీల జీవితం / మరణంలోని హింసనీ, బ్రాహ్మణీయ పితృస్వామ్య భావనలా, వలసవాద విముఖతా ధోరణులా కలగలుపుగా మొదలైన 'ఆధునిక' పురుషుల జాతీయవాదాన్నీ చర్చకు పెట్టపోవడం వల్ల జరిగిన నష్టం అపారమైనది. ఇప్పటికీ కొనసాగుతున్న స్త్రీలపై హింసే అందుకు దాఖలా. 'సతి' (సహగమనం) గతించిన చరిత్రే కావచ్చు. కానీ ఆచారాల పేరుతో స్త్రీలపై అమలవుతున్న కట్టడిలో ఆనాటి హింస కొనసాగుతూనే ఉంది. అంతేకాదు, సామర్లకోటలో ఉన్న కామమ్మ గుడి కావచ్చు, కోస్తా ప్రాంతంలో ఇప్పటికీ సంక్రాంతి రెండో రోజు పట్టే బొమ్మల నోము (సావిత్రీ / గౌరినోము)ను పేరంటాలుగా పూజించే అలవాట్లలో కావచ్చు ఆనాటి సంఘటనల ఆనవాళ్ళు ఇప్పటికీ కన్పిస్తాయి. అయితే క్రమంగా 'కామమ్మ గుడి' లో కామమ్మ నామమాత్రంగా మిగిలిపోయి, గ్రామదేవతగా, ఆపైన 'ముక్కోటి దేవతల' బ్రాహ్మణీయ సంస్కృతిలోకి పునర్ విలీనం (re-absorption) చెంది 'కామాక్షి'గా రూపాంతరించడాన్ని సైతం ఊహించగలం. "లక్ష్మీ అమ్మవారుగా పల్నాడు వీరభూమిలో లక్ష్మమ్మ మహత్యాన్ని ప్రదర్శిస్తోంది" అన్న అక్కిరాజుగారి మాటలే అందుకు సూచన. ఇట్లా మొదలైన చోటికే కామమ్మ జీవితం తిరిగి చేరుకోవడంలోని విషాదం ఆమె ఒక్కదానిదే కాదు. అత్యాధునిక యుగంలోనూ భావజాల ఉచ్చులో చిక్కుకున్న స్త్రీలందరిదీ కూడా. త్యాగాన్ని ధర్మంగా చిత్రించి స్త్రీల ఉనికినే రద్దు చేసిన ఆనాటి 'సతి' సంఘటనలు ప్రస్తుతం 'పరువు' పేరున కన్నబిడ్డల్ని బలి ఇస్తున్న సందర్భాల్లో పునరావృతం అవుతూ ఉండటం చూస్తూనే ఉన్నాం.

ఈ క్రమాన్ని బద్దలు కొట్టాలంటే చరిత్రను తవ్వితీసి విమర్శకు పెట్టాల్సి ఉంటుంది. సంప్రదాయంగా స్థిరపడిన భావనల మంచి చెడులను తరచి చూడాల్సి ఉంటుంది. చరిత్రలో గల్లంతైన 'సామాన్యుల' గొంతుకలను వినాల్సి ఉంటుంది. అందుకు జానపదసాహిత్య అధ్యయనం తప్పనిసరి అవుతుంది. అందుకు తొలి అడుగుగా జానపద సాహిత్యాన్ని అమాయక 'ముగ్ధ' సాహిత్యంగా అంచనావేసే ధోరణులను మార్చుకోవాల్సి ఉంటుంది. మౌఖిక సాహిత్యంలో మణిగిన బహుళ గొంతుకలను వినాల్సి ఉంటుంది. ఆ దిశగా నేను చేసిన చిన్న ప్రయత్నమిది. 'సహగమన' తంతు గురించి పూర్వాధునిక చరిత్రలో అక్కడక్కడ కన్పించిన ప్రస్తావనల దగ్గర్నుంచి కొత్తపాతల సంధియుగం నాటికి 'ఆచారం'గా ప్రబలి, 'ఆధునికత'లోకి అడుగు పెడుతున్న మద్రాసు ప్రెసిడెన్సీలోని కోస్తాంధ్ర తీరాన్ని తాకిన పరిణామం వెనుక పనిచేసిన భావజాలపరమైన, చారిత్రక, ఆర్థిక, రాజకీయపరమైన నేపథ్యాలను 'కామమ్మ కథ' కేంద్రంగా స్పృశిస్తూ, ఈనాటికీ కొనసాగుతున్న స్త్రీలపై హింసకి మూలాలను వెదికే క్రమాన్ని ప్రధానంగా ఎంచుకున్నాను. అందువల్ల నూతన (ఆధునిక) పురుషుని పుట్టుక–జాతీయవాదం గురించిన సూచనామాత్ర ప్రతిపాదనలతోనే నేను సరిపెట్టుకోవాల్సి వచ్చిందని చదువరులు గమనిస్తారని ఆశిస్తున్న.

చివరగా మరొక్క మాట– ఉస్మానియా యూనివర్సిటీ తెలుగుశాఖ నుంచి వెలువడిన తొలి సిద్ధాంత గ్రంథంగా 'జానపదగేయ సాహిత్యము' అన్న రామరాజుగారి పుస్తకం ప్రత్యేకమైంది. పన్నెండు అధ్యాయాలుగా పాటలను వింగడించి పాటలను నామమాత్రంగా ఉటంకిస్తూ విశ్లేషణే ప్రధానంగా సాగిన రచన ఇది. అప్పుడు తానున్న సందర్భంలో జానపదగేయాలను విస్తృతంగా పరిచయం చేయాలనే ఆరాటంలోంచి రామరాజుగారు ఆ పద్ధతిని ఎంచుకున్నారనిపిస్తుంది. అయితే పాటల పూర్తిపాఠాలు (టెక్స్ట్) లేకపోవడమన్నది పరిశోధకులకు మాత్రం పెద్ద లోటే. మలి ముద్రణల్లోనైనా ఆ లోటును భర్తీ చేసి ఉంటే బాగుండేది. కనీసం ఇప్పటికైనా భావితరాల పరిశోధకులను దృష్టిలో ఉంచుకొని వర్తమాన పరిశోధకులెవరైనా రామరాజుగారు అప్పట్లో రికార్డు చేసిన / రాసుకున్న పాటల పూర్తి పాఠాలను సేకరించి ప్రకటించ గలిగితే బాగుంటుందని సూచిస్తూ.. ఈ వ్యాసం తుది రూపానికి రావడానికి నాకు తోడుగా నిల్చిన తమ్ముడు డా.ఎస్. చంద్రయ్యకి ధన్యవాదాలు తెల్పుకుంటున్న.

(ఈ వ్యాసంలో ప్రతిపాదించిన విశ్లేషణలకు ఆధారాలను డా. బి. అంబేద్కర్, డి.డి. కోశాంబి, గాయత్రీ చక్రవర్తి స్పివాక్, వీణా మజుందార్, కిరణ్ నారాయణ్, వి. నారాయణరావు, నందిరాజు చలపతిరావు, శ్రీపాద గోపాల కృష్ణమూర్తి, మంగు రంగనాథరావు, నాయని కృష్ణకుమారి, బిరుదురాజు రామరాజు, ఆర్ .హరగోపాల్, నందినీ గుప్త, ప్రేమ్ కుమార్ విజయన్, డా. నారాయణప్ప, దేవేంద్ర సత్యార్థి, ఎం.వి. క్రిష్ణయ్య, శ్రీ పద్మ, వి. లలిత, గురజాడ, రామ్మోహన్ రాయ్, గాంధీ, నెహ్రూ, పూలే మొదలైనవారి రచనల నుంచి సేకరించాను).

**రచయిత: అధ్యాపకులు, దక్షిణాసియా భాషా సంస్కృతుల అధ్యయన కేంద్రం**

సాహిత్య
పరిశోధన

# గీతాంజలి కథలు-ఉర్దూ పదప్రయోగ ఔచిత్యం

ఎన్.సుభాషిణి

"ఔరత్ కా కామీ హే బచ్చేన్ కో పైదా కర్నా" (ఆడదాని పని పిల్లల్ని కనడమే) పెహెచాన్ కథా సంపుటిలోని ఔలాద్ కథలోని పై వాక్యం కర్కశంగా గుండెల్లోకి తుపాకి గుండులా దూసుకు పోతుంది. సమాజంలో స్త్రీ స్థానాన్ని, స్త్రీవాద ఆవశ్యకతను, సమాజ మూలాలలో దిగబడిపోయిన భావజాలాన్ని పెకిలించి పారేయాల్సిన సందర్భాన్ని గుర్తుచేసే వాక్యం. ఇంటా, బయట భద్రత లేని స్త్రీల జీవితాల్లో అనునిత్యం చోటుచేసుకుంటున్న హింస చుట్టూ అల్లిన గీతాంజలి కథల నేపథ్యం గమనిస్తే, చాలా కథలు హైదరాబాద్ పాతబస్తీ ముస్లిం జీవితాల ప్రతిఫలనాలే. నల్లని బురఖాలలో దిగులు మేఘాల లాగా కదిలి వచ్చిన ముస్లిం మహిళలు వేదనను కన్నీటి వర్షంలో కురిపించి పోతే, తడిసి ముద్దయిపోయిన రచయిత్రి అంతరంగ మధనం నుండి వెలువడిన నిప్పు కణికలు ఈ కథలు. పరిణామ క్రమంలో సమాజం మానవీకరణ చెందడానికి బదులు, పశు త్వం వైపు పయనిస్తుండడం రచయిత్రిని కలవరపరిచింది. ఆమె కలం కదిలి, అక్షరమై కథ మన ముందు నిలిచింది.

ముస్లిం జీవితాలను అక్షరీకరించే క్రమంలో ఉర్దూ భాషా పదాలు ప్రధానంగా హైదరాబాది ఉర్దూ (దక్కనీ) వాడకం కథల్లో ఎక్కువగా చూస్తాం. దీనికి ప్రధాన కారణం గీతాంజలి ఆ ప్రాంతంలో స్త్రీ రోగనిపుణురాలైన డాక్టర్గా, సెక్సాలజిస్ట్గా పని చేయడమే. వృత్తిరీత్యా రోగులకు చికిత్సను అందించేటప్పుడు వారి శారీరక గాయాలతో పాటు మానసిక గాయాలను పరిశీలించి వారికి అండగా నిలిచింది. ఆ కన్నీటి కథలకు చలించి, రాయకుండా నిలువ లేని ఒక మానసిక స్థితిలోకి తనను తాను నెట్టేసుకున్న మనిషి గీతాంజలి. ఆమె కథలు చూస్తే ఆమె అంతఃకల్లోలం తెలుస్తుంది.

భావోద్వేగాలను సమర్థవంతంగా వ్యక్తం చేయగలమాధ్యమం నిస్సందేహంగా మాతృభాషే. గుండెలోంచి ఉబికి వచ్చే కన్నీటి లావాకి పరాయి భాషను అడ్డడం సమంజసమా? అణిచివేతకు గురైన దిగువ తరగతి ముస్లిం స్త్రీలు, పేదరికంతో పాటు సామాజిక కట్టుబాట్ల బానిస సంకెళ్లను తెంచుకోలేక అత్యంత వేదనామయ జీవితాన్ని అనుభవిస్తున్నారు. వారి గాయాలను అక్షరీకరించే క్రమంలో, కొన్నిసార్లు తన రచనకు ఎంచుకున్న మాధ్యమం తెలుగు అనే ప్రాథమిక సత్యాన్ని మరిచే వివశత్వం గీతాంజలిలో కనిపిస్తుందా అంటే, అవుననే సమాధానం చెప్పాల్సి వస్తుంది.

గీతాంజలి కథలు ముస్లిం సమాజాన్ని, ప్రధానంగా పేదరికంలో మగ్గుతున్న స్త్రీలు వివాహ వ్యవస్థలో ఎదుర్కొన్న హింసపై ఎక్కుపెట్టబడ్డ శరాలు. అందుకేనేమో ఈ కథల్లో ఎక్కువగా ఉర్దూ పదాలు, వాక్యాలు వాడినారు. ఈ వ్యాసంలో గీతాంజలి తన కథల్లో ఉర్దూ పదాలను వాడిన తీరు, వాడుకలోని ఔచిత్యాలను చర్చించడానికి ఈ క్రింది విధంగా విభజించుకొని పరిశీలించబడింది.

**వాక్యాలు**

1. ఉర్దూ మాతృభాషగా గల పాత్రల మధ్య సంభాషణల్లో భాషా ప్రయోగం

అ. పూర్తి ఉర్దూలో జరిగిన సంభాషణలు

ఆ. తెలుగు ఉర్దూలో జరిగిన సంభాషణలు

ఇ. దాదాపు తెలుగులో జరిగిన సంభాషణలు

2. ఉర్దూ మాతృభాషగా గల పాత్ర నేరేట్ చేస్తున్న సందర్భంలో భాషా ప్రయోగం (ఎదుట ఎవరూ లేనప్పుడు/ పాఠకులతో)

అ. పూర్తి ఉర్దూ మాటలు

ఆ. తెలుగు ఉర్దూ కలగలిపిన మాటలు

ఇ. దాదాపు తెలుగులో జరిగిన మాటలు

3. తెలుగు మాట్లాడే పాత్ర ఉర్దూ మాట్లాడే పాత్రతో సంభాషిస్తున్న సందర్భంలో భాషా ప్రయోగం

అ. పూర్తి ఉర్దూలో సంభాషణలు

ఆ. తెలుగు ఉర్దూ కలిసిన సంభాషణలు

ఇ. దాదాపు తెలుగులో సంభాషణలు

4. తెలుగు మాట్లాడే పాత్ర నేరేట్ చేస్తున్న సందర్భంలో భాషా ప్రయోగం (ఇది దాదాపు రచయిత్రి అనగా డాక్టర్

వాయిస్)

అ. ఉర్దూ పదాలను ఉపయోగిస్తూ తెలుగు వాక్యాలు

ఆ. పూర్తి తెలుగు వాక్యాలు

**వివిధ సందర్భాలలో ఉర్దూ పదాల ప్రయోగం**

1. నిత్య వ్యవహారం అనగా అన్యదేశ్యాలుగా తెలుగులో చేరిన ఉర్దూ పదాలు

2. నిత్య వ్యవహారంలో లేని తెలుగు వారికి ప్రత్యేక పరిచయం లేని ఉర్దూ పదాలు

3. ముస్లిం సంస్కృతిని ప్రతిబింబించే ప్రత్యేక పదాలు

**1.అ. ఉర్దూ మాతృభాషగా గల పాత్రల మధ్య పూర్తి ఉర్దూలో జరిగిన సంభాషణలు :-**

'సాస్ లేనీకో దమ్ నహి హే తెరేకో ' (ఊపిరి తీసుకోవడానికి కూడా బలం లేదు నీకు...) పెహచాన్ కథా సంపుటిలో ఉనో నహి మాన్తే కథలోనిది ఈ వాక్యం. నూరునిసా పదవసారి గర్భవతి. పెద్దబిడ్డ మునిరాతో పాటు తాను కూడా గర్భిణిగా ఉండడం సహించలేకపోయింది. ఆపరేషన్ వద్దు అనే తన భర్త సులేమాన్‌పై విరుచుకుపడిన సందర్భంలోని వాక్యం ఇది. ఇక్కడ నూరునిసా తీవ్ర భావోద్వేగం యథాతథంగా వ్యక్తం అవ్వాలి. కథలో సంభాషణ జరిపే రెండు పాత్రలు ముస్లిం పాత్రలే. కాబట్టి ఉర్దూలనే మాట్లాడించడం సమంజసం అని రచయిత్రి భావించినట్లు తెలుస్తుంది. ఊపిరి తీసుకోవడానికి కూడా బలం లేని అనారోగ్య పరిస్థితులలో కూడా ఇంకా బిడ్డలు కనాలనుకోవడం నూరునిస ఆవేదనకు కారణం.

"నక్కో మెరెసే నై హెూతా, జిసమ్మే బిల్కుల్ ఖువ్వత్ నై. బచ్చేదాని సాఫ్ కర్కో, బచ్చే నై హెూనేక ఆపరేషన్ కర్లుంగి."(ఇక వద్దు నావల్ల కాదు ఒంట్లో కొంచెం కూడా బలం లేదు పిల్లల సంచి శుభ్రం చేయించుకుని (అబార్షన్) పిల్లలు కాకుండా (కుటుంబ నియంత్రణ) ఆపరేషన్ చేపించుకుంటాను) పెహచాన్ కథా సంపుటిలో 'ఉనో నహి మాన్తే' కథలోనిది ఈ వాక్యం.

నూరునిస తన భర్త అయిన సులేమాన్తో మాట్లాడినట్టు ఇంత పెద్ద ఉర్దూ వాక్యాన్ని రచయిత్రి ప్రయోగించారు. ఇటువంటి దీర్ఘ వాక్యాలను ప్రయోగించే ముందు రచయిత్రి ఏం ఆలోచించి ఉంటారు. పాత్ర మనోవేదన అంత సంఘర్షణ శక్తివంతంగా వ్యక్తీకరించాలంటే ఆ పాత్ర మాతృభాషే సరైన సాధనమనా? లేక తెలంగాణ సమాజంలో అంతర్భాగమైన ముస్లిం సమాజాన్ని అర్థం చేసుకోకపోతే, ముస్లిం సామాజిక, చారిత్రక భూమికను ఎత్తి పట్టకపోతే తెలంగాణ సాహిత్యం పరిపుష్టం కాదనా? ఒకవేళ రచయిత ఉద్దేశ్యం మొదటిదే అయితే పాత్రలు తమ మాతృభాష అయిన ఉర్దూలో మాట్లాడినా, చదివే తెలుగు పాఠకుల సౌలభ్యం కొరకు ఆ సంభాషణలు, మాటల తెలుగు సేతను బ్రాకెట్లో పక్కనే ఇవ్వడం చాలా అవసరం. అప్పుడు పాత్రల మనోభావాలను సగటు తెలుగు పాఠకుడు సులువుగా అర్థం చేసుకునే వీలుంది.లేకపోతే పాఠ్యం అర్థం కాక రచన పై ఆసక్తి కోల్పోయే ప్రమాదం కూడా ఉంది.

"ఏ రండి కో దోదిన్ తలక్ ఖానా నకోదేవ్..." (ఈ ముండ కి రెండు రోజులు తిండి పెట్టకు) పెహచాన్ 'జహనుమా గల్లీ నంబర్ దో' కథలోని వాక్యమిది. మల్లెపువ్వు లాంటి యాస్మిన్‌ను మాయ మాటలు చెప్పి అరబ్ షేక్ కి ఇచ్చి వివాహం జరిపిస్తాడు ఖాజీ. ఆ అరబ్ షేక్ తన దేశం తీసుకెళ్లి తాను, తన కొడుకులు వావివరస లేకుండా యాస్మిన్ శరీరంపై సాగించిన హింసలను వర్ణిస్తున్న సందర్భంలోనిది ఈ వాక్యం. 'ఈ ముండకు రెండు రోజుల దాకా తిండి పెట్టకండి.' అంటూ తన మొదటి రెండవ భార్యలతో అరబ్ షేక్ చెప్తుంటాడు. ఆ తీవ్రత పాఠకునికి చేరాలంటే ఉర్దూ వాక్యమే శరణ్యమా, తెలుగు సేత కూడా ప్రభావవంతంగానే ఉందా, అనేది గమనించవలసిన అంశం.

"సాబ్ భూక్ లగ్తే హై, జఙ్జీ సే హూ, జరా తరస్ ఖావ్" (అయ్యా ఆకలయితుంది. కడుపుతో ఉన్నాను. కొంచెం దయ చూపండి)

'అబ్బా మై రషీదా హూ' కథలో కాజీల మోసాలకు బలై దేశాలు పట్టి బిచ్చగత్తెగా మారిన రషీదా, తన సొంత ఇంటికి, అమ్మా నాన్నల దగ్గరికి పోవడానికి డబ్బులు లేక, నిండు గర్భంతో రైల్వేస్టేషన్లో అడుక్కు తినే సందర్భం. పాత్ర దైన్యత, పెద్దగా విద్యాబుద్ధులు లేకపోవడం, 19 ఏళ్ల చిన్న వయసులోనే అనుభవించిన నరకం, ఇవన్నీ పై వాక్యంలో చూపించడానికి రచయిత్రి పాత్ర మాతృభాషను యథాతథంగా వాడినట్లు తెలుస్తుంది. ఈ వాక్యానికి తెలుగు అర్థం కూడా పక్కనే బ్రాకెట్లో రాసి ఉండడం చూస్తాం. ఈ విధంగా తెలుగు అర్థం ఇవ్వడం చాలా తక్కువగా కనిపిస్తుంది.

1.ఆ. ఉర్దూ మాతృభాషగా గల పాత్రల మధ్య తెలుగు ఉర్దూ కలగలిసిన సంభాషణలు:-

అరే నీ భేటీ ఏమన్నా దూద్ పీతీ బచ్చీనా ఏందీ? ఇంక నీ మర్జీ నీ బీవీ మర్జీ"

(అరే నీ బిడ్డ ఏమన్నా పాలు తాగే పసిపిల్లనా? ఇక నీ ఇష్టం, నీ భార్య ఇష్టం!)

పెహచాన్ 'జహనుమా గల్లీ నంబర్ దో' కథలోని వాక్యమిది. కాజీ దుబాయ్ సేట్ల డబ్బుకి ఆశపడి అరబ్ షేక్‌లకు పిల్లనివ్వడానికి పాతబస్తీ పేద ముస్లిం తల్లిదండ్రులను ఎట్లా ఆశపెట్టి లోబరుచుకుంటారో తెలియజేసే సందర్భం. మతిన్, ఫాతిమా బేగంల బిడ్డ యాస్మిన్‌కు షేక్ ఉమర్ సంబంధం తీసుకొస్తాడు ఖాజీ. యాస్మిన్‌కి 18 ఏండ్లు. పెండ్లికొడుకుకు 55 ఏండ్ల దాకా వయసు ఉంటుందంట కదా అని మతీన్ అంటున్నప్పుడు, 'నీ బిడ్డ ఏమైనా పాలు తాకే పసిబిడ్డనా?వాళ్లకు లక్షలకు లక్షల ఆస్తి ఉంది. ఇప్పుడు లక్ష రూపాయలు ఇస్తారు. ఇదేగాక ఇంకా పంపుతానే ఉంటారు' అని ఖాజీ అంటున్నాడు. ఈ సందర్భంలో రచయిత్రి ఎందుకని పూర్తి ఉర్దూ పదాలు వాడకుండా తెలుగు ఉర్దూ కలగలుపు భాషలు ఉపయోగించి ఉంటారు. పాత్రల ఆక్రోశం, ఆవేదన, ఆర్తి వెలిగక్కేటప్పుడు అనివార్యమైన మాతృభాష (ఉర్దూ) ఇక్కడ అవసరం అనిపించకపోవడమే కారణమై ఉంటుందా అంటే అవుననే అంటారు గీతాంజలి.

అదేవిధంగా "హరాం జాదే! నువ్వు ఎంతన్న చెప్పు, మదర్సాలా ఇంగ్లీషు చదువులు వీళ్ళ తరక్కీలకు పనికొచ్చేది ఉంటే!" సభా సవేరా కథలో జుల్ఫికర్ తన కొడుకు అక్తర్తో మాట్లాడుతున్నాడు. ఇద్దరు ముస్లింలు మాట్లాడుకునే సందర్భంలో ఈ సంభాషణ దాదాపు తెలుగులో ఎందుకు వచ్చినట్టు? ఇక్కడ భావోద్వేగ వ్యక్తీకరణ కాకుండా, వారి సామాజిక స్థితి గతికి కారణాలను విశ్లేషించే ప్రయత్నం జరుగుతున్నప్పుడు అది ఖచ్చితంగా సగటు పాఠకునికి తెలియాలి. లేకుంటే రచన ఉద్దేశ్యం దెబ్బతింటుంది. అందువల్ల ఈ సంభాషణ రచయిత దాదాపు తెలుగులో నడిపించి ఉంటుందని తెలుస్తుంది.

1.ఇ. ఉర్దూ మాతృభాషగా గల పాత్రలు – తెలుగు సంభాషణలు:–

1. "లేదు డాక్టరమ్మ మా అబ్బా ఒప్పుకోడు". ఉనో నహిమాన్తే కథ లోని వాక్యం.

2. కాపురం చేసేది లేకుంటే ఆపరేషన్ చేపించుకొని ఇంట్లోకెళ్లిపో. వేరే దాన్ని తెచ్చుకుంటా, అనేటోడు (మునిరా స్వగతం) ఉనో నహిమాన్తే కథ లోని వాక్యం.

3. "జఖంల కెళ్ళి రక్తం కారి పక్కులు కట్టినయ్. సాస్ జుట్టంత ఇగ్గి, ఇగ్గి, కొట్టింది" సభ సవేరా కథలోని వాక్యం.

4. ''జిందా తోనే ఉండేటోళ్ళో, ఖుద్ ఖుషీ చేసుకునేటోళ్ళో ఎవలకు తెలుసు?"

5. "ఆధీరాత్ మారో నక్కో అనుకుంటా"..

6. రిశ్తేదార్ల ముంగట బే ఇజ్జత్ ఐనట్టై అక్కా చెల్లెలు ఇద్దరు దర్వాజా దాటి బాహరి దున్యాలకు వచ్చుడు బంద్ పెట్టిర్రు.

7. "ఇసిత్రం ఏందంటే, ఆ జూలూస్ ల కొంతమంది ఔరత్ లు కూడ ఉన్నరు"

వివిధ కథలలో రాసిన పై వాక్యాలు ముస్లిం పాత్రలు పాఠకులతో చెప్పిన మాటలు (నరేషన్). ఇక్కడ జకం (గాయం), సాస్ (అత్త), జిందా (ప్రాణంతో, బతికున్న), ఖుద్ ఖుషి (ఆత్మహత్య), ఆదిరాత్ (అర్ధరాత్రి), మారోనక్కో (కొట్టొద్దు), రిశ్తేదార్లు (బంధువులు), బే ఇజ్జత్ (పరువు లేని), బాహరీ దునియా (బయటి ప్రపంచం), జూలూస్ (ఊరేగింపు), ఔరత్ (స్త్రీ) మొదలగు పదాలు మాత్రమే ఉర్దూ, వాక్యాలు పూర్తిగా తెలుగే.

"ఏం కావాలనుకుంటున్నావు భవిష్యత్తులో చెప్పు? డాక్టర్ అంజలి అస్రాని ప్రేమగా అడిగింది. బాగా చదువుకుంటా! నీలాగా డాక్టరమ్మ నవుతా!" అన్నది అస్రా పత్తర్ కథలో. అస్రా ముస్లిం అమ్మాయి. హై స్కూల్ చదువుతుంది. డాక్టర్ అంజలి తనతో చక్కగా తెలుగులో మాట్లాడింది. ఇటువంటి సంభాషణలు గీతాంజలి రచనల్లో అరుదుగా చూస్తాము. ఈ విధమైన వాక్య ప్రయోగం వల్ల ఇతివృత్తం పాఠకుని మనసులోకి సులువుగా చేరే అవకాశం ఉంది.

అనుచితంగా తోచే ఉర్దూ పద ప్రయోగం

"బిడ్డ తోని ఎవరో బురీ బర్తావ్ చేస్తున్నరు" (పత్తర్ కథ)

"పులి బోనులోబడ్డ పావురాయి లెక్క యాస్మిన్ హర్ రాత్ బలైపోవుడు మామూలైంది." (జహనుమా గల్లి నెంబర్ దో కథ)

గీతాంజలి కథల్లో, ఉర్దూ పద బంధాల వాడకం కొన్నిసార్లు అనుచితంగా అనిపించిన సందర్భాలు ఉన్నాయి. పూర్తి వాక్యం తెలుగులో రాసి, దాంట్లో కేవలం ఉపయోగించాలన్న ఉద్దేశంతో వాడినట్లు అనిపిస్తుంది, హర్ రాత్' అంటే 'ప్రతి రాత్రి'. ఈ వాక్యంలో 'హర్ రాత్' కి బదులుగా 'ప్రతి రాత్రి' అని వాడితే ఔచిత్యవంతంగా ఉంటుంది. అదేవిధంగా మొదటి ఉదాహరణలో 'బురీ బర్తావ్' అంటే 'చెడ్డ

పనులు /అసభ్య ప్రవర్తన' పద ప్రయోగము కూడా అంతే.

తెలంగాణాలో నిత్య వ్యవహారంలో ఉన్న ఉర్దూ పదాల ప్రయోగం

''అమ్మితోని ఎప్పుడు లడాయే, అమ్మి బుర్కా వేసుకోమని, తానేమో వేసుకోనని జిద్దు చేసేది'' కాలీ బదరియా కథలోని ఈ వాక్యంలో వాడిన లడాయి ( కొట్లాట), జిద్దు (హఠం) మొదలగు మాటలు తెలుగు భాషలో అన్య దేశ్యాలుగా చేరి, తెలంగాణాలో నిత్య వ్యవహారంలో ఉన్న పదాలు. ఇటువంటి ఉర్దూ పదాలను వాడటం వల్ల పాఠకులకు పెద్దగా అసౌకర్యం ఉండదు. ఈ పదాలు గీతాంజలి రచనల్లో కోకొల్లలు.

ఉదాహరణకు

నజర్ (చూపు/దిష్టి), ఇజ్జత్ (పరువు), ఆరాం (విశ్రాంతి), ఖదర్ (భయభక్తులు), గాయబ్ (మాయం), షికాయత్ (ఫిర్యాదు/చాడీ), గల్లీ (సందు), పరేషాన్ (చింత), చాయ్(తేనీరు), బగానా (వెళ్లగొట్టడం), బాడకావు (తిట్టు పదం), శరం (సిగ్గు), నవాబ్ (రాజు), గరీఫ్ (పేదవాడు), సమజ్ (అర్థం/ ఎరుక), సోపత్(స్నేహం), హౌష్ (స్పృహ), ఆవారా (పనికిమాలిన), ఫరక్ (తేడా), బిందాస్ (హాయిగా, ఏ బాధా లేకుండా), దావత్ (విందు), దోస్తీ (స్నేహం) మొదలగునవి.

వీటితోపాటు వాక్యాలలోనే కాకుండా విడిగా కూడా అనేక ఉర్దూ పదాలు ఈ రచనల్లో కనిపిస్తాయి

హమామ్ ఖానా (స్నానాల గది), హరాంకోర్ (నమ్మకద్రోహి), ఇలాజ్ (వైద్యం), ఖైరియత్ (క్షేమం), ఖబర్(వార్త), హైసియత్ (స్థాయి/హోదా), గరారా (ముస్లిం వివాహాలలో స్త్రీలు ధరించే వస్త్ర విశేషం), బద్నూ (దుర్వాసన), జేవరాత్, (నగలు) మొదలగునవి.

**హైదరాబాది ఉర్దూ (దక్కని) పదాలప్రయోగం:**

తెలుగు క్రియా పదాల చివరన 'ఇంచుడు' ప్రత్యయాన్ని చేర్చుట ద్వారా ఏర్పడిన పదాల ప్రయోగం కూడా ఈ రచనల్లో కనిపిస్తుంది.

ఉదాహరణకు:

బహకాయించుడు (ఉసిగొల్పుట)

బహకానాంఇంచుడు.

సొచాయించుడు (ఆలోచించుట)

సొంచ్ ఇంచుడు

ఇస్లాం సాంస్కృతిక ,ఆచార వ్యవహారాలను తెలిపే ఉర్దూ పదప్రయోగం :-

దువా (ప్రార్థన), ఫాతేహ (నైవేద్యం), న్యాజ్ (మొక్కు), దోఝక్ (నరకం), అల్లా (దైవం), మన్నత్ (కోరిక), మగరీబ్ నమాజ్ (సాయంకాలపు ప్రార్థన), ఇన్ష అల్లా (అల్లా తలిస్తే), జన్నత్ (స్వర్గం), రోజా (రంజాన్ పవిత్ర మాసంలో ఉండే ఉపవాసం) అజా (మజీద్ లో ప్రార్థనకు ఇచ్చే పిలుపు) మొదలగునవి.

దక్కని ఉర్దూ భాష మారుతున్న క్రమాన్ని గీతాంజలి తెలుగు కథలు చెబుతున్నాయి. ఒక తెలుగు రచయిత ఇన్ని ఉర్దూ పదాలు వాడాలా? అన్న శిల్ప చర్చని పక్కన పెడితే, ఒక తెలుగు రచయిత ఇన్ని ఉర్దూ పదాల్ని వాడక తప్పని పరిస్థితి ఎందుకు ఏర్పడిందో మనం ఆలోచించాలి. 20వ శతాబ్దంలో దక్కని ఉర్దూ సాహిత్యంలో, మౌఖిక సాహిత్యంలో కూడా అనేక తెలుగు పదాలు చేరాయి. భాషల మధ్య సాగుతున్న ఈ సంభాషణ పరస్పర మార్పిడి అని ఎలా చూడాలి? ఈ ఉర్దూ పదాల్ని తీసేస్తే గీతాంజలి కథలు ఎట్లా ఉంటాయి? ''దక్కనీ ఉర్దూ, ముస్లిం సంస్కృతి లేకుండా గీతాంజలి లేదు'' అంటారు పెహచాన్ ముందుమాటలో అఫ్సర్. తెలుగు కథల్లో ఉర్దూ పదజాలాన్ని కథా ఔచిత్యం మేర తీసుకున్నా, అనవసరమైన చోట పరిహరిస్తూ, అవసరమైన చోట ఆ ఉర్దూ పదాలు, వాక్యాలకు అర్థాన్ని పక్కనే బ్రాకెట్లో ఇస్తే కథ మరింత సులువుగా పాఠకులను చేరగలదు.

**ఆధారగ్రంథాలు :**


1. పెహచాన్ కథా సంకలనం గీతాంజలి
2. బచ్చేదాని కథా సంకలనం గీతాంజలి.
3. తెలుగులో అన్యదేశాలు (వ్యాసం) డాక్టర్ జాడ సీతాపతి రావు
4. కన్యాశుల్కంలో ఉర్దూ భాష పదప్రయోగాలు (వ్యాసం)ఏ.వాహిద్
5. కే గోపాలకృష్ణారావు తెలుగు భాష పై ఉర్దూ, పారశీకముల ప్రభావం
6. తెలుగువారు పలికే ఉర్దూ పదాలు (బ్లాగు) రెహమతుల్లా బ్లాగ్ స్పాట్. 18.07.2012



**★ రచయిత: తెలుగు అధ్యాపకులు ఎం.వి.ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మహబూబ్‌నగర్**

సాహిత్య పరిశోధన

# మెదక్ జిల్లా సాహిత్య చరిత్ర

డా.వి.వెంకటేశ్

## 0. పరిచయం

సాహిత్యం సామాజిక చైతన్య నిష్పన్న రూపం. సామాజిక పరిణామ క్రమంలో గతానుగతికంగా సాగిపోయే అనేక ఘటనల క్రమాలను సాహిత్యం స్వీకరిస్తుంది. ఈ సూత్రీకరణ ఆధునిక సమాజాల సాహిత్యానికి అతికినట్లు అన్వయిస్తుంది. మెదక్ జిల్లా తెలంగాణలో భాగంగా ఉన్నది. సామాజిక పరిణామ క్రమంలో భారతదేశం, అందులో భాగంగా ఉన్న తెలంగాణ అనేక మార్పులకు లోనవుతూ వస్తున్నది. ఆ మార్పులు అన్నిచోట్ల ఒకే విధంగా, ఒకే క్రమంలో జరిగినవి కావు. తెలంగాణ జిల్లాలతో పాటు మరట్వాడా, కర్ణాటక జిల్లాలలోని కొంత ప్రాంతం నిజాం పాలనలో ఉంటే, ఆంధ్ర, రాయలసీమ జిల్లాలు ఆంగ్లేయుల పాలనలో ఉన్నవి. దీని కారణంగా తెలుగు ప్రజలు ప్రధానంగా నివసించే ఈ ప్రాంతాలు భిన్నమైన సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాహిత్య, సాంస్కృతిక వైవిధ్యాన్ని కలిగి ఉన్నాయి. ఆంగ్లేయ పాలన రద్దు కావాలని, స్వయం పాలనకోసం సాగిన భారత స్వాతంత్ర్య సంగ్రామంలో ఆంగ్లేయ పాలిత ప్రాంతాలతో పాటు నైజాం పాలిత ప్రాంతాలు పాల్గొన్నాయి. కారణం నైజాం ప్రత్యక్ష పాలకుడు కానీ, అతడిని నడిపించినది మాత్రం ఆంగ్లేయ ప్రభుత్వమే. ఈ రాజకీయార్థిక జీవితం బుద్ధిజీవులకు అర్థమైనంతగా ఇతరులకు అర్థమయ్యే అవకాశం లేదు. కవులు, కళాకారులు నిత్యం సమాజాన్ని చూస్తే, అందులో వస్తున్న మార్పులకు చైతన్యశీలమైన వ్యక్తీకరణలు చేస్తారు. అది ఏ కాలంలోనైనా కావచ్చు. "పదార్థం నిరంతరం చలనంలో ఉన్నట్టే సాహిత్యం సైతం చలనంలో ఉంటుంది. చలనశీలత లేని సాహిత్యం నశించినట్టే. స్థూలంగా చెప్పుకోవాలంటే చలనం అంటే మార్పు. సాహిత్య చలనం అంటే పరిణామం. ఒకస్థితి నుంచి మరోస్థితిలోకి ఎల్లప్పుడూ కదులుతూ ఉండటం."[1] నిరంతరం మెదక్ జిల్లా సాహిత్యం కూడా మొదటినుంచి చలనంలో ఉంటూనే సామాజిక పరిణామ క్రమంలో అనేక మార్పులకు లోనవుతూ వచ్చింది.

అనేక చారిత్రక సంఘర్షణల మధ్య, అనేకానేక ఆక్రమణల మధ్య తన అస్థిత్వాన్ని కాపాడుకున్న ప్రాంతం మెతుకుసీమ. ఇది జిల్లా విలక్షణకు సంకేతం. "మెదక్ జిల్లాలో అగుపించినంత వైవిధ్యకరమైన అంశాలు చాలా ప్రాంతాల్లో అరుదుగా కన్పిస్తాయి."[2] మిగతా ప్రాంతాలతో పోల్చి చూసినప్పుడు మెదక్ జిల్లా చారిత్రకంగా, సామాజికంగా, రాజకీయంగా, సాంస్కృతికంగా, సాహిత్యపరంగా ప్రత్యేకతను కలిగి ఉంది. మెదక్ జిల్లా ప్రత్యేకతను దాశరథి తన కవిత్వంలో కూడా ప్రస్తావించారు.

ఉద్యమాలకు పురిటిగడ్డగా చెప్పుకునే మెదక్ జిల్లా సాహిత్యంలో సైతం తనకంటూ ఒక ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకుంది. తొలి కథకు(బృహత్కథ)శ్రీకారం చుట్టింది మెతుకు సీమనే. తొలికథకు ఆద్యుడుగా గుణాఢ్యుడు చరిత్రకెక్కాడు. తెలుగులో తొలి తెలుగుకావ్యం (యయాతిచరిత్ర)రాసిన పొన్నగంటి తెలగన్న ఈ జిల్లావాడే. సంస్కృత కావ్యాలు అర్థంకాని రీతిలో ఉన్నాయని వాటికి వ్యాఖ్యానం రాసి వాళ్ళ శక్తిని ప్రపంచానికి చాటిన మహనీయుడు మల్లినాథుడు మెతుకుసీమ కన్న బిడ్డడె. తెలంగాణలో అంతర్భాగమైన మెదక్ జిల్లాకు ప్రత్యేక స్థానం ఉన్నప్పటికినీ జిల్లా సాహిత్య చరిత్రని పరిశీలించినపుడు వెలుగులోకిరాని కవులు, రచయితలెందరో ఉన్నారు.

## 1. మెదక్ జిల్లా పూర్వ కవులు - సాహిత్యం

తెలంగాణలో అంతర్భాగంగా ఉన్న మెదక్ జిల్లాలో విలసిల్లిన సాహిత్యానికి ప్రత్యేకమైన చరిత్ర ఉంది. తెలుగు సాహిత్యంలోని శిఖరాయమాణులైన కవులెందరో మెదక్ జిల్లాని పునీతం చేసినవారే. జిల్లాకు అఖండ ఖ్యాతినర్జించి పెట్టినవారిలో మొదటి వరుసలో చెప్పుకోదగిన వాడు, క్రీ.పూ.200-150 ప్రాంతానికి చెందినవాడు,"వ్యాస వాల్మీకుల సరసన చేర్చదగిన మహాకవి గుణాఢ్యుడు. మెదక్ జిల్లా కొండాపురంలో ఉండి 'బృహత్కథ' ను రచించి తెలంగాణా మొదటి లిఖిత కవి"[3]గా సాహితీ చరిత్రలో సుస్థిర స్థానం సంపాదించుకున్నాడు. "ఆంధ్ర వాఙ్మయమున ప్రప్రథమ గ్రంథమును సకల కథా ప్రపంచమునకు మూలమైన గుణాఢ్యకృత బృహత్కథారచన కొండాపురమున జరిగింది. ఇదే గాథా సప్తశతిలోని గాథలకు ఆధారమైనది."[4] గుణాఢ్యుడు రాసిన ఈ గ్రంథ ప్రభావం తర్వాతి కాలంలో అనేక నాటకాల, కావ్యాల, కథలపై పడింది. ఇతరదేశాల కవులకు సైతం ఈ గ్రంథం అనుసరణీయమైంది. అందువల్ల ఈ గ్రంథం ప్రపంచ ఖ్యాతిని పొందింది. పూర్వం

నుంచి కూడా మెదక్ జిల్లా తెలుగుతో పాటుగా ఉర్దూ, కన్నడ, మహారాష్ట్రీయుల భాషలతో కలిసి బహుభాషా ప్రాంతంగా విలసిల్లింది. ఆ ప్రభావం చేత మెదక్ జిల్లా పటాన్‌చెరువుకు చెందిన 'బ్రహ్మశివ' కవి కన్నడంలో 'త్రైలోక్య చూడామణి స్తోత్రం', 'సమయ పరీక్ష' అనే రచనలు చేసి సమకాలీన కవుల, సమాజ మెప్పు పొందాడు. పటాన్‌చెరువులో దొరికిన కన్నడ శాసనం ప్రకారం ఇతడు 12వ శతాబ్దానికి చెందినవాడని చరిత్రకారులు నిర్ధారణ చేశారు.

సాహిత్య చరిత్రలో 'తెలంగాణ మణిహారం'గా తిరుగులేని స్థానాన్ని పొందినకవి మల్లినాధసూరి. ఇతడు గొప్ప పేరుగాంచిన భాష్యకారులు, పండితుడయిన కపర్ది(క్రీ.శ1300)తనయుడు. సహృదయులను బాగా ఆకట్టుకునే నిష్పక్షపాతమైన వ్యాఖ్యలు రాసి 'వ్యాఖ్యాన చక్రవర్తి'గా కీర్తి పొందాడు. ఈయన"14వ శతాబ్ది ప్రాంతంలో ఇప్పటి కొల్చారంలో నివసించాడు. విద్యానాధుని సమకాలికుడు. సంస్కృత పండితుడు. కాళిదాసు 'రఘువంశం', 'మేఘసందేశం' కావ్యాలకు సంజీవనీ వ్యాఖ్య రాసి వాటిని ప్రాచుర్యంలోకి తేవటంతో పాటుగా భారవి కిరాతార్జునీయానికి ఘంటాపథ వ్యాఖ్యను, మాఘుని శిశు పాలవధకు సర్వంకష వ్యాఖ్యను, హర్ష'నైషధ'నికి జీవాతు వ్యాఖ్యను రాశాడు."[5]వీటితో పాటుగా మొత్తం పదిహేను గ్రంథాలకు వ్యాఖ్యానాలు రాశాడు. వ్యాఖ్యానాలే కాకుండా వైశ్యసుధాకర, రఘువీరచరితం, ఉదారకావ్యం, భక్తిరహస్యం, నక్షత్రపాత్రాధ్యాయ: వంటి స్వీయ రచనలు చేసి మెదక్ జిల్లా సాహితీ చరిత్రలో సుస్థిర స్థానం ఏర్పరచుకున్నారు. పండితవంశం కావటంచేత ఇతని కుమారుడు సోమనాథపీథి కూడా తండ్రి మార్గాన్ని అనుసరించి ప్రతాపరుద్రీయానికి 'రత్నాపణ' అనే వ్యాఖ్యను రాసి తండ్రికి తగిన తనయుడు అనిపించుకున్నాడు.

అచ్చ తెలుగు కావ్యం తెలంగాణ నుండే వచ్చింది. జిల్లాలోని పటాన్‌చెరువుకు చెందిన పొన్నగంటి తెలగన్న 'యయాతిచరిత్ర' అను అచ్చతెనుగు ప్రబంధాన్ని రాశాడు. ఇదే ప్రథమ అచ్చతెనుగు కావ్యము. 'యయాతి చరిత్ర' మృదుపదములొలుకు రసవత్తర ప్రబంధంగా చరిత్రకెక్కింది. 15 -16వ శతాబ్దికి చెందిన తెలగన్న కుల, మతాలకు అతీతంగా తన రచనను అమీన్‌ఖాన్‌కు అంకితం చేశాడు. తెలగన్న తన రచన ద్వారా ఇటు మెదక్ జిల్లా ఖ్యాతినే కాకుండా అటు తెలంగాణ గొప్పతనాన్ని నలుదిక్కులకు వ్యాపింపజేశాడు. 15-16వ శతాబ్ది వరకు బిక్కనవోలు (దోమకొండ)సంస్థానం భౌగోళికంగా మెదక్ జిల్లాలో భాగంగానే ఉంది. కావున పట్టమెట్ట సోమనాధకవి (క్రీ.శ1500-1550), కాచెభూపతి, కామినేని మల్లారెడ్డి(క్రీ.శ1550-1580), ఎల్లారెడ్డి కవి, కామిరెడ్డి, రాపాక లక్ష్మీపతి మొదలగు కవులు "బిక్కనవోలు (దోమకొండ) సంస్థానాలకు చెందిన వారైనా, వారిని ఆనాటి మెదక్ జిల్లా సాహిత్యకారులుగానే గుర్తించవచ్చు"[6]వీరి రచనలు మెదక్ జిల్లా సాహిత్య చరిత్రలో లిఖించబడ్డాయి. మెదక్ జిల్లా ప్రాచీన సాహిత్యంలో పేర్కొనదగిన మరో కవి పెద్దిభట్టు(ఈయన కపర్ది పండితుని రెండవ కుమారుడు, మల్లినాథసూరికి స్వయాన తమ్ముడు), ఈయన మహా విద్వాంసులు. మల్లినాథునివలే ఇతను కూడా గొప్ప వ్యాఖ్యాతగా కీర్తి గడించాడు. పండితవంశ వారసత్వాన్ని పునికిపుచ్చుకుని రచనలు చేశారు.

## 2. మెదక్ జిల్లా సంప్రదాయ కవులు - సాహిత్యం

గతకాలపు పరంపరా క్రమమైన వ్యాకరణం, పాండిత్యం, సనాతన ధర్మ దృష్టితో సృజించిన కవిత్వాన్ని సంప్రదాయ కవిత్వంగా చెప్పవచ్చు. మెదక్ జిల్లా ప్రాచీన సాహిత్యం పాత సంప్రదాయాన్ని అమోదించి తనదైన సరికొత్త ప్రయోగాలను ప్రక్రియలను ఎన్నుకున్నది. పరిపాలనాపరమైన వేదన అనుభవిస్తూ మారుతున్న కాలాన్ని, సామాజిక పరిణామక్రమాన్ని దృష్టిలో ఉంచుకుని దానికి అనుగుణంగా మెదక్ జిల్లా కవులు, రచయితలు వస్తువుని ఎంచుకున్నారు. నిజానికి సినారె అన్నట్లు"సంప్రదాయం ఒక జీవనది. మానవునిలో వికాసం ఉన్నన్నినాళ్ళు సంప్రదాయం సజీవముగా నుండును. అది క్రొత్త క్రొత్త మార్పులతో వసంత ద్రుమమువలె చిగురించు చుండును"[7] అనే మాటలు నిజమైనవి. సామాజిక పరిణామ క్రమంలో వచ్చినట్టి "ప్రతి కవిత్వోద్యమము అంతకు పూర్వము స్థిరపడిన కవితా సంప్రదాయములమీద తిరుగుబాటు చేయును. అంతమాత్రము చేత పాత కవితా సంప్రదాయములు మటుమాయముకావు. సంప్రదాయములు వాటిపై జరుగు ప్రయోగములు కాలగమనంలో అనివార్యముగా జరిగినట్టివే."[8]ఇలాంటి ప్రయోగాల పునాదిగా ప్రజల్ని చైతన్యవంతం చేయటం కోసం విభిన్న ప్రక్రియల్లో మెదక్ జిల్లా కవులు రచనలు సాగించారు. మెదక్ జిల్లా గుమ్మడిదలకు చెందిన ప్యారక శేషాచార్యులు మెదక్ పట్టణంలో(1992)అష్టావధానం చేస్తున్న క్రమంలో జిల్లా కవుల గురించి ఆశువుగా చెప్పిన పద్యం ఇది..."అడగరు నోరెత్తరు-ఇ/మ్మడి పటిమయు గల్గెనంచు మాటికి మీసం/మ్మెడి దిప్పరు-గొప్పలవ/త్తిడులకు లొంగరు నిజమ్ము మెతుకున ధీశేషాత్ముల్. జిల్లాలో ప్రతిభ, వ్యుత్పత్తి, సాధనతో నిరంతర సాహిత్య సృజన చేసిన కవులు, రచయితలు, మేధావులు ఎందరో ఉన్నా వారికృషి బయటకు రాలేదు. చాలా రచనలు అముద్రితంగా మిగిలి కాలగర్భంలో కలిసిపోయాయి. పరిపాలనాపరమైన నిరాదరణ, ద్రవ్యవసతి, ప్రోత్సాహం,

జీవనోపాధి లోపాల వలన, వెనకబాటుతనంగా పేరుపడి న్యూనతాభావం దెబ్బతీసిన కారణంగా విజ్ఞులైన అందరు సాహితీవేత్తలు గుర్తింపు పొందలేదు. జిల్లా కవులకు తమ సాహిత్యం ప్రయోజకారిత్వం సాధించాలనే కాంక్ష తప్ప వారు పేరు ప్రతిష్టలకు పాకులాడలేదు."[9]జిల్లా కవులు సందర్భం ఏదైనా, ప్రతి సన్నివేశాన్ని వారి రచనల్లో ప్రతిఫలింపజేశారు. వస్తువుకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. సామాజిక ప్రయోజనమే పర్యవసానంగా రచనలు చేశారు.

క్రీ.శ1550–1560 మధ్య కాలానికి చెందిన మారేపల్లి వెంకట నరసయ్య భక్తి వైరాగ్య ప్రపూరితములైన ఎన్నో శతకాలను, పద్యాలను రచించి 'తత్వజ్ఞాన పరిపూర్ణుడు' అనిపించుకున్నాడు. అదే విధంగా 16వ శతాబ్దానికి చెందిన లక్ష్మీశకవి మెదక్ జిల్లాలోనే పుట్టి పెరిగినప్పటికీ కన్నడ సాహిత్యాన్ని అవపోసన పట్టిన ఘనుడు. కన్నడంలో రచనలు చేసి తన సమకాలికులతో శభాష్ అనిపించుకున్నారు. జిల్లాలో లక్ష్మీశకవికి సమకాలికుడు అయిన పండరి రామానుజరావు రచయితగా మంచి పేరు సంపాదించుకున్నారు. ఇతడు రామాయంపేట నివాసి. 'గాంగేయ చరిత్ర', 'అహల్యా సంక్రందన విలాసం', 'హనుమదవతార మండలి' అనే రచనలు చేసి మెదక్ జిల్లా సాహిత్య చరిత్రని సుసంపన్నం చేశారు. అదేవిధంగా శ్లేషయమక చక్రవర్తిగా పేరుపొందిన యమవరం రామశాస్త్రి జిల్లావాడే. 'గురుస్తుతి', 'భవానీస్తవం', 'శంకరస్తవం' ఇతని రచనలు. గోలకొండ కవుల సంచికలో ఈ కవి పద్యాలు ఉన్నాయి. ఈ వరుసలో పేర్కొనదగిన మరొక కవి ముత్యంపేట సాంబయ్య(జననం1889). సిద్ధిపేట నివాసి. 'శివస్తవసుధ', 'శాంకరీస్తవ', 'రామామణి శతకం' ఇతని రచనలు. గోలకొండ కవుల సంచికలో ఇతని పద్యాలు ప్రచురించబడ్డాయి. జిల్లాకు చెందిన రుక్మాభట్ల విధుమౌళిశాస్త్రి(జననం1909)రాసిన 'తందనాన రామాయణం' ప్రజల్లోకి వెళ్ళి విశేష ప్రాచుర్యం పొందింది.

సంప్రదాయ భక్తి కవిత్వం ప్రధానంగా వ్యాకరణ పరిజ్ఞానంతో, ఛందో నియమాలను ఆకలింపుచేసుకుని సనాతనత్వాన్ని వారసత్వంగా సమకాలీనతని సృజిస్తూ వచ్చింది. ఈ క్రమంలో "మెదక్ జిల్లాకు చెందిన భాగవతం సీతారామశర్మ 'దేవకీనందన తారావళి' రచించగా, రిమ్మనగోడు రఘురామ శాస్త్రి 'రాజేశ్వర శతకం' రచించాడు. లచ్చపేట వాస్తవ్యుడైన మూలంపల్లి రాజశేఖరశాస్త్రి 'శ్రీనాథ విజయం' రచించాడు. ముదిగొండ ఆంగీరస శర్మ 'వ్యాస భారతి' రచించారు. సిరిసినగండ్ల శ్రీనివాసాచార్యులు 'కూచాద్రి మహాత్మ్యం' అనే ప్రబంధం రచించి కూచనపల్లి వేంకటేశ్వర స్వామికి అంకితమిచ్చాడు. 'మెతుకుసీమ' కావ్యంలో మెదక్ జీవనాన్ని వర్ణించాడు."[10] మెతుకుసీమ కావ్యంలో చారిత్రక వర్ణనలు, యథార్ధ సంఘటనలను కవి హృద్యంగ వర్ణించారు. జిల్లాలోని ముఖ్య పట్టణాల వైశిష్ట్యాన్ని చెప్పటంతో పాటుగా నాటి కాలంలో విలసిల్లిన బౌద్ధ, జైన మతాల నేపథ్యాలను వివరించారు. వివిధ రకాల మతాలకు, భాషలకు మెదక్ జిల్లా ఎట్లా ఆతిథ్యం ఇచ్చి భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటిందో కన్నులకు కట్టినట్లుగా శ్రీనివాసాచార్యులు తన కావ్యంలో వర్ణించాడు.

మెదక్ జిల్లా సాహిత్య చరిత్రను ప్రాచీన కాలం నుండి అధునిక కాలం వరకు ఒకసారి గమనించినట్లయితే జిల్లాలో రచయిత్రులకు కొదువలేదు. ఎందుకంటే జిల్లా రచయిత్రులు వేరు, వేరు సామాజిక సందర్భాలలో పెద్ద ఎత్తున కవి సమ్మేళనాలు నిర్వహించారు. పురుషులతో సమానంగా రచనలు చేశారు. రచయిత్రుల వరుసలో మొదటగా పేర్కొనదగిన వారు రాణీ సర్దేశాయి వేంకట లక్ష్మాయమ్మ. పాపన్నపేట సంస్థాన రాజవంశానికి వారసురాలు. గొప్ప కవయిత్రి విదుషీమణీ. వీరు 'మానసబోధ' అనే రచనతో జిల్లా సాహిత్య చరిత్రలో సుస్థిరస్థానాన్ని ఏర్పరచుకున్నారు. అదేవిధంగా జిల్లా సాహిత్య చరిత్ర పుటల్లో తనకంటూ ఒక స్థానాన్ని ఏర్పరచుకున్న రచయిత్రి వితాబాయి(జననం 1889). వీరు జోగిపేట ప్రాంతానికి చెందినవారు. తెలుగు, కన్నడ, మహారాష్ట్ర భాషలందు పండితురాలు. ప్రథమాంధ్ర మహాసభ(1930)జోగిపేట మహిళా సభకు అధ్యక్షులుగా వ్యవహరించారు. వీరి రచనలు ఆధ్యాత్మిక ప్రబోధాలుగా ఉన్నాయి. భజనలు, స్తోత్రాలు, మంగళ హారతులు, జోల, లాలి పాటలు దేశీయ పదాలతో రచనలు చేశారు. ఈమె రచనలలో లక్షణం కన్న భక్తి రసానికి, భావానికి ప్రాధాన్యత ఉంది. నిత్యజీవితంలో మనం వ్యవహరించే చిన్న చిన్న పదాలను ఉపయోగించి రచనలు చేసి సమకాలీన కవులను ఒప్పించి మెప్పించిన కవయిత్రి వితబాయి. ఎందరో రచయిత్రులు ఆదరణలేక సామాజిక కట్టుబాట్ల వలన సాహిత్య ప్రపంచానికి రాలేకపోయారు. జానపద సాహిత్యానికి సంబంధించిన స్త్రీల గేయాలు నేటికి జిల్లాలో సజీవంగా ఉన్నాయి.

మెదక్ జిల్లా సంప్రదాయ సాహిత్యంలో అందెవేసిన చేయి వేముగంటి నరసింహా చార్యులుగారిది(జననం 1930). తెలుగు సాహిత్యంలోనే 'విద్యత్కవి కోకిల'గా పేరుగాంచిన గొప్ప పండితుడు. తెలుగుతో పాటుగా సంస్కృతంలో కూడా ప్రావీణ్యాన్ని సంపాదించారు. ఇతని రచనలు 'ప్రబోధము', 'అమరజీవి బాపూజీ', 'కవితాంజలి', 'నవమాలిక', 'వీరపూజ', 'మణికంకిణి', 'వివేకవిజయం', 'భావతరంగిని', 'తిక్కన' మొదలైనవి దాదాపుగా 40 కావ్యాలు రచించారు. వీరు మెదక్ జిల్లా రచయితల సంఘానికి, సాహితీవికాస మండలికి

అధ్యక్షులుగా ఉండి సామాజికాభివృద్ధికి ఎంతో కృషి చేశారు. అటు తర్వాత వీరి సమకాలంలో జీవించి మెదక్ జిల్లా సాహిత్యాన్ని సుసంపన్నం చేసినవాళ్ళలో ముఖ్యులు వేంకట పౌండరీకయాజులు, దోర్బల విశ్వనాథ శర్మ, కొంపల్లి దుర్గాగ్నిహోత్రులు, కొమ్మిశెట్టిపల్లి తమ్మయ్య, కందాళ సుందరాచార్యులు, ముదిగొండ ఈశ్వరచరణ్, ముడుంబై రంగ కృష్ణమాచార్యులు, దేశపతి గోపాలకృష్ణ, ఉద్దవ రామచంద్ర మహారాజు, ఈశ్వరానందం, ఉమాపతి నాగయ్యశాస్త్రి, ఉమాపతి పద్మనాభశర్మ, ఎల్. ఆనందరావు దేశపాండే(జననం 1914), గోపతిలింగకవి, మెదక్ లక్ష్మణచారి, కొలిచెలిమ నారాయణ, ముదిగొండ బ్రహ్మయలింగం, సదాశివరెడ్డి, బచ్చురామన్న గుప్త, చిదిరె లక్ష్మణశాస్త్రి, గజవాడ హన్మత్కవి, గౌరీభట్ల రామకృష్ణ శర్మ, బి. విశ్వనాథ శాస్త్రి, శిలె నారాయణ తదితరులు సంప్రదాయ రచనలు చేశారు.

### 3. మెదక్ జిల్లా యక్షగాన కవులు – సాహిత్యం

తెలుగు సాహిత్య కళారూపాలలో యక్షగానాలకు ప్రత్యేక స్థానం ఉంది. యక్షగానం గాన, నృత్య, నాటకీయ, అభినయ దేశీ కళారూపాన్ని యక్షగానం అని చెప్పవచ్చు. సాహిత్య విమర్శకుల ప్రకారం కందుకూరి రుద్రకవి(క్రీ.శ 16)రచించిన 'సుగ్రీవ విజయం' మొదటిది. యక్షగానాలు పల్లెల్లో బహుళ ప్రాచుర్యం పొందాయి. ఈ వరుసలో చూసినప్పుడు మెదక్ జిల్లాలో యక్షగాన సాహిత్యం చాలానే కన్పిస్తుంది. మెదక్ జిల్లాలోని గొంగులూరుకు చెందిన గుజ్జరి ఎల్లదాసు(1800–1860)యక్షగాన రచనలు చేయుటలో సుప్రసిద్ధులు. ఇతని ప్రసిద్ధరచన 'కూచకొండ రామాయణం'(సుందరాకాండ). ఇది ప్రజాదరణ పొందిన యక్షగానం. ఈ వరుసలో పేర్కొనదగిన వారు వడ్ల మల్లయ్య. ఎల్లదాసు రచన తర్వాత ఈయన రాసిన 'భీమసేన పరాక్రయం' అనే యక్షగానం వచ్చింది. ఆ తర్వాత "బెల్లోజు రమణాచారి రామేశునిపేటకు చెందిన కవి. వందకుపైగా యక్షగానాలు రాశాడు. 'సుభద్రా కల్యాణం', 'గంగాదేవి విజయం', 'గౌరీ కల్యాణం', 'దక్షయజ్ఞం', 'వనమాలీ పరిణయం' వంటివి ప్రదర్శింపబడి, ప్రచురింపబడి ప్రజాదరణ పొందాయి. బూరుగుపల్లి సోదరకవులు యక్షగాన రచనలో ప్రసిద్ధులు. గాజుల స్వామిదాసు మిట్టపల్లి నివాసి. 'స్వరుచోపాఖ్యానం', 'భళ్వాన చరిత్ర' యక్షగానాలు రచించాడు. సబ్బని వాసుదేవ్ వందలాది యక్షగానాలు రచించి జిల్లాలో పేరొందిన కవి. చెర్విరాల భాగయ్య యక్షగాన రచనలో సుప్రసిద్ధుడు. జిల్లా ఖ్యాతిని దశదిశలకు వ్యాప్తిచేసిన వారిలో చెర్విరాల భాగయ్య ఒకరు. జిల్లాకు చెందిన మరో యక్షగానకవి వడ్ల లక్ష్మయ్య. ఈయన రంగంపేట వాస్తవ్యుడు. యక్షగానాలు రాసి ప్రదర్శింపజేశాడు. కాల్వ బాలయ్య సిద్ధిపేట నివాసి. 'శూర్పనఖ', 'భీష్మ ప్రతిజ్ఞ' యక్షగానాలు రచించాడు. 'శునక వానరీయం' ఆయన మరో ప్రసిద్ధి చెందిన రచన."11ఇట్లా చెప్పుకుంటూ వెలితే జిల్లాలో అనేక యక్షగానాలు తారసపడతాయి. చాలామంది యక్షగానాలు రాసి ప్రదర్శించినప్పటికినీ వెలుగులోకి రాలేకపోయారు.

యక్షగాన రచనల్లో జిల్లాకు చెందిన కవులు అధ్యాత్మిక, సామాజిక, రాజకీయతకు సంబంధించిన వస్తువును తీసుకుని రాసి వాటిని ప్రదర్శించారు."1955లో చందా నారాయణ శ్రేష్టి అచ్చువేయించిన యక్షగానంలో సమాజానికి సంబంధించిన సహజ గుణాన్ని వినయంగా చెప్పారు. 'మంచి మాటలు చెప్పిన మాన్యులకును/కోప మైందైన వచ్చును కొదవలేక/చెడ్డతనమును బోధింప దొడ్డలనుచు/చేర బిలిచియు విందులు జేతురయ్య' నీతి విలువలు సూచిస్తూ తెలిపారు. ఈ యక్షగానంలో తెరలోపలి దర్వు, తెరవెడలు దర్వు, సంవాద కందార్థ ద్విపదలు, సీస, కంద గీతాలు ఉన్నాయి."[12]ఈ వరుసలో పేర్కొనదగిన వారు పటోళ్ళ వీరప్ప, యజ్ఞ కృష్ణదాస కవి(1898–1969), కిష్టాగౌడు రాసిన 'అల్లిరాణి చరిత్రము' 1963లోనే నాలుగవ ముద్రణ పొందింది. పిచికె పాపయ్య (కొడిపల్లి), పడిగ శివయ్య మొదలగు వారు అనేక యక్షగానాలు రచించి మెదక్ జిల్లా సాహిత్యాన్ని మరింత పదునెక్కించారు.

### 4. మెదక్ జిల్లా అవధాన కవులు – సాహిత్యం

అరవై నాలుగు కళల్లో ఒకటైనది ఈ అవధానం. అనేక విషయాల మీద ఏక కాలంలో మనస్సును లగ్నం చేసి విభిన్న కథనాలతో పరిష్కారం చేసే సాహిత్య ప్రక్రియ అవధానం. దీనికి మూలం ధారణ శక్తి. ఇది ప్రదర్శనాత్మక కళగా సభలో పృచ్ఛకుల సమక్షంలో జరుగుతుంది. దేశ పరిస్థితులు, లౌక్యం, సమయస్ఫూర్తి అవధాని అవగాహనకు పరీక్షగా నిలుస్తాయి. మెదక్ జిల్లాలో అవధానం సాహిత్య ప్రేరణ, చైతన్యాలను కలిగించటంలో సఫలీకృతమయ్యిందని చెప్పవచ్చు. మిగతా ప్రక్రియలలోకెల్ల అవధాన ప్రక్రియ తెలుగు వారికి చాలా విశిష్టమైనది. తెలంగాణ ప్రాంతంలో నిజాం పరిపాలనలో తెలుగునకు ఆదరణ కరువయ్యిందనే విషయాన్ని ముందే ప్రస్తావించి ఉన్నాను. అట్లాంటి సందర్భాల్లో మొత్తంగా తెలంగాణ ప్రాంతంలో కావచ్చు ఇటు మెదక్ జిల్లాలో కావచ్చు ఈ అవధానాలు జన చైతన్యానికి దోహదం చేశాయి.

గుమ్మన్నగారి లక్ష్మీనరసింహశర్మ దుబ్బాక మండలంలోని పోతరెడ్డిపేటకు చెందిన వారు. దాదాపుగా 250 అవధానాలు పూర్తి చేసిన పండితుడు. 'వాగీశ్వర స్తుతి', 'అవధాన సరస్వతి' మొదలైన పుస్తకాల్ని ప్రచురించారు. ఈయనకు అవధానాల్లో 'హిందోళ రాగ స్పెషలిష్ట్' గా పేరుంది. ఈ వరుసలో

పేర్కొనదగిన అవధాని "అష్టకాల నరసింహశర్మ. వీరి స్వగ్రామం రాజగోపాల్‌పేట. 150కి పైగా అవధానాలు పూర్తి చేశారు. రాష్ట్రమంతటా అవధానాలు నిర్వహించారు. 'శిథిల విపంచి', 'శ్రీరామచంద్రిక', 'పురుషోత్తముడు' అనే కావ్యాలు రచించాడు. సరస్వతీ యజ్ఞాలు నిర్వహించి అనంతసాగర్‌లో సరస్వతీ దేవాలయం నెలకొల్పాడు. ప్యారక శేషాచార్యులు గుమ్మడిదల గ్రామవాసి. అవధాన ప్రక్రియ ప్రదర్శించిన కవి. పత్తిరైతుల దీనస్థితిని 'ప్రవత్తి నిర్వేదం'గా, కాకి హీనగాథను 'కాకతాళీయం'గా కావ్య రచన చేశాడు."[13] జిల్లా అష్టావధానులో ఒకరైన శాస్త్రుల విశ్వనాథశర్మ సంస్కృతాంధ్ర భాషలలో ఏక కాలంలో అవలీలగా అవధానం చేసిన కవిగా జిల్లా సాహితీ చరిత్రలో నిలిచిపోయారు. గౌరీభట్ల రఘురామశర్మ తన అవధానంలో మెదకు జిల్లా సాహిత్యాన్ని, అవధాన ప్రీతిని వర్ణించారు. మెదక్ జిల్లా అవధానుల వరుసలో చెప్పుకోదగిన వారు రాళ్ళబండి రాఘవశాస్త్రి, తిగుళ్ళ రాధాకృష్ణ శర్మ, గౌరీభట్ల మెట్రామశర్మ, జి. ఎం. రాములు తదితరులు మారుతున్న సాహిత్య పోకడలను ఎప్పటికప్పుడు సొంతం చేసుకున్నారు. సామాజిక ప్రయోజనమే ఆయుధంగా అవధానాలు చేసినవారు జిల్లాలో అధికంగా కన్పిస్తారు.

మెదక్ జిల్లాలో నేటికీ సజీవంగా ఉన్న జానపద సాహిత్యం, గుణాఢ్యుని 'బృహత్కథ' మొదలుకొని కథారహిత కావ్యాలు, కథా కావ్యాలు, ఖండ కావ్యాలు, స్థల పురాణాలు, చారిత్రక కావ్యాలు, గేయ కవిత్వం, శతకాలు, అవధానాలు, దండకాలు, యక్షగానాలతో పాటుగా ఆధునిక కాలంలో వచ్చిన వివిధ ప్రక్రియల వరకు ప్రతీ రచయిత, కవి సామాజిక ప్రయోజనాన్ని కాంక్షించి, ప్రజల్ని చైతన్యం చేసే దిశగా తమతమ రచనల్ని కొనసాగించారనేది జిల్లా సాహిత్య చరిత్రను గమనించినప్పుడు తెలిసే ప్రాథమిక అంశం. మెదక్ జిల్లా కవులు 1930 నాటికి కూడా ఇక్కడ పద్యాన్ని అధికంగా రాసేవారే ఎక్కువ. చెదురుమదురుగా కవిత్వం రాస్తున్నవారు కొందరే. ఇక్కడ ఏ ప్రక్రియ వచ్చినా అది పురోగమన దృష్టితో, సామాజిక కాంక్షతో వచ్చిందనేది వాస్తవం. అట్లాంటి ఒక సామాజిక ప్రయోజనాన్ని, సామాన్యుని భాషని, జీవితాన్ని కవిత్వంలోకి మెదక్ జిల్లా ఆధునిక కవులు తీసుకువచ్చారు.

## 5. మెదక్ జిల్లా అభ్యుదయ కవులు – సాహిత్యం

తెలంగాణ ప్రాంతంలో ఆధునిక యుగం ఆరంభమయ్యే సమయానికి చాలా దయనీయమైన పరిస్థితి నెలకొని ఉంది. తెలంగాణలో అంతర్భాగమైన మెదక్ జిల్లా కూడా సరిగ్గా అట్లాంటి పరిస్థితినే ఎదుర్కొన్నది. ఇక్కడి కవులు చదివితే ఉర్దూ మాధ్యమంలోనే చదవాలి. లేదంటే చదువు ఆపివేయాల్సిన దుస్థితి. మరో వైపు గస్తీనిషాన్ తిర్వన్(జీ.వో.నెం.53)అనే ప్రభుత్వ ఆదేశం అమలులో ఉన్నది. దీని ప్రకారం మాట్లాడటం, సభలు నిర్వహించు కోవడం, పత్రికలు నడిపించటం అన్నీ రద్దు. ఇట్లాంటి ఒక నిర్బంధ వాతావరణంలో తెలంగాణ కవులు ముఖ్యంగా మెదక్ జిల్లా కవులు వారికి పరిచయమున్న పరిమితమైన ప్రాచీన తెలుగు పద్యకవిత్వాన్ని చదువుకున్నారు. దాని నుండే జ్ఞానాన్ని వాళ్ళు అలవరుచుకున్నారు. అందులోనే కవిత్వం అల్లటం చేశారు. సరిగ్గా ఇదే సమయంలో (1934)సురవరం ప్రతాపరెడ్డి 'గోలకొండ' పేరుతో తెలంగాణ కవుల సంచికను ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి వెలువరించారు. ఈ సంచికలో వచ్చిన కవిత్వం అయితేనేమీ, జిల్లాలలో వచ్చిన కవిత్వం అయితేనేమీ ఈ క్రమంలో మొత్తం తెలంగాణ ఆధునిక కవిత్వాన్ని గమనించినప్పుడు తెలంగాణ తొలినాటి ఆధునిక కవిత్వమంతా పద్య, గేయ కవిత్వంగానూ ఉంది. ఇదే వరుసలో మెదక్ జిల్లా ఆధునిక కవిత్వాన్ని గమనించినప్పుడు తొలినాటి మెదక్ జిల్లా ఆధునిక కవిత్వమంతా పద్య, గేయ కవిత్వంగానే కనబడుతుంది.

మెదక్ జిల్లా సమాజం దాదాపు 20వ శతాబ్దపు ఉత్తరార్థందాకా బలమైన భూస్వామ్య, రాచరిక పాలనలో ఉంది. కవులు ప్రతి తీవ్ర అణచివేత ఎదుర్కున్న సందర్భంలోనూ కవిత్వాన్ని ఆయుధంగా చేసుకొన్నారు. ఆ పోరాటంలో ఎన్నో విజయాలూ, అపజయాలూ ఉన్నాయి. పీడిత ప్రజల, పీడక పాలకుల మధ్య వైరుధ్యం ఆ వర్గాల రద్దువరకు పోదు కాబట్టి వాటి ఉనికి కలిగిన మెదక్ జిల్లా సహజంగానే ఘర్షణాయుతమైంది. సమాజం ఇట్లా ఉన్నప్పుడు దాని చైతన్యయుత ప్రతిఫలనమైన సాహిత్యం, ముఖ్యంగా ఆధునిక కాలంలోని మెదక్ జిల్లా కవిత్వం తెలంగాణ తోవల వెంటే ప్రయాణించింది. తెలంగాణ సమాజం అందించిన అనేక చారిత్రక అనుభవాలను రికార్డు చేసి సమాజ సాహిత్య సంబంధాలను తాత్వికంగా, రాజకీయంగా బలపరిచింది.

మెదక్ జిల్లా హైదరాబాదు నగరానికి ఆనుకొని ఉండటం ఒకటైతే, నైసర్గికంగా కరీంనగర్, వరంగల్, నిజామాబాద్ జిల్లాలకు మధ్యగా ఉండటం, కరీంనగర్ జిల్లాలోని జగిత్యాల, సిరిసిల్ల ప్రాంతాల్లోని ప్రజా ఉద్యమాల ప్రభావం జిల్లా కవుల్ని, మేధావుల్ని ఆకర్షించటం, వరంగల్ జిల్లా రైతాంగ పోరాటాలు, తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటాల ప్రభావం, వాటి ప్రేరణతో మెదక్ జిల్లాకు చెందిన సాహిత్యకారులు ప్రభావితమయ్యారు. వాటి మూలంగా ప్రజాపక్షం వహించి విద్యార్థి దశనుండే ఆధునిక భావాలతో, కవిత్వం రాయడం, రచనలు చేయడం మొదలుపెట్టారు. "ప్రగతిశీల భావాలు కలిగి

ప్రజల గురించి ఆలోచించి ఆధునిక కవితా పద్ధతులలో కవిత్వమల్లిన కవులెందరో జిల్లాలో ఆవిర్భవించారు. ప్రజాస్వామిక ఆలోచనా విధానంతో ఉద్యమాలు నిర్మించి, దానికనుగుణమైన కవిత్వాన్ని సృజించిన మహాకవి మగ్దూం మొహియుద్దీన్ ఈ జిల్లా గర్వించదగిన కవి. అభ్యుదయ కవిత్వంతో జాతీయస్థాయినందుకున్న మహనీయుడు. ఉర్దూ కవిత్వంతో ఉన్నత శిఖరాలు సాధించిన మగ్దూం ఉద్యమకవి. అటు ప్రజల్ని చైతన్యవంతుల్ని చేసే ఉద్యమంలో పాల్గొంటూనే ఇటు సాంస్కృతిక రంగంలో తీవ్రమైన కృషి చేశాడు. ఆయన గేయాలు ప్రజల్ని ఉర్రూతలూగించాయి. అతీష్ కథా, తెలంగాణ, ఇంతేజార్, అంధేరా మొదలైన గేయాలు ఎంతో ఖ్యాతినార్జించి పెట్టాయి."[14] సమసమాజం రావాలని మగ్దూం కోరుకున్నాడు. సామాజిక ప్రయోజనమే పరమావధిగా తన కవితా ప్రయాణాన్ని కొనసాగించాడు. తన కవిత్వాన్ని ప్రజల పక్షం చేసిన గొప్ప కవితాయోధుడు (కలంయోధుడు)మగ్దూం. 2003లో మగ్దూం కవితల్ని ప్రజాసాహితీ ప్రత్యేక సంచిక తీసుకువచ్చింది.

ఈ వరుసలో పేర్కొనదగిన మరో కవి వెల్దుర్తి మాణిక్యరావు. ఆంధ్రోద్యమ సమయంలో అణాగ్రంథమాలని స్థాపించి దాని ద్వారా సామన్య ప్రజలను జాగృతం చేయటంలో విశేష కృషి చేశారు. నాటి కాలంలో అక్షరాస్యత కేవలం రెండు శాతం మాత్రమే ఉన్నది. దాన్ని మరింతగా పెంచితే ప్రజల్లో చైతన్యం వస్తుందన్న గొప్ప ఆలోచన చేసి పుస్తకాన్ని ముద్రించి కేవలం ఒక్క అణాకే పుస్తకాన్ని సామాన్య ప్రజానికానికీ అందుబాటులోకి తెచ్చిన మెదక్ జిల్లా మరో కలం యోధుడు వెల్దుర్తి. ఈయన తెలంగాణ ప్రాంత విముక్తిని కోరుతూ కవిత్వాన్ని రాయడంతో పాటుగా, భూస్వాముల దౌర్జన్యాలను నిరసిస్తూ బుర్రకథలు, ఉద్యమగీతాలు రాశారు. ఈయన వ్యావహారిక భాషా ప్రియులు. కాళోజీ, గురజాడల బాణిలో వీరు రచనలు చేశారు. వీరి 'సీతపెండ్లి', 'బంగారు లేడి మరుపు', 'దయ్యాల పనుగడ''[15]మొదలగు మరపురాని రచనలు చేశారు. అంతేకాకుండా రైతు, నెహ్రూ, సుభాష్‌బోసు, సావర్కర్, మాడపాటి హన్మంతరావు మొదలగు వారి జీవితాలకు సంబంధించిన రచనలు చేశారు. అంతేకాకుండా మాణిక్య రావుగారు గోలకొండ పత్రికకు సహ సంపాదకునిగా పని చేశారు. ఒకవైపు పత్రిక కోసం శ్రమిస్తూనే మరోవైపు తన రచనా ప్రస్థానాన్ని కొనసాగించారు. అలా వచ్చిన కవితాసంకలనమే 'మాణిక్యవీణ'(1986). అట్లే ఈయన రాసిన 'రైతు' పుస్తకాన్ని నిజాం ప్రభుత్వం నిషేధించింది. దీనిని బట్టి వెల్దుర్తిగారి రచనలు నాటి సమాజంపైన ఎంతటి బలమైన ప్రభావాన్ని చూపించాయో దానికి నిదర్శనంగా 'రైతు' రచనని చెప్పవచ్చు.

శ్రీ సంగమేశం సంగం ఆర్యసమాజానికి సంబంధించిన 'ఆర్యగేయాలు', 'యుగధర్మాలు' మొదలైనవి రచించారు. శ్రీ వేంకట దోర్భల వేంకటరాజశర్మ 'భక్తకవి జయదేవుడు', 'విజయ విలాసం', అను రచనలు చేశారు. ధోర్బల విశ్వనాథశర్మ సంస్కృత, తెలుగు భాషాకోవిదులుగా బృందావనం, పుష్పసంవాదం, ప్రార్థనం, ఒకరేయి అను రచనలను చేసి జిల్లా సాహితీ చరిత్రలో తనకంటూ ఒక స్థానాన్ని సంపాదించుకున్నారు. ఈ వరుసలో పేర్కొనదగిన మరొక కవి జి. విజయ్‌కుమార్. ఈయన విజయశ్రీ అను కలం పేరుతో 'కలమా కదలవేల', 'జీవన ప్రవంతి', 'ఓంకారేశ్వర చరిత్ర' మొదలగు రచనలు చేశారు. జిల్లా కవుల్లో పేరెన్నికగల రచనలు చేసిన వారిలో ఒకరుగా చిదిరె లక్ష్మణశర్మని చెప్పవచ్చు. నివాసం ఆందోలు. ఈయన సంస్కృతాంధ్రకోవిదులు. సాహిత్య పిపాసులు. సలక్షణ ధారాశుద్ధిగల రసమయ కవితారసజ్ఞులు. వీరు"వయస్సులో వృద్ధులైననూ కవ్యోత్పత్తిలో యౌవ్వనులు"[16]వీరి రచనలు వ్రతపరీక్ష, శ్రీనివాసచరితం, స్వయంవర నాటకం, మెదక్ సంస్థానాదీశ్వరుని చరిత్ర మొదలైనవి ఇతని రచనలు. అంతేకాకుండా దేశబంధు మొదలగు పత్రికల్లో వ్యాసాలు, ఖండికలు కలవు. శర్మగారు మెదక్ జిల్లా రచయితల సంఘానికి ఉపాధ్యక్షులుగా, గ్రంథాలయాలు మరియు కొన్ని విద్యాసంస్థల్లో ఉత్తమ కార్యకర్తగా పనిచేశారు. మంచి కార్యసాధకుడు కూడా. జిల్లా ఆధునిక కవిత్వంలో తనవంతు కృషి సల్పిన వారు మరింగంటి సీతారామాచార్యులు(జననం 1904). ఈయన 'సితార' అనే కలం పేరుతో రచనలు చేశారు. సంస్కృతం, తెలుగు భాషలలో ప్రావీణ్యం ఉంది. ముద్రిత రచనలు: లేఖ్రాయము, ఆత్మార్పణము, పెళ్ళి, ఆధునిక విజ్ఞానము. అముద్రిత రచనలు: అభిరుచులు, హాస్యరసపోషణం, వ్యాస రచన మొదలైనవి. వీరి రచనలు చిత్తశుద్ధి కలిగి మృధుమధురంగా ఉంటాయని జిల్లా రచయితల అభిప్రాయం.

1935లో సరళ వ్యవహారానికి దగ్గరగా రచనలు చేసిన కవులు జిల్లాలో కనిపిస్తారు. వారిలో ఒకరు పటోళ్ళ వీరప్ప పటేలు. ఈయన రాసిన 'నిజాం గర్వ భంగం' ఆ కోవలోకి వస్తుంది. తరువాత 1935-40 మధ్య కాలంలో యజ్ఞకృష్ణదాసు 'ఉషాపరిణయం' అనే వచన కావ్యాన్ని రాశారు. ఇందులో ప్రాచీన సంస్కృతిలో పరిణయానికి ఉన్న ప్రాముఖ్యతను తెలిపారు. 1900-1967 మధ్య కాలంలో సదాశివపేటలో జీవించిన బచ్చు వేంకటేశ్వరగుప్త జిల్లా సాహితీ పాండితులలో ఒకరు. తన రచనల ద్వారా నైజాం సర్కారును ఎదురించిన సాఫిక రాజకీయ సాహితీ పరులు. ఈయన జీర్ణోద్ధారము, అమృత బిందువులు, ఆంధ్రభాషా పోషణము, గీతాసారము

మొదలగు రచనలు చేశారు. సరళమైన శైలిలో రచనలు చేసి భాషా, సంస్కృతులు నిజాం పాలనలో ఉనికి కోల్పోతున్నాయని ఆవేదన చెందారు. వాటిని పునరుద్ధరించుకోవాలన్న సందేశాన్ని తన రచనల ద్వారా సమాజానికి చేరవేశారు. మెదక్ జిల్లా సాహిత్యంలో పేర్కొనదగిన ప్రజ్ఞాశాలి, దుబ్బాక ప్రాంతానికి చెందిన కవి వేలేటి అంబదాసశర్మ(1940–1969). నిజాం పరిపాలనా కాలంలో అత్యధిక ప్రజలు మాట్లాడే భాష తెలుగు. వ్యవహారంలో తెలుగులో స్వచ్ఛత పూర్తిగా పోయే ప్రమాదం ఉన్న దశలో అంబదాసశర్మ తెలుగులో కవిత్వం రాశారు. దుబ్బాక గ్రంథాలయ నిర్మాణానికి ఎనలేని కృషి చేశారు. ఏ కారణాలచేతనో ఇతడు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు కానీ, ఇతడు రాసిన 'దీనవీణ'(కవితాసంపుటి)అనే రచన కానీ, ఇతర రచనలు కానీ వెలుగులోకి రాలేదు. ఇతడు అతిపిన్న వయసులోనే కాలం చేశారు. వేలేటి అంబదాసశర్మ జీవించిన కాలానికి కొంచెం అటూ ఇటుగా అయనకు సమకాలికుడు అయిన ఎం. వీరయ్య మంచి కవిగా జిల్లాలో గుర్తింపు పొందారు. ఈయన రాసిన 'నేస్తం' అనే రచన ఇతన్ని ఉత్తమ కవిగా నిలబెట్టింది. ఇదేగాక 'చిరిగినచొక్కా', 'చరిత్రలో గోలకొండ అధ్యాయం', 'కలవరింతలు', 'పలవరింతలు' తదితర రచనల ద్వారా ఈ కవి సామాజిక ప్రయోజనాన్ని కాంక్షించాడు. ఈ వరుసలో చెప్పుకోదగిన మరో కవి శ్రీమాన్ ముడుంబై వరదాచార్యులు. ఈయన ఛందోబద్ధమైన కవిత్వాన్ని సంస్కృత, తెలుగు భాషలలో రాయగల సత్తువ దండిగా ఉన్నవాడు. రెండు భాషల్లో అనేక రచనలు చేసి మెప్పించాడు. చక్కని, చిక్కని గేయ కవిత్వాన్ని రాయటంలో వీరికి వీరేసాటి.

1970–80 దశకం విప్లవ కవిత్వోద్యమ కాలం. సామాజిక అవసరాల వలన సమాజంలో మార్పులు సహజం. మార్పు కొత్తదనానికి నాంది పలుకుతుంది. సమాజంలో మార్పులు కలుగుతున్నట్టే సాహిత్యంలోనూ మార్పులు చోటుచేసుకుంటాయి. ఈ సమయంలో తెలంగాణ ప్రాంత ప్రజల ఉద్యమం–కవిత్వం రెండూ పెనవేసుకొని సాగాయి. ఇక్కడ జరిగినట్టి ఉద్యమం చారిత్రాత్మకమైంది. ఇది భూమి, భుక్తి, విముక్తి కోసం ఉద్యమించింది. జిల్లాలో రాజకీయ సాయుధ పోరాటాన్ని నిర్మిస్తూనే మరోవైపు కవితాస్త్రాలు సంధించిన అజ్ఞాత కవులు కవిత్వ చరిత్రను విప్లవోన్ముఖం చేశారు. పెన్నూ గన్నూ పట్టే ప్రతిభావంతమైన కవిత్వం కవుల్ని మెదక్ జిల్లా తన కడుపులోనే దాచుకుంది. "యుద్ధరంగాన నిలబడి కవిత్వం రాయటం చాలా అరుదైన విషయం. నిర్బంధ వలయాల వేళ శిఖరాలు జారిపోతున్న సంక్షోభ సమయాన యుద్ధరంగమ్మీద 'యోధుడి'గా నిరంతరంగా నిలబడటం గొప్ప సాహసం. అట్లా చెక్కుచెదరని వీరునిగా నిలబడి కవిత్వ వాక్యాలు చెప్పటం, తద్వారా విప్లవోద్యమాన్ని, సాహిత్యాన్ని ఉన్నతంగా నిర్మించటం"[17]లో భాగంగానే సముద్రుని 'భూమి నాతల వెల నిర్ణయించు', 'మృత్యువే మరణిస్తుంది'(1992)అనే కవితా సంపుటాలు ప్రచురితమైనాయి. కౌముది కవిత్వంతో రాష్ట్ర సాహిత్యాభిమానుల్ని ఆకర్శించాడు. అమ్మ జ్ఞాపకాలతో, తన అడవి జీవితానుభావలతో 'చనుబాల ధార' ప్రచురితమైంది. కౌముది కవిత 2006లో వెలువడింది. 'మంజీర' మెదక్ జిల్లా ఉద్యమం చేస్తూ ఉత్తమ కవితలు రచించాడు.

మెదక్ జిల్లాలో కవిత్వాన్ని అందించిన కవులలో కనపర్తిరాఘవాచార్యులు ఒకరు. 'గీతంసంకేతం', 'అక్షరశిల్పాలు', 'వెలుతురుపూలు', 'రాళ్ళు', 'ముళ్లు' ఇలా దాదాపుగా నలభై వరకు వచన కవిత్వానికి సంబంధించిన రచనలు చేశారు. మెదక్ జిల్లాకు ఆనుకొని ఉన్న ఇతర జిల్లాల్లో పొడసూపిన ఉద్యమాల, ప్రగతిశీల సాహిత్య ప్రభావం జిల్లా కవుల్ని ఉత్తేజితుల్ని చేసింది. ఆ భావనతో ఉమాపతి పద్మనాభశర్మ, జాలపల్లి చంద్రారెడ్డి, విఠాల శ్రీకాంతశర్మ, రక్కాభట్ల కృష్ణమూర్తి ఈ నలుగురు కవులు కలిసి 1970లో 'ఋతచేతన'(వచన ఖండికలు) ప్రచురించారు. తర్వాత సరిగ్గా నాలుగు సంవత్సరాలకు 1974లో కందుకూరి శ్రీరాములు, కర్నాల బాలరాజు, నందిని సిధారెడ్డి ముగ్గురి మినీ కవితలతో 'దివిటి' ప్రచురితమైంది. తెలుగు సాహిత్యంలో వచ్చిన మొదటి మినీ కవితా సంపుటి ఇది. ఈ సంపుటి మెదక్ జిల్లా నుండి రావడం జిల్లాకు మరింత ఖ్యాతిని తెచ్చిపెట్టింది. ఈ సాహిత్య కదలిక మరికొంతమంది కవుల్ని ముందుకు నడిపింది. "అగ్నిజ్వాల కలం పేరుతో భగవంతరెడ్డి ఆవేశపూరితమైన కవితలు రాశారు. సిధారెడ్డి, మహమూద్ పాషా కొత్త గొంతుల్తో విప్లవాన్ని నినదించారు. సరిపల్లి కృష్ణారెడ్డి, గులాబీల మల్లారెడ్డి ప్రేరణ ఒక వాతావరణ కల్పనకు దారితీసింది. కె. అంజయ్య 'చైతన్య సాహితి' ఏర్పాటుచేసి 1981లో 'గీతాయుధం' ప్రచురించారు. మందకొడిగా సాగుతున్న సాహిత్య రచన తీవ్రతరం చెయ్యాలని 1986లో మంజీరా రచయితల సంఘం స్థాపన జరిగింది. ఉత్సాహవంతులైన యువకులు మరసంలో క్రియశీలంగా పనిచేస్తూనే కవితారచనలో బాధ్యతాయుత పాత్ర నిర్వర్తించారు. మహమూద్‌పాషా 'ఉనికి' సంపుటిని జులై 20, 1986న డా. సి. నారాయణరెడ్డి ఆవిష్కరించాడు. మెదక్ జిల్లా గర్వించదగిన కవి, మలిదశ తెలంగాణ ఉద్యమంలో 'నాగేటి చాల్లల్ల నా తెలంగాణ', 'అమరులకూ జోహార్' అనే పాటలు వినిపించగానే గుర్తుకు వచ్చే కవి నందిని సిధారెడ్డి. తను పొందిన ప్రజా ఉద్యమాల, సాహితీ జ్ఞానాన్ని మరసం రూపంలో

వ్యాపింపజేయటంలో కృతకృత్యులయ్యారు. సిధారెడ్డి కవిత్వం గుర్తుకు వచ్చినపుడల్లా నినాదాల్లా గోడలమీద, ఉద్యమకారుల నాలుకలపై ఆడిన పంక్తులు గుర్తొస్తాయి. 'మా మౌనాన్ని అప్రమత్తతే అనుకుంటావు/కానీ తెలుసో తెలియదో/గోడకు వేలాడే తుపాకీ కూడా మౌనంగానే ఉంటుంది'. ఆయుధాల్లాంటి అక్షరాల్ని ఎక్కుపెట్టే సిధారెడ్డి 1987లో 'భూమిస్వప్నం' కవితా సంపుటి వెలువరించాడు. ఇది ఫ్రీవర్స్ ఫ్రంట్ అవార్డు, దాశరథి అవార్డులను గెలుచుకున్నది. కవిత్వాన్ని గాయాల గొంతుకగా మలచిన సిధారెడ్డి 1991లో 'సంభాషణ', 1995లో 'ప్రాణహిత', 2001లో 'ఒక బాధగాదు' తర్వాత 'ఇక్కడిచెట్లగాలి' కవితా సంపుటులు ప్రచురించాడు. ఒకవైపు సాహిత్యాన్ని మరోవైపు ప్రజా ఉద్యమాలను సమన్వయం చేస్తూ నడిసిన మెతుకుసీమ అక్షరం నందిని సిధారెడ్డి. జిల్లా ఆధునిక కవిత్వంలో కందుకూరి శ్రీరాములు మరో ప్రగతిశీల స్వరం. 'వయోలిన్ రాగమో వసంతమేఘమో' కవితా సంపుటి ప్రచురించగా దానికి ఉమ్మిడిశెట్టి అవార్డు లభించింది. కవ్వం, దహన కావ్యం, సందర్భం, పీఠభూమి శ్రీరాములు ఇతర రచనలు.''[18]ఈయన ఇవే కాకుండా వెన్నెల బలపం, రావురూకుల, తెలంగాణ రథం, అలుకుపిడచ మొదలగు కవిత్వ పుస్తకాలని ప్రచురించారు. అనేక సాహితీ పురస్కారాలని కూడా ఈయన అందుకున్నారు. వీరితో పాటుగా జిల్లాలో సమన్వయ కవులుగా ధర్మారెడ్డి బాలరెడ్డి, దాశరథుల బాలయ్య, నలుగోటి సుదర్శనరెడ్డి, పడిగె నారాయణ, అమ్మన చంద్రారెడ్డి, నాయకం వేంకటేశం, అద్దంకి తిరుమల కృష్ణమాచార్యులు తదితరులు సామాజిక ప్రయోజనం చేకూరే రచనలు చేసి మెదక్ జిల్లా సాహితీ చరిత్రలో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారు.

జీవితమే ఇక పోరాటంగా ఎదుగుతూ వచ్చిన కవి ఎస్వీ సత్యనారాయణ. పల్లె జ్ఞాపకాలను, ప్రజలను సాహిత్యంలో సామాజిక సమానత్వ ఉద్యమాలను ప్రాణప్రదంగా గుండెలకు అద్దుకున్నవాడు ఎస్వీ సత్యనారాయణ. ఈయన 1985లో 'జీవజ్వాల', 'యుద్ధం జరుగుతూనే ఉంది', 'జీవితం ఒక ఉద్యమం' కవితా సంపుటాలను ప్రచురించారు. 1986లో మరసం జిల్లాకు చెందిన వివిధ కవుల రచనలను ఒకచోట చేర్చి 'కదలిక' అనే కవితా సంకలనాన్ని తీసుకువచ్చారు. మెదక్ జిల్లా సాహితీ రంగానికే కాకుండా తెలుగు ముఖ్యంగా తెలంగాణ సాహిత్య రంగానికి ఎనలేని కృషి సల్పిన వారిలో ఎస్వీ సత్యనారాయణ ఒకరు. పద్యరచనలో సిద్ధహస్తుడైన ఏలేశ్వర నాగభూషణాచార్య ఆధునిక ఉద్యమ కవిత్వ ప్రేరణతో రచనలు చేశారు. 1991లో ఆయన ప్రచురించిన 'నేలతడవని వాన' జీవన దర్శనంలో, భాషలో జిల్లా ముద్రను సంతరించుకున్నది. సునిశితమైన పనితనమున్న కవి మోతుకూరి అశోక్‌కుమార్. ఈయన 'సంతకం', 'కొల్పులోల్లం', 'పిట్టగూడు' మొదలైన కవితా సంపుటాలని వెలువరించాడు. ఈయన తన కవిత్వంలో సామాజిక వాస్తవికతను కన్నులకు కట్టినట్లు వ్యక్తీకరించారు. తన కవిత్వంలో జీవిత నకల పార్శ్వాల్ని అన్ని కోణాల్ని(చిత్రించి)అక్షరబద్ధం చేసి జిల్లా కవితాలోకంలో తనకంటూ ప్రత్యేకమైన ముద్రను, గుర్తింపుని పొందారు.

తరం మారుతున్న కొద్దీ వచ్చే తరాలలో, కాలంలో మార్పులు చోటుచేసుకుంటాయి. మెదక్ జిల్లా సాహిత్యంలో కావచ్చు, కవిత్వంలో కావచ్చు అనేక పరిణామాత్మకమైన మార్పులు చోటుచేసుకున్నాయి. సామాజిక ఉద్యమాల ప్రభావం, ముందు తరం కవుల ప్రేరణ ఇవన్నీకూడా ఆధునిక తరం కవుల్ని ప్రేరణ దిశగా మరల్చాయి. అలా వచ్చిన వాళ్లలో అలాజిపూర్ కిషన్ ఒకరు.“అత్యంత నిరసన ప్రదర్శించే గొంతుక అలాజిపూర్ కిషన్. తన కలం పేరు ఆవాజ్. ఉద్యమం పట్ల ఉన్న మమేకం కిషన్ గొంతులో పదునెక్కింది. 1996లో వడిసెల కవితా సంపుటి ప్రచురించాడు. గ్రామీణ నేపథ్యంలో స్వచ్ఛ హృదయ స్పందనలతో పప్పుల రాజిరెడ్డి కవిత్వం రాస్తున్నారు. ప్రజల స్థితి, రైతాంగ ఉద్యమ చైతన్యాన్ని వర్ణిస్తూ 'వరదగూడు' 1996లో ప్రచురించాడు. బాల్యంలోని ఆరాటం లాగే మానవ సంబంధాల కోసం వెతుకుతున్న కవి ఐలేని గిరి. కరిగిన కలలు, పెరిగిన సంక్షోభాలను ప్రతిబింబించే కవితలతో 1996లోనే 'నెమలికన్ను' ప్రచురించాడు. విప్లవ భావాలతో నారాయణస్వామి 'కల్లోల కలల మేఘం' ప్రచురించాడు. పురాజ్ఞావకాలతో 'సందుక' చిత్రించాడు.”[19]సరకుగా మారిన సంస్కృతిని మరసం నిరసిస్తూ, సామ్రాజ్యవాద వ్యతిరేక కవిత్వాన్ని కొత్త గొంతులతో వినిపిస్తూ 1996లో 'మొగులైంది' అనేకవితా సంకలనం ప్రచురించింది. 2001లో పదహారుమంది కవులతో 'ఎడపాయలు' ప్రచురించి రాష్ట్ర సాహిత్య చరిత్రలో మెదక్ జిల్లా తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నది. ఉద్యమాలకు ఊపిరిపోస్తున్న తెలంగాణ భావన సంకలనం నిండా విస్తరించింది. ప్రముఖ గాయని బెల్లి లలితను రాజపోషకులు హత్య చేసినప్పుడు గాయకురాలు యాదిలో 'పాట సంతకం'ను 2000ల సంవత్సరంలో ప్రచురించింది. అదేవిధంగా 2016లో 'మెతుకు కతలు'(52 కథలు)అనే పేరుతో జిల్లాలో తొలి కథల పుస్తకాన్ని తీసుకువచ్చింది. మెదక్ జిల్లా ఆధునిక కవిత్వాన్ని సుసంపన్నం చేసిన వాటిల్లో 1973లో కస్తూరి లలితారాణి రాసిన భావజ్వాల, 1979లో మెదక్ మండల(జిల్లా)రచయితల సంఘం వాళ్లు 'కలం గీసిన చిత్రాలు'(కవితా సంకలనం), 1965లో మెదక్ జిల్లా రచయితల

సంఘం వాళ్లు 'సమర్పణ', 1967 వచ్చిన 'రస తరంగాలు', 1976లో వచ్చిన 'తరంతరం', ప్రజాసాహితీ వారి'నూరు అలల హోరు', మొదలైన కవితా సంకలనాలు, సంపుటులు జిల్లాలో సామాజిక చైతన్యాన్ని నింపాయి. కవులు స్వంతంగానే కాకుండా సంస్థల ద్వారా కూడా సాహితీ సేవ చేశారు. జిల్లాలో సాహిత్య వాతావరణాన్ని కలిగించటంలో కీలక భూమిక పోషించిన మరసంతో పాటుగా జిల్లాకు చెందిన దాదాపు(ఇరువై వరకు ఉన్నట్టి)అన్ని సాహితీ సంస్థలు కవిత్వంలో నిత్య నూతనత్వాన్ని ప్రదర్శిస్తూ, సామాజిక ప్రయోజనమే పరమావధిగా భావిస్తూ పోటీపడి పుస్తకాలను ప్రచురిస్తూ సమాజాన్ని జాగృతం చేయటంలో ఇవి ప్రధాన భూమికని పోషించాయి.

పరిపాలనాపరమైన నిరాదరణ, ద్రవ్యవసతి, ప్రోత్సాహం, జీవనోపాధి లోపాల వలన, వెనకబాటుతనంగా పేరుపడి న్యూనతాభావం దెబ్బతీసిన కారణంగా విజ్ఞులైన అందరు సాహితీవేత్తలు గుర్తింపు పొందలేదు. మెదక్ జిల్లా కవులకు తమ సాహిత్యం ప్రయోజనకారిత్వం సాధించాలనే కాంక్ష తప్ప వారు పేరు ప్రతిష్టలకు పాకులాడలేదు. పుస్తకాలు అచ్చు వేయకపోయినా తమ రచనలతో ప్రతిభను చాటుకున్న కవులెందరో జిల్లాలో ఉన్నారు. 1984 నుండి ఉద్యమం పొందుతున్న విస్తృత దశను మంచికట్ల రాజయ్య 'మైదానం మేల్కొంటున్న వేళ'గా చిత్రించి జనావేశాన్ని వ్యక్తం చేశాడు. ప్రజా ఉద్యమాలతో మమేకం చెందుతూ ఖైదీల హక్కుల పరిరక్షణోద్యమంతో ప్రేరితుడై దేశపతి శ్రీనివాస్ 'బందీకాని గొంతుక' కవిత రచించాడు. ఇది చాలా ప్రాచుర్యం పొంది ఆంగ్లంలోకి అనువాదమైంది. సంగారెడ్డి నుండి విశాల్ సరైన ప్రాపంచిక అవగాహనతో మంచి కవితలు రాశాడు. వేముగంటి మురళి తెలంగాణ ప్రాంతీయ ముద్రతో కవిత్వం రాశాడు. కె. రంగాచారి ప్రపంచీకరణ మీద రాసిన కవిత ప్రాచుర్యం పొందింది. వందలాది విప్లవ గీతాలు రచించి లక్షలాది మందిని ఉర్రూతలూగించే గద్దర్ 'గద్దర్ పాటలు' ప్రచురించాడు. కథా కథనాన్ని సినిమాగా మలిచే నిర్మాత, సుప్రసిద్ధ దర్శకుడు, చిత్రకారుడు, కవి, కథకుడు అయిన బి.నరసింగరావు కవితలు, పాటలు రచించారు. బెల్లంకొండ సంపత్‌కుమార్, సిద్దెంకి యాదగిరి, అమ్మనచంద్రారెడ్డి, ఎన్నవెళ్ళి రాజమౌళి, వరుకోలు లక్ష్మయ్య, ఉండ్రాల రాజేశం, దాసరాజు రామారావు, తైదల అంజయ్య మొదలగువారు జిల్లా సాహిత్యాన్ని సుసంపన్నం చేస్తున్నవాళ్ళలో కొందరు.

## 6. మెదక్ జిల్లా కవయిత్రులు-సాహిత్యం

మెదక్ జిల్లా సాహిత్యంలో రచయిత్రుల ప్రాతినిధ్యం తక్కువగానే ఉంది. జిల్లా సాహిత్య చరిత్రని ఆసాంతం గమనించినప్పుడు రాణీ సర్దేశాయి వేంకట లక్ష్మాయమ్మ దగ్గర మొదలుకొని 2000 సంవత్సరం వరకు దాదాపుగా 15 నుంచి 20 మంది ప్రసిద్ధిపొందిన కవయిత్రులు జిల్లా సాహితీ చరిత్రలో స్థానాన్ని సంపాదించుకున్నారు. కవయిత్రుల ప్రాతినిధ్యం తక్కువగా ఉన్నప్పటికీ వారు చేసిన పనులు కావచ్చు, రచనలు కావచ్చు జిల్లాపై ప్రభావవంతమైన ముద్రని వేశాయి. "మెదక్ జిల్లాలో మహిళా రచయిత్రులు మూడు వేరు, వేరు సామాజిక రాజకీయ సందర్భాలలో పెద్ద ఎత్తున కవి సమ్మేళనాలు నిర్వహించారు. అవి 1. ఆంధ్ర మహిళా సభ ఆవిర్భావం సందర్భంగా జోగిపేట గుట్టమీద జరిగింది. 2. మంజీర రచయితల సంఘం సిద్దిపేటలో నిర్వహించిన మహిళా సభ. 3. జనసాహితి రచయితల సంఘం మెదక్ జిల్లా యూనిట్ నిర్వహించిన మద్యపాన వ్యతిరేకత సాహిత్య సభ. వివిధ స్వచ్ఛంధ సంస్థలు, ప్రజా సంఘాలు కలిసి పాల్గొన్నాయి(1996 మెదక్)."[20]

జిల్లా సాహిత్యంలో మొదటగా చెప్పుకోదగిన కవయిత్రి రాణీ సర్దేశాయి వేంకట లక్ష్మాయమ్మ. ఈమె రాజకీయ పాలనా వ్యవహారాలలో దక్షులుగా ఉంటూనే "సాహిత్యంలో గొప్ప కవయిత్రి విదుషీమణి"[21]గా కీర్తించబడ్డారు. 1934లో వెలువడిన గోలకొండ కవుల సంచికలో ఈ కవయిత్రి రాసిన 'మానసబోధ'లోని పద్యాలు అచ్చయ్యాయి. రాజవంశీయురాలు అనే గర్వం లేకుండా జనరంజక పాలనను అందించి ప్రజల మన్ననలు పొందటంతో పాటుగా మంచి రచనలు చేసి జిల్లా సాహితీ జగత్తులో సుస్థిరమైన స్థానాన్ని సంపాదించుకున్నారు. ఈ వరుసలో పేర్కొనదగిన మరొక కవయిత్రి విరబాయి(జననం 1889). ఈమె బాహుబాషా కోవిధులు. 1930 జోగిపేటలో జరిగిన ప్రథమాంధ్ర మహిళా మహాసభకు అధ్యక్షులుగా వ్యవహరించారు. ఈమెలో అధ్యాత్మికచింతన అధికంగా ఉన్నప్పటికీ తన రచనల ద్వారా సామాజిక ప్రయోజనాన్ని కాంక్షించారు. ఈ కవయిత్రి 'బాలాత్రిపుర సుందరీదేవి' పద్యాలు వందకుపైగా రాశారు. భజనస్తోత్రాలు, మంగళ హారతి, జోల, లాలి పాటలు అచ్చమైన దేశీయ పదాలతో రచనలు చేసి సమకాలీన కవుల్ని ఒప్పించిన ధీశాలి. సాంప్రదాయికంగా వస్తున్న దీర్ఘ సమాసాలకు, క్లిష్టతకు స్వస్తి చెప్పి సామాన్యులకు సైతం అర్థమయ్యే రీతిలో నిత్యం మాట్లాడుకునే భాషలో చిన్న చిన్న పదాల్ని ఉపయోగించి రచనలు చేసిన కవయిత్రి విరబాయి. మెదక్ జిల్లా ఆధునిక సాహిత్యంలో పేర్కొనదగిన మరో కవయిత్రి ఎం. పుష్పలత (జననం1944). ఈమె బహుభాషా కోవిధులు. సాహిత్యం అంటే ఎనలేని ఆసక్తి కనబరిచేవారు.

తెలుగు సాహిత్యంలో గురజాడ రచనలని అమితంగా ఇష్టపడి అధ్యయనం చేశారు. పద్య, గేయ, వ్యాస ప్రక్రియలలో రచనలు చేసి జిల్లా సాహిత్యంలో తనకంటూ ఒక స్థానాన్ని ఏర్పరచుకున్నారు. సామాజిక బాధ్యతే ప్రధాన లక్ష్యంగా తలచి రచనలు చేసిన కవయిత్రి కస్తూరి లలితారాణి. ఆధునిక భావాలతో, సామాజిక మార్పును కాంక్షించి 1973లో 'భావజ్వాల' అనే కవితా సంకలనాన్ని ప్రచురించారు. ఏకవచనంలో నుండి బహువచనంలోకి మారడం అంత సులువేమికాదు. సాహితీవేత్తకైనా, సామాజిక కార్యకర్తకైనా, సమసమాజంకోసం పరితపించే ప్రతిఒక్కరికి ఉండవలసిన ప్రాథమిక లక్షణం అది. అట్లాంటి సామాజిక దృక్పథంతో లలితారాణి రచనలు చేశారు. సామాజిక చైతన్యమే పరమావధిగా రచనలు చేసిన మరో కవయిత్రి ప్యారక సీతాదేవి. పద కవితలు, మంగళ హారతి పాటలు రచించారు. పీడిత ప్రజల పక్షపాతియై ఆర్థిక స్వాతంత్ర్యమే అణగారిన వర్గాల అభివృద్ధికి బాటలు వేస్తుందని ఆ దిశగా మనం అడుగులు వేయాలని తన రచనల ద్వారా సమాజాన్ని జాగృతం చేసిన కవయిత్రి సముద్రాల విమల. ఆధునిక యుగంలో ప్రధానంగా ప్రపంచీకరణ యుగంలో ఛిదిమివేయబడుతున్న సామాన్యుల జీవితాల్ని వస్తువుగా స్వీకరించి రచనలు చేసింది పుష్యమి రచయిత్రి. ఈ వరుసలో పేర్కొనదగినవారు శ్రీ సంపన్ముదుంబై యశోద, కరిపాకం ఆండాళమ్మ, బాగమ్మ. వీళ్ళు పద్యాలు రాసినా, పాటలు రాసినా, గేయ, వచన కవిత్వం రాసినా వాటిల్లో ఆధునికమైన భావాల్ని వ్యక్తపరిచారు. ఈ పురుషాధిక్య సమాజం ఎన్నో ఆటుపోట్లకు గురిచేసినా తనంతట తానుగా నిలదొక్కుకుని రచనలు చేసి అందరూ సమానమే అన్న శాస్త్రీయ భావనని వ్యక్తపరచిన రచయిత్రి ఉడయవరల నాంచారమ్మ. ఈమె గోదాకళ్యాణం రచనతో పాటుగా నిజాం పతనాన్ని పద్యాల రూపంలో రచించారు. నాంచారమ్మ పురుషులతో సరిసమానంగా సాహిత్య కార్యక్రమాల్లో పాలుపంచుకున్నారు. పురుషులతో పోల్చి చూసినప్పుడు రచయిత్రుల శాతం తక్కువే అయినా జిల్లా సాహిత్యానికి వారు అందించిన సేవలు మాత్రం కొనియాడదగినవి. జిల్లాకు చెందిన "ప్రేమలత, ఊర్మిళాదేవిలతో పాటు మరసం 30 మంది మహిళా సభ్యులతో కవి సమ్మేళనం నిర్వహించడం జిల్లా స్త్రీ శక్తిని చాటింది. శాస్త్రుల దుర్గ(మెతుకుసీమ విజ్ఞాన సర్వస్వ సహాయ రచయిత్రి), ఎస్.వి. సుందరి(1944), సరోజనీబాయి(జహీరాబాద్. 1951), కుమారి జె. సావిత్రి(మెదక్. 1950), శ్రీమతి శంకరమ్మ(జహీరాబాద్), శ్రీమతి మేరి(జహీరాబాద్), శ్రీదేవి,"[22]బాలసరస్వతి, జంగిటి శాంతకుమారి, సామ సువర్ణాదేవి(సిద్దిపేట), విజయలక్ష్మి, గిరిజ, జలజారాణి, దేవేంద్ర(దుబ్బాక), శైలజ(మృత్యుంజశర్మగారి కూతురు), ఉమ, అన్నాడి జ్యోతి, ఎడ్ల లక్ష్మి మొదలగు రచయిత్రులు జిల్లా సాహిత్యానికి ఊత కర్రలా తమ సేవలందించారు.

### 7. మెదక్ జిల్లా పాట సాహిత్యం

తెలుగు సాహిత్యంలో పాటది ఓ ప్రత్యేకత. జిల్లాలో చాలామంది కవులు, రచయితలు పాటలు రాసి, పాడి తమకంటూ ఒక ప్రత్యేకతని చాటుకున్నారు. అందులో ప్రసిద్ధులు గద్దర్(పొడుస్తున్న పొద్దుమీద), నంధిని సిధారెడ్డి (నాగేటి చాల్లల్ల, జోహార్లు), దేశపతి శ్రీనివాస్(తెలంగాణ చెరువు తీరు మన జయశంకరు సారు), రసమయి బాలకిషన్(నెత్తికి రుమాల్ జబ్బకు గొంగడి, ధూంధాం కార్యక్రమం), బీమసేన(దండమో ధీనాబంధులకు), చీకోడు నర్సింలు(పచ్చని పొలాల నడుమ), ఎన్సాన్‌పల్లి ప్రభాకర్(సిద్దిపేట చీరకట్టి), బండారు నర్సింలు(అన్నా రారారో రైతన్నా లేలేరో), మాసాయిపేట యాదగిరి, ఐతా చంద్రయ్య, దాసరాజు రామారావు, దరువు ఎల్లన్న మొదలగువారితో పాటుగా దాదాపుగా యాభై మందికిపైగా మెదక్ జిల్లాలో పాటలు రాసి, పాడేవారున్నారు అనటంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. జిల్లానుంచి 'సెమటసుక్కలు', 'నాగేటి చాల్లల్ల', 'పాటగొంతుక', మొదలగు పాటల పుస్తకాలు వచ్చాయి. ఆడియో, వీడియో రూపంలో కూడా జిల్లాకవులు రాసి, పాడిన పాటలు కూడా రికార్డ్ అయ్యాయి. అయితే మెదక్ జిల్లా పాటమీద పరిశోధన జరగవలసిన అవసరం ఎంతైనా ఉంది.

### ముగింపు

మెదక్ జిల్లా ఆధునిక సాహిత్య ఆవిర్భావ, వికాసాల్లో జిల్లా కవులతో పాటుగా ఇతర జిల్లాల నుండి (దాదాపుగా 30 మంది వరకు)ఉద్యోగనిమిత్తం కావచ్చు లేదా ఇతర కారణాల వలన కావచ్చు వచ్చిన కవులు సైతం వారి వారి పాత్రను దిగ్విజయంగా పోషించారు. జిల్లా సాహిత్య వికాసానికి తమ వంతు కృషి చేశారు. వీరిలో ముఖ్యులు మల్యాల దేవీ ప్రసాదు, తైదల అంజయ్య, వేణు సంకోజు, ఆదిరెడ్డి, జింబో, కందుకూరి రమేష్‌బాబు, శాస్త్రుల లక్ష్మి, విజయ రాజకుమార్, ఎస్. సుదర్శనరెడ్డి, ముళ్ళపూడి సచ్చిదానందమూర్తి, హిమజ్వాల, అమ్మంగి వేణుగోపాల్, ఏనుగు నర్సింహారెడ్డి మొదలగువారు సరైన ప్రాపంచిక అవగాహనతో మంచి రచనలు చేసి మెదక్ జిల్లా సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు. మెదక్ జిల్లా నుండి దాదాపుగా నూట అరవై మందికి పైగా బలమైన కవిత్వం రాస్తున్న కవులున్నారు. విశేషమేమిటంటే ఈ కవుల్లో కొందరికి తెలంగాణ ఉద్యమమే ఊపిరిపోసింది. జిల్లాకు చెందిన సముద్రుడు, కౌముది, మంజీర లాంటి ఉద్యమ కవులు చాలా

మందికి సుపరిచితమే. వీళ్ళ కవిత్వ వారసత్వాన్ని పునికిపుచ్చుకున్న వాళ్లు, కొనసాగిస్తున్న వాళ్లు మెదక్ జిల్లాలో కనిపిస్తారు. సాహితీ సాంస్కృతిక విశేషాలు ప్రజల్లో ప్రచారం చేయటానికి, సాహితీ సృజనవైపు కొత్త తరాల్ని ఆకర్షించటానికి జిల్లాలో దాదాపుగా పదిహేడు సాహితీ సంస్థలున్నాయి. ఇందులో కొన్ని సంస్థలు మినహా మిగతావి తెలంగాణ కవిత్వ తోవలో క్రియాశీల పాత్ర వహిస్తున్నాయి.

ఇప్పటివరకు మెదక్ జిల్లానుండే దాదాపుగా వందకు పైగా కవిత్వ సంపుటులు, సంకలనాలు వచ్చాయి. వాటినిండా తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని, దౌర్జన్యాలను, తెలంగాణ ఉద్యమం నడుస్తున్న తీరు, మరణాలు, ప్రపంచీకరణ, వలస, కరువు, పల్లెజీవన విధ్వంసం మొదలైన జీవిత సకల పార్శ్వాలకు సంబంధించిన కవిత్వం కన్పిస్తుంది. వాటన్నింటిని ఇక్కడ పేర్కొనడం స్థలాభావం వల్ల సాధ్యపడడంలేదుగాని రాశిలోనూ, వాసిలోనూ అవి ఎన్నదగినవి. “అన్ని ఉద్యమ కవిత్వాల విషయంలో జరిగినట్టే, తెలంగాణ కవిత్వంలో సైతం తరచు పలచటి రచనలు, బలహీనమైన, అనుచితమైన వ్యక్తీకరణలు తారసపడతాయి. భావుకత ఏమాత్రం లేకుండా శుష్కమైన సిద్ధాంత చర్చలు చేసిన కవితలూ కనిపిస్తాయి. ఒక భౌగోళిక ప్రాంతంలో విస్తారంగా వ్యాపించిన భావోద్వేగాలు ఎన్నో రకాల, స్థాయిల వ్యక్తీకరణలకు ఒక చారిత్రకమైన గుర్తింపు ఉంటుంది.”(శ్రీనివాస్, కె. మునుం. 2012: 29)అంటారు తెలంగాణ కవిత్వం గురించి ప్రముఖ పాత్రికేయులు, సాహిత్య విమర్శకులు కె. శ్రీనివాస్‌గారు. ఈ మాటలు మెదక్ జిల్లా కవిత్వానికి కూడా అన్వయిస్తాయనుకుంటాను. ఆధునిక యుగంలో ఎవరి చరిత్రని వారే చెప్పుకోవాలన్న స్పృహ బలంగా ముందుకు వచ్చింది. ఈ సోయి అన్ని జిల్లాల మేధావుల్ని, చరిత్రకారుల్ని, సాహితీవేత్తల్ని తట్టిలేపింది. తమగురించి తాము పరిశోధించుకోవడం, చారిత్రక మూలాలను వెలికి తీయడం, వర్తమానంలో ఉన్న పరిస్థితుల్ని విశ్లేషించుకోవడం పెరిగింది.

**ఉపయుక్తగ్రంథ సూచి**


1. దేవీప్రసాదు, మల్యాల. 1969. మెదకు మండల సాహిత్య చరిత్ర. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి. hyd.

2. నందిని సిధారెడ్డి, గుమ్మన్నగారి బాలశ్రీనివాస మూర్తి, బెల్లంకొండ సంపత్‌కుమార్, వెల్దుర్తి హర్షవర్ధన్, ప్యారకశేషాచార్యులు మొదలగు మెదక్ జిల్లా సాహితీవేత్తలతో జరిపిన ముఖాముఖి చర్చలు.

3. నారాయణరెడ్డి, సుంకిరెడ్డి. 2009. ముంగిలి(తెలంగాణా ప్రాచీన సాహిత్యం). తెలంగాణ ప్రచురణలు.

4. బాలశ్రీనివాసమూర్తి, గుమ్మన్నగారి. 1993. సాహితీ మంజీర. జాతీయ సాహిత్య పరిషత్. సిద్దిపేట.

5. మంజీర రచయితల సంఘం(జూలై 20,21, 1996)పదేళ్ళ మహాసభల ప్రత్యేక సంచిక.

6. మెతుకుసీమ చరిత్ర-సంస్కృతి. 2009. మంజీరా రచయితల సంఘం ప్రచురణ.

7. మెదక్ జిల్లా రచయితల మహాసభల(1976, 1979)సందర్భంగా వెలువరించిన సంచికలు.

8. రఘురామశర్మ, శాస్త్రుల. 2001. మెతుకుసీమ విజ్ఞాన సర్వస్వం. మెతుకుసీమ సాహిత్య పరిషత్తు.

9. శివశంకర్, పాపినేని. 1996. సాహిత్యం-మౌలిక భావనలు. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్. హైదరాబాదు.

10. శ్రీనివాస్, కె. 2015. తెలంగాణ సాహిత్య వికాసం. తెలంగాణ ప్రచురణలు.

11. సంపత్‌కుమార్, బెల్లంకొండ. 2009. 20 శతాబ్దపు మెదక్ జిల్లా రచయితల సాహిత్యం-వివిధ ధోరణులు. సిద్ధాంత వ్యాసం.


**పాదసూచికలు:**

1. శివశంకర్, పాపినేని. 1996: 38, 2. బాలశ్రీనివాస మూర్తి, గుమ్మన్నగారి. 1993:1 3. నారాయణరెడ్డి, సుంకిరెడ్డి. 2016: 19, 4. మెదక్ జిల్లా రచయితల మహాసభల సంచిక. 1979: 27, 5. మెతుకుసీమ చరిత్ర-సంస్కృతి. 2009: 19, 6. బాలశ్రీనివాస మూర్తి, గుమ్మన్నగారి. 1993: 11, 7. నారాయణరెడ్డి. సి. 2011: 1, 8. నాగయ్య, జి. 2004: 670, 9. సంపత్‌కుమార్, బెల్లంకొండ. 2009: 58 10. మెతుకుసీమ చరిత్ర-సంస్కృతి. 2009: 88, 11. మెతుకుసీమ చరిత్ర-సంస్కృతి. 2009: 90, 12. సంపత్‌కుమార్, బెల్లంకొండ. 2009: 160, 13. మెతుకుసీమ చరిత్ర-సంస్కృతి. 2009: 90:14. మెతుకుసీమ చరిత్ర-సంస్కృతి. 2009: 91: 15. మెదక్ జిల్లా రచయితల మహాసభల సంచిక. 1979: 28:16. దేవీప్రసాదు, మల్యాల. 1969: 148: 17. సముద్రుడు. 1992: 2: 18. మెతుకుసీమ చరిత్ర-సంస్కృతి. 2009: 91: 19. మెతుకుసీమ చరిత్ర-సంస్కృతి. 2009: 92: 20. సంపత్‌కుమార్, బెల్లంకొండ. 2009: 163: 21. దేవీప్రసాదు, మల్యాల. 1969: 95: 22. సంపత్‌కుమార్, బెల్లంకొండ. 2009: 169.


**రచయిత: తెలుగు అధ్యాపకులు,**

**ప్రభుత్వ డిగ్రీ కళాశాల**

# ప్రాచీన తెలుగు సాహిత్యంలో రుద్రమదేవి

సి.హెచ్.విఠల్

**పరిచయం:**

దక్షిణాపథంలో తెలుగు ప్రాంతాన్ని సుదీర్ఘకాలం పాలించిన వంశీయులు కాకతీయులు. వారి కీర్తి చరిత్ర పరంగా అజరామరమైనది. మొదటి ప్రతాపరుద్రుడి నుండి మొదలుకొని చివరి ప్రతాపరుద్రుడి వరకు వారికి సంబంధించిన చరిత్ర తెలుగు వ్మాయంతో ముడిపడి ఉంది. కాకతీయులలో గణపతి దేవ చక్రవర్తి అగ్రగణ్యుడు. గణపతి దేవునికి మగ సంతానం లేదు. గణపతి దేవ, సోమాంబలకు ఇద్దరు సంతానంగా కుమార్తెలు జన్మిస్తారు. వారు రుద్రమదేవి, గణపాంబలు. గణపతి దేవునికి పుత్ర సంతానం లేమి కారణంగా రుద్రమదేవినే పురుషునిగా పెంచి, భావి చక్రవర్తిగా యువరాజుగా నియమిస్తాడు. ఆ తర్వాత కాకతీయ సామ్రాజ్య చక్రవర్తిగా (సామ్రాజ్ఞి) రుద్రమదేవి పాలన పగ్గాలు చేపట్టి విశేష పరిపాలన అందించింది. ఇంతటి విశిష్టతను సంపాదించుకున్న రుద్రమ దేవి గురించి ప్రాచీన తెలుగు సాహిత్యం ఘనంగానే ప్రస్తావించింది. ఈ విధంగా ప్రస్తావించిన తెలుగు సాహిత్యాన్ని, అందులో రుద్రమదేవి ఔన్నత్యాన్ని తీర్చిదిద్దిన విధానాన్ని తెలుసుకోవడం ఈ వ్యాస ముఖ్యోద్దేశ్యం.

**కీలక పదాలు:** రుద్రమ దేవి, గణపతి దేవుడు

మానవ జీవన వికాసానికి చరిత్ర రచన రాచబాటలాంటిది. చరిత్ర, సాహిత్యం పరస్పర అవినాభావ సంబంధము గలవి. ఏ చరిత్రకారుడైనా తన రచనలో ఆశ నిరాశల్ని ప్రతిబింబిస్తాడు. తాను జీవించే సమాజం, కాలంతో రూపుదిద్దబడ్డవాడిగా కాలానికి అద్దం పడతాడు. ఈ విధంగా ఒక చరిత్రకారుని దృక్పథం అతని సామాజిక, రాజకీయ, సాంస్కృతిక, ఆర్థిక విషయాలు ఆయా కార్య కలాపాల్లో ఉంటుంది.

"శాసన సాహిత్య ఆధారాలను పురావస్తు ఆధారాలతో సమన్వయపరచనిదే చరిత్ర పరిశోధన శాస్త్రీయం కాదన్న అభిప్రాయాన్ని కోశాంబి పదే పదే వ్యక్తం చేసాడు" (డి. డి. కోశాంబి పరిచయం. కె. బాలగోపాల్. ప్రాచీన భారతదేశ చరిత్ర, పుట: 02)

"చరిత్ర రచన గతానికి వర్తమానానికి మధ్య జరిగే అనంతమైన సంభాషణ" అని ప్రముఖ చరిత్రకారుడు ఇ. హెచ్. కార్ నిర్వచించారు.

ప్రసిద్ధ చరిత్రకారుడు డి. యన్. కోశాంబి గారు జానపదాల నుండే చరిత్రను ప్రారంభించాలని అప్పుడే చరిత్రకు సమగ్ర స్వరూపం వస్తుందని పేర్కొన్నట్లు 'తెలంగాణ సంస్కృతి కళలు అనే గ్రంథంలో డా. రావి ప్రేమలత ఉద్ఘాటించారు. (తెలంగాణ సంస్కృతి – కళలు పరిశోధనా గ్రంథం, పుట: 287)

"శాస్త్రమేదైనా, సాహిత్య రూపమేదైనా వ్మాయ పరమార్థము విశ్వ మానవ కోటి కళ్యాణమే" అని 'తెలుగులో చారిత్రక కావ్యములు' తన సిద్ధాంత గ్రంథంలో శ్రీమతి సీతా కళ్యాణి పేర్కొనడం జరిగింది. ఈ విషయాల సారాంశం బట్టి సాహిత్యానికి చరిత్రకు అవినాభావ సంబంధం ఉంది. ప్రాచీన కావ్యాలలో, ఆధునిక సాహిత్య ప్రక్రియల రచనలలో కాకతీయ నాటి చారిత్రక విషయాలు రుద్రమదేవి జీవితంతో ముడిపడి ఉన్నాయి.

12 వ శతాబ్దంలో విశాల తెలుగు రాజ్యమైనా కాకతీయ సామ్రాజ్యంలో రుద్రమదేవి ప్రస్థానం అనన్య సామాన్యమైంది. ఆ కారణంగానే తెలుగు కవులు, కావ్యాలు, లఘు కృతులు, ఖండకావ్యాలు, నవల, నాటిక బుర్రకథ, ఏకపాత్రాభినయం లాంటి రచనల్లో రుద్రమదేవి కథానాయికగా చిత్రించబడటం తెలుగు జాతికే ఖ్యాతిని తెచ్చి పెట్టింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత వైభవ సంస్కృతుల చారిత్రక అంశాల మీద పరిశోధనలు ముమ్మరమవుతున్న నేపథ్యంలో రుద్రమదేవి జీవితచరిత్ర ఆధారంగా ప్రాచీన తెలుగు సాహిత్యంలో రుద్రమదేవి గురించి ఏ ఏ రచనల్లో ప్రస్తావన ఉందో పరిశీలిద్దాం.

**ప్రతాపరుద్ర చరిత్రము:**

కాకతీయ రాజ వంశీయుల చరిత్రను తెలిపే గ్రంథం 'ప్రతాపరుద్ర చరిత్రము'. ఇది ఏకామ్రనాథుడి వచన రచన. ఈ రచన క్రీ.శ 1490 – 1509 మధ్య కాలంలో వెలువడిందని చరిత్రకారుల అభిప్రాయం. రుద్రమదేవి తొలి ప్రస్తావన గల

గ్రంథంగా 'ప్రతాపరుద్ర చరిత్రము' ను చెప్పవచ్చును. క్రింది వచనాన్ని పరిశీలిస్తే "రుద్రమహాదేవి వీరపుత్రి గావున పద్మాక్షి దేవి దత్తంబైన ఖడ్గ ఖేటకంబులు సింహాసనంబున నిడి శివదేవయ్య గారి యనుమతంబున రాజ్యంబు పాలించుచుండెను" (ప్రతాపరుద్ర చరిత్రము, పుట: 66,) యాదవ రాజు మహాదేవునితో రుద్రమదేవి పక్షం రోజులపాటు యుద్ధం చేసి అతడిని ఓడించి యుద్ధ నష్టపరిహారంగా కోటి ధనరాసులను పొందినట్లు క్రింది వచనంలో చూడవచ్చును. "అంత దేవగిరి రాజు సమస్త సేనాసమేతుండై యేకశిలా నగరంబుపై విడిసిన వారలతో నెదిరించి యొక పక్షంబు ఘోర యుద్ధంబు జేసి మూడు లక్షల పదాతుల నుగ్గుజేసి లక్ష గుఱ్ఱంబుల నేలగూలజేసెను. పారిన వారల వెన్ను తగిలి దేవగిరి జొచ్చు పర్యంతము దరిమి వారి నుంచి కోటి ద్రవ్యములు కానుకబట్టె. మఱియు నా ద్రవ్యంబు తన సరదార్లకు పచ్చి పెట్టించెను. అచ్చట జయస్తంభములు వేయించి వార తనుయాజులకు లోనుజేసెను మరియు నేకశిలా నగరంబు ప్రవేశించెను" (ప్రతాపరుద్ర చరిత్రము, పుట: 66, 67)

ఈ రచననుసరించి ద్విపద రచన 'శ్రీ సిద్దేశ్వర చరిత్రము' కావ్యంలో కాసె సర్వప్ప ఇదే విషయాన్ని ప్రస్తావించాడు.

"కనుగొన దేవగిరి కడగాఁగఁ దరిమి
శంఖముల్ మ్రోయించి చెలఁగనపుడు
పుంఖాను పుంఖముల్ పొదివి పోనీక
తాకినవారును దలఁకి భయమున
నాకగొనక రుద్రమాంబకు నపుడు
కోటి ద్రవ్యంబును గొమరొప్పనిచ్చి'' అని

యుద్ధరంగంలో రుద్రమదేవి పరాక్రమాన్ని, ఆమె విజయాన్ని కవి వర్ణించాడు. దేశీ సాహిత్య ప్రక్రియ ద్విపదలో రుద్రమ దేవి గురించి చిత్రించడం చారిత్రక విశిష్టతను తెలియజేస్తుంది. ఇది చరిత్ర రచనకు ప్రామాణిక గ్రంథంగా, పరిశోధనకు మచ్చుతునకలాంటిదని చెప్పవచ్చును.

**తెలుగు కావ్యాలలో రుద్రమదేవి:**

తెలుగులో రుద్రమదేవి గురించి వచ్చిన కావ్యాలలో ఏటుకూరి వెంకట నరసయ్య 'రుద్రమదేవి' కావ్యం విశిష్టమైనది. ఇందులో రుద్రమదేవి అందాలను వర్ణించిన తీరు అద్భుతంగా ఉంది.

"గోదుమ వన్నె నొక్కుల జటావాటిలోఁ
దపియించు రుదురాక తావళమ్ము
గ్రైవేయనాళాగ్ర కనక సూత్రమునందు
జక్కించి కొలువుండఁ జంద్రధరుఁడు
శివచింత నాదీన జిహ్వాగ్రమునయందు
విహరించు నకలంక వేదమాత
నిరతమ్ము దయామాన నేత్రకోణములందు
రంజిల్లు ననుపమ రాజనీతి
తనకు సొమ్ములుగా శైవతాపసుండు
గొనబు పట్టు తివాసి పైఁ గూరుచుండి
చెంత నాసీనయై శుభాశీస్సులంది
కేలు మోడ్చిన తన శిష్యురాలి కనియె'

రుద్రమ ఎల్లప్పుడు శివున్ని ఆరాధించే తత్వం గలిగి, తన నాలుకపై శివ నామస్మరణ పాడుతూ రాజ్య పాలన చేసేది. సకల వేదాలను ఔపోసన పట్టిన నేర్పరి. నిరంతరం తన మనో నేత్రంలో దయ, కరుణ గల స్త్రీ మూర్తిగా ఆమె గురు దేవుడు శివదేవయ్య రుద్రమను చూశాడు.

**ఆంధ్ర పురాణంలో రుద్రమదేవి:**

వీరనారి రుద్రమదేవి ఔన్నత్యం గురించి మధునా పంతుల సత్యనారాయణ శాస్త్రి ఆంధ్ర పురాణం కాకతీయ పర్వంలో తెనుగు రాణి పరిచ్ఛేదంతో రుద్రమదేవి జీవిత చరిత్ర మొదలవుతుంది. ఆమె వీరత్వాన్ని, సౌందర్యాన్ని గురించి ఈ క్రింది పద్యంలో ఎంతో చక్కగా వర్ణించాడు.

సీ.పసిఁడి పూఁత మెఱుంగఁ భావకోళ్ళ ధ్వనింప
లయతాళ భంగు లుల్లసిలు నడక
నడుము వంపక సిగ్గువడక కంబము వోలె
నిలువున నిలుచుండ గలుగు పొలుపు
నిలుచుండి యభినయంభులు లేక గంభీర
పుంభావమున బల్కు పొందికయును
కాలిపై గాల్మోపి కేలి వ్రేళులు గడ్డ
మున కాని కూర్చుండు పొదిలికయును
గీ. సొగసు చిగురింప ముసిముసి నగవుతెరకు
వెనుకఁ దారాడు బలదర్ప విలసనంబు
నరసి కనిపట్టిన్ రుద్రమాంబ చదురు
పదికి బదిపాళ్ళు వీర సంపదకు గుదురు
(ఆంధ్ర పురాణము, కాకతీయ పర్వము, పుట: 121)

బంగారు పూత మెరుపులు గల పావుకోళ్ళు (పాదరక్షలు) ధరించి నడుస్తున్నప్పుడు అవి అయాన్వితంగా శబ్దం చేస్తుండగా, నిటారుగా కూర్చుండి, సిగ్గుపడకుండా పురుషుని వలె మాట్లాడుతూ, కాలిపై కాలువేసి గడ్డము క్రింద వేళ్ళను ఆశించి

కూర్చోని అందమైన చిరునవ్వు, బలమైన దర్పము లక్షణాలు కలిగి ఒక సంపూర్ణమైన వీర వనితగా ఉందని చక్కని స్వభావోక్తి అలంకారములో రుద్రమదేవిని వర్ణించాడు కవి. ఆమె రూపాన్ని, మూర్తిమత్వాన్ని ఒకే పద్యంలో చక్కగా ఆవిష్కరించాడు కవి.

**'కీర్తి తోరణము' కావ్యంలో రుద్రమదేవి:**

ప్రముఖ కవి, విమర్శకుడు, కథా రచయిత ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి కీర్తి తోరణము అనే ఖండకావ్యంలో కాకతీయ చరిత్ర, పాలన విశేషాలు, శిల్ప వైభవాలను కథా వస్తువుగా తీసుకొని కీర్తి తోరణాన్ని రచించారు. ఇందులో రుద్రమదేవి ప్రాశస్త్యాన్ని పద్య గేయాలలో ఎంతో చక్కగా వర్ణించాడు కవి.

"జానపదుల గీతి జాతి జీవమ్మంత
తొనకుచుండు కండ తెనుగు పలుకు
నందు రాణి రుద్రమాంబ పౌరుష గాథ
లోన భద్రకాళి కానిపించె " అంటూ ఓరుగల్లు పుర వీధులలో రుద్రమ గొప్పదనం గురించి ప్రజలు పాడుకుంటున్నారు అన్నారు కవి.

రుద్రమ దేవి వర్ణన:

మిసమిసలాడే నవ్వుల పువ్వురా
కత్తి పోరులే నేర్చెను వి
ల్లెత్తి గుఱిని తెగటార్చెను
గుబ్బములన్ పరపించెరా క
న్నెఱ్ఱ వైరి కనిపించెరా!
తెనుగు రాచ పెనుగద్దియ చే
కొనుచు నిలిచెనా ముద్ధియ!

అని రుద్రమ విశ్వరూపాన్ని, ఆమెను సింగము నెక్కిన కాళిమాతగా వర్ణించాడు కవి. ఇక్కడ చక్కని రూపకాలంకారము ప్రయోగించబడినది.

**"మహారాణి రుద్రమదేవి" కావ్యంలో రుద్రమదేవి:**

వావిలాల నరసింహారావు రచించిన ఈ కావ్యం రుద్రమదేవి జీవితచరిత్రను ఆవిష్కరిస్తుంది. రుద్రమదేవి గురించి తెలుగులో వచ్చిన కావ్యాలలో అరుదైనది. రుద్రమదేవి ఎంత ప్రజ్ఞావంతురాలో ఈ కావ్యం తెలియజేస్తుంది. ఆమె పాండిత్యాన్ని, ధైర్య సాహసాలను పరాక్రమాన్ని ఇందులో ఎంతో చక్కగా వర్ణించాడు కవి.

సీ. అఖిలార్థ శాస్త్ర రహస్య సర్వసమ్ము
గరతాలామలకముగా బరించె
రాజ్యాంగ తంత్రమర్మములు శిక్షాస్మృతుల్
గొన నాల్క మీదనే గుప్తపఱించె,
పంచతంత్ర ప్రతాప ప్రయోగమ్ముల
నభ్యాసవశమున నలవరించె
శాసనకల్ప విస్రంభోపధావిధా
సంధాన నైపుణి సారమెఱిగె
బలముల గదల్చి పగరపై బడుటనేర్చె
నభ్యవస్కందనమ్ముల నాకళించె
వ్యూహరచనము తద్భగ్న మూహజేసి
భద్రపీఠస్థ గాబోవు రుద్రమాంబ.

రుద్రమ అఖిల శాస్త్రాలు చదివింది. ఎన్నో శాస్త్ర విద్యలు నేర్చుకుంది. రాజ్య తంత్రములలో ప్రవీణురాలు. శిక్షా స్మృతులను నేర్చింది. రుద్రమ మాటకు,చేతకు తిరుగులేదు. ఆమె మాటే శాసనంగా మారేదని, ఆమె సార్వభౌమత్వాన్ని, మూర్తిమత్వాన్ని ఒకే పద్యంలో వర్ణించడం కవి ప్రతిభను ఇనుమడింపజేసింది.

**'ఉదయ శ్రీ' కావ్యంలో రుద్రమదేవి:**

కరుణ శ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రి రచించిన 'ఉదయ శ్రీ' గేయ కావ్యంలో 'రుద్రమదేవి' భాగంలో రుద్రమదేవి గొప్పదనాన్ని కొనియాడాడు కవి. ఇందులో రుద్రమదేవి జననం, ఆనాటి పరిస్థితులు, ఓరుగల్లు నగర వర్ణన, గణపతిదేవుని పౌరుషం, స్వయంభూ దేవాలయం, రామప్ప గుడిలోని శిల్ప సౌందర్యం, ఏక వీరాదేవి ప్రాశస్త్యం, వేయి స్తంభాల గుడిలో భక్తుల భక్తి పారవశ్యం, కాకతీయ సైన్యాల బలాబలాలు, హరిహర మురారుల కుట్ర, దేవగిరి ప్రభువు మహా దేవరాజు ఓరుగల్లుపై దండయాత్ర, రుద్రమ పౌరుషం, దేశభక్తి, సామ్రాజ్ఞిగా రుద్రమ ఔచిత్యం, పరిపాలన విశేషాలను ప్రసిద్ధ గేయాలలో వర్ణించాడు కవి. అందులో ఒక గేయాన్ని పరిశీలిద్దాం.

'ఆంధ్ర పౌరుషము చిందాడు కాకతి చమూ
నాయకులతో దండు నడిపె రుద్రమదేవి
దేశ రక్షణ మహోద్దేశ సిద్ధికి తెల్గు
బిడ్డలను చెయ్యెత్తి పిలిచె రుద్రమదేవి'

శత్రువులపై దండయాత్ర చేయుటకు కాకతీయ సేనలను ముందుకు నడిపించడంలో రుద్రమదేవి అసామాన్య ప్రతిభను దేశ రక్షణ విషయంలో రుద్రమ చూపిన ధైర్య సాహసాలు ఈ కవిత ద్వారా వ్యక్తపరిచాడు కవి.

"వీరనారీ శిరోమణి భారతీయ
గౌరవ పతాక రుద్రాంబికామతల్లి
విజయ దుందుభి మ్రోగించి ప్రజల నేలే

దేశమందెల్ల సుఖశాంతి తేజరిల్ల'

రుద్రమదేవి భారతదేశ గౌరవ ప్రతీక అని ఆమె వీరనారీ శిరోమణియై విజయ ఢంకాలను ప్రయోగించి ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించేలా పాలన చేసిందని కవి రుద్రమదేవి విశేషాలను ఎంతో చక్కగా వర్ణించాడు.

**మేడిచర్ల ప్రభాకరరావు 'రుద్రమదేవి' పద్యకావ్యం:**

మహారాజ్ఞి రుద్రమదేవి జీవితచరిత్రను, వస్తువుగా తీసుకొని కవి కావ్యంగా మలిచాడు. ఇతడు ఆధునిక కవి. చారిత్రక వీరనారి రుద్రమదేవి జీవిత గాథను పద్యాలలో ఆవిష్కరించాడు. ముఖ్యంగా రుద్రమ శౌర్యాన్ని, వీరత్వాన్ని చక్కగా వర్ణించాడు.

"కాంతారంబును సొచ్చెను
కాంతను నేనని తలవక కాళికయగుచున్
కాంతా రోదన విని నా
ప్రాంతము వెదుకుచు వెడలెను భ్రాంతిని చెడకున్"

అని మహదేవుడి సామంతుడు నాగరాజును రుద్రమ చెల్లెల్ని ఎత్తుకెళ్లినప్పుడు రుద్రమదేవి నాగరాజుతో యుద్ధం చేసి తన చెల్లెల్ని విడిపించుకుంటుంది.

స్త్రీ జాతి గౌరవాన్ని నిలబెట్టేలా రుద్రమదేవి గృహిణిగా, మాతృమూర్తిగా, పాలకురాలిగా సమాజ సేవలో ముందుండి కీర్తి ప్రతిష్టతలను కలిగి స్త్రీ సాధికారతను సాధించి చరిత్రకు సాక్ష్యంగా నిలిచింది. తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాలను విచ్చిన్నం కాకుండా ఒకే తాటిపై నిలబడేలా సామంత రాజులను సమన్వయం చేస్తూ, ఎదురు తిరిగిన వారిపై ఉక్కుపాదం మోపింది. విశాల తెలుగు భూ వలయాన్ని కంటికి రెప్పలా కాపాడుకుంది. రాజ్య పాలనలో దక్షత, ప్రజాసంక్షేమం కొరకు సంస్కరణలు చేయడం జీవిత చరమాంకం వరకు యుద్ధాలలో మునిగి ఉండడం ఆమె దేశభక్తికి నిదర్శనమని చెప్పవచ్చును. రాజ్యం విపత్కర పరిస్థితులలో ఉన్నప్పుడు పాలన పగ్గాలు చేపట్టి శత్రువులను సింహస్వప్నంలా ప్రజలకు మహారాజ్ఞిగా మారడం ఆనాటి సమాజంలో విశేషమని చెప్పవచ్చు. ఉత్తర భారతదేశం నుండి తురుష్కుల దండయాత్రను అడ్డుకొని దక్షిణపథంలో స్థిరమైన రాజ్యాన్ని నిలబెట్టుకుంది. ఆమె క్రీ.శ 1262 నుండి 1289 వరకు పాలించింది.

అబలలు సబలలు అని నిరూపించింది ఒక చారిత్రక ధృవ తారగా చరిత్ర పుటల్లో నిలిచింది. స్వేచ్ఛ మహిళకు ప్రతీకగా స్త్రీ ఆత్మగౌరవానికి సమున్నత పతాకగా గెలిచి నిలిచిన కాకతీయ మహా సామ్రాజ్య భార ధారణి రాణి రుద్రమదేవి. నల్లగొండ జిల్లా (ప్రస్తుతం సూర్యపేట) చందుపట్లలో లభించిన శాసనంలో రుద్రమదేవి మరణ ప్రస్తావన ఉంది. శివ సాయుజ్యం పొందిన కాకతీ రుద్రమదేవి. మల్లికార్జున నాయకులకు ధర్మువుగా పువ్వుల ముమ్మిడి అనే బంటు సోమనాథ దేవునికి కొంత భూమిని దానం ఇచ్చినట్లు ఈ శాసనం పేర్కొంటున్నది. దీన్ని బట్టి రుద్రమదేవి నవంబర్ 27, 1289 ముందే మరణించినట్లు చరిత్రకారులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికి వెలుగులోకి వస్తున్న శాసనాలు రుద్రమదేవికి సంబంధించిన నూతన విషయాలు సరికొత్త చరిత్రకు సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. ఇప్పటికి మన కవులు, రచయితలు తమ మదిలో దేశభక్తి ఉప్పొంగినప్పుడు వీరావేశం ఆవహించినపుడు రుద్రమదేవి నామధేయాన్ని స్మరించకుండా ఉండలేరని చెప్పడం ఏ మాత్రం అతిశయోక్తి కాదని చెప్పవచ్చును.

తెలుగు సాహిత్యంలో అనేక మంది రచయితలు, కవులు వివిధ ప్రక్రియలలో సృజనాత్మక రచనలు చేయడం తెలుగు వారి అదృష్టమనే చెప్పాలి. భావితరాలకు మన పూర్వీకులు చరిత్రకు సంబంధించిన విషయాలు అందించడంలో కవులు, రచయితల పాత్ర మహోన్నతమైన కృషికి నిదర్శనమని చెప్పవచ్చును.

**ఆధార గ్రంథాలు :**


1. ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి, కీర్తి తోరణము
2. ఏకామ్రనాథుడు, ప్రతాపరుద్ర చరిత్రము
3. ఏటుకూరి వెంకట నరసయ్య, రుద్రమదేవి పద్యకావ్యం
4. కాసె సర్వప్ప, సిద్ధేశ్వర చరిత్రము గ్రంథము
5.. జంధ్యాల పాపయ్య శాస్త్రి, ఉదయ శ్రీ, గేయ కావ్యము.
6. డి. డి. కోశాంబి, కె. బాలగోపాల్, ప్రాచీన భారతదేశ చరిత్ర.
7. పి.వి పరబ్రహ్మ శాస్త్రి, కాకతీయులు.
8. మదునాపంతుల సత్యనారాయణ, ఆంధ్ర పురాణము, (కాకతీయ పర్వము)
9. రావి ప్రేమలత, తెలంగాణ సంస్కృతి – కళలు, పరిశోధన గ్రంథం.
10. సీతా కళ్యాణి, తెలుగులో చారిత్రక కావ్యములు



★ రచయిత: పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ ఓయూ